సాహిత్య ప్రస్థానం
జనవరి 2019

సంపుటి : 18 | సంపాదకీయం | సంచిక : 1

# వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం

దేశంలో ప్రతి కంప్యూటర్‌పైనా నిఘాపెట్టేందుకు పది సంస్థలకు అనుమతినిచ్చిన కేంద్ర ప్రభుత్వచర్య అప్రజాస్వామికమైంది. నిఘా నీడలో పౌరులు బతకాల్సిరావడం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం. ఇంటలిజెన్స్ బ్యూరో, సిబిఐ, రెవెన్యూ ఇంటలిజెన్స్, ఎన్‌ఐఎ, సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర పదిసంస్థలు ఎవరి కంప్యూటర్‌లోకైనా అధికారికంగా జొరబడటం, గోప్యతను, స్వేచ్ఛను గంగలో కలిపే చర్య. గత ఎన్నికల్లో ప్రధాని మోడీ విజయానికి ప్రధానంగా దోహదం చేసిన సోషల్‌మీడియానే ఇప్పుడు ప్రభుత్వానికి అతి పెద్ద సవాలుగా కనిపిస్తుంది. బడా మీడియాను దాని అధిపతుల సాయంతో ఆడించవచ్చును గాని కోటానుకోట్ల మంది చేతుల్లో నడిచే సోషల్ మీడియాను నియంత్రిత మార్గంలో నడిపించడం అసంభవం. అందుకే దాని పీక నులమాలంటే ముందు సంకెళ్లు వేయాలి. ఎవరు ఏం రాస్తున్నారో వారి నేపథ్యమేమిటో నిఘా వేయాలి. ఆరెస్సెస్, బిజెపిల మతతత్వ రాజకీయాలను ఏకపక్ష పోకడలను విమర్శించే వారందరిని వెంటాడాలి. అసలు ముందే ఒక అభద్రతా వాతావరణం సృష్టించి హడలగొడితే ఎవరూ విమర్శకు, ప్రశ్నించడానికి సాహసించరు. ఇది ఏలిన వారి సంకల్పం. గతంలో గోవింద పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్ వంటి వారి ప్రాణాలు తీయడంపై తీవ్ర నిరసనవ్యక్తమైంది. జెఎన్‌యు, హెచ్‌సియు వంటి చోట్ల ప్రజాస్వామిక సంస్థలపై, మేధావులపై దాడులు ఖండనకు గురైనాయి. అందుకే ఇప్పుడు దేశభద్రత ముసుగులో స్వంత పౌరులపైనే నిరంతర విశృంఖల నిఘా వేసి వేధించేందుకు సర్కారు సన్నద్ధమైంది. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం ఎవరి కంప్యూటర్‌లో నిక్షిప్తమైన సమాచారమైనా నిఘా సంస్తలు హస్తగతం చేసుకోవచ్చు. దాని ఆధారంగా వారిని ముప్పు తిప్పలు పెట్టొచ్చు. విడ్డూరమైన విషయమేమంటే మన పోస్టును ఎవరైనా అవాంఛనీయ వ్యక్తి వీక్షించినా మూల రచయితపై ఆంక్షలు అదుపులు వచ్చేస్తాయి. ఇన్ఫర్మేషన్ చట్టం 2000 సెక్షన్69(1) కింద ఈ నియంత్రణను నిఘాను అనుమతిస్తున్నట్టు కేంద్రం చేసిన ప్రకటనను ప్రతిపక్షాల మీడియా సంస్థలు ప్రజాస్వామిక ఉద్యమ కారులూ తీవ్రంగా నిరసిస్తున్నారు. సర్వీసు ప్రొవైడర్‌తో సహా అందరూ శిక్షను అనుభవించాల్సి వస్తుంది. పైగా ఏది నేరం ఏది కాదు అని నిర్ధారించే అధికారం కూడా వారిదే గనక దేన్నయినా నేరంగా చూపించవచ్చు. ప్రభుత్వానికి నిఘా సంస్థలకూ హద్దూ ఆపులేని అధికారాలు కట్టబెడుతున్న ఈ చట్టం చాల ప్రమాదకరమైంది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు కూడా భంగకరమైంది. వెంటనే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలి. అప్పటివరకూ అందరూ పోరాడాలి. లేకుంటే ఈ దాడి ఇంతటితో ఆగదు. ఇదంతా సుప్రీంకోర్టు తీర్పు ఆదేశాల ప్రకారం చేస్తున్నట్టు సమర్ధించుకుంటున్నా అది సాకు మాత్రమే.

◆◆◆

*పాఠకులకు, రచయితలకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.* ◆

సంపాదకవర్గం:
**తెలకపల్లి రవి** ప్రధాన సంపాదకుడు
**వొరప్రసాద్** వర్కింగ్ ఎడిటర్
**కె. సత్యరంజన్** ◆ **చీకటి దివాకర్**
**గనారా** ◆ **శమంతకమణి**
**కెంగార మోహన్**
**కె.లక్ష్మయ్య,** *మేనేజర్*

బొమ్మలు: **తుంబలి శివాజి**
**గంగాధర్ వీర్ల, చిదంబరం**

కవర్ డిజైన్: **బ్రౌన్**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

**ISSN No: 2581 - 7477**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
**1 సంవత్సర చందా రూ. 240/-** ◆ **5 సంవత్సరాల చందా రూ.1000/**
◆ **10 సంవత్సరాల చందా రూ. 2000/-**
**Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada**
**A/c No. 52001500585, IFSC: SBIN0020343**
చెక్కులు, డిడిలపై **prasthanam** అని రాయగలరు.

**కథలు**


కొత్త బొమ్మ – గనారా.................................. 5
నమ్మకం – కె. ఉషారాణి.............................. 16
ఓ.. పలకరింపు – శ్రీహర్ష............................ 34
చలివేంద్రం – జాతశ్రీ ...................................... 42


**కవితలు**


మౌనధీర – వాణి........................................ 4
కలనేత చీర – వైష్ణవిశ్రీ................................. 12
శబ్ద కలుషం – బండి ప్రసాదరావు...................... 12
అలా తిరిగొద్దాం రా! – నూనెల శ్రీనివాసరావు........ 15
నువ్వూ – నేను – డా॥ ఎం. ప్రగతి..................... 21
మానవత్వపు వర్షం – రోహిణి వంజరి................. 21
ఒక్కోసారి – యామినీ దేవి కోడే......................... 25
జంక్షనులో టీకొట్టు– బొద్దూరు విజయేశ్వరరావు...... 25
అక్షర అంగారకుడు – రత్నాల బాలకృష్ణ............... 28
ముసిరిన చీకటి – గరికపాటి మాష్టారు................. 33
నా కలల్ని ఎవరో తగలబెట్టారు
– మహబూబ్ బాషా చిల్లె.......................... 33
కార్యశూరుడు – జంధ్యాల రఘుబాబు................. 37
అరణ్యం ప్రవేశించే సమయం
– పాయల మురళీకృష్ణ............................ 38
నానీలు – సాంబశివరావు తోపుల....................... 38
ప్రజాస్వామ్యం – డా॥ ఎస్. సత్యప్రసాద్................ 41
రెండో పార్శ్వం – ఉండవల్లి. ఎమ్...................... 41
మొలకెత్తని విత్తనం – దాముగట్ల హిదయ్‌తుల్లా....... 50
చిందేద్దాం – చిరుమామిళ్ళ ఆంథోని.................... 50
కొత్త ఊడ – శ్రీధర్ చౌడారపు.......................... 53
వలసపోతోన్న 'అనంత' రైతుకు – నవీన్ కుమార్.... 54
ఏకవర్ణ విచ్ఛేదనం – డా॥ ఎం. హరికిషన్............. 54
నాలో నేను – అడపా రామకృష్ణ........................ 57
చుట్టుముట్టిన సుమసుగంధం
– సిహెచ్.వి. బృందావనరావు..................... 58


**వ్యాసాలు**


పవిత్ర స్మృతులు (కందుకూరి శతవర్ధంతి వ్యాసం)
– శ్రీమతి నాళం సుశీలమ్మ.........................9
ఘంటసాల గొంతులో శ్రీశ్రీ పాట– సక్కిరి భాస్కర్.... 13
సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2018 పురస్కారాలు.... 15
సంక్లిష్టత నుండి సరళత దిశగా తెలుగు భాష
– భమిడిపాటి గౌరీశంకర్..........................22
కవిత్వం సామాజిక ప్రయోజనం కోసం రాయాలి
– పక్కి రవీంద్రనాథ్ : ఇంటర్వ్యూ: పాయల....... 26
భారతీయ ముస్లింల హృదయ స్పందన 'సాయిబు'
– షేక్ ఇబ్రహీం...................................29
కవిత్వపు 'అగ్నిశిఖ' కకోర – రాచమళ్ళ ఉపేందర్....39
నూతన సంకేతాలు ముందున్న సమరాలు
– తెలకపల్లి రవి...................................51
సాహితీస్రవంతి కవనయాత్ర
– మార్ని జానకిరామ్ చౌదరి...................... 55
అనంతపురంలో కందుకూరి నూరవ వర్ధంతి
– డా॥ ఎం. ప్రగతి............................... 58
స్వీకారం..................................................60
డైరీ ........................................................62



**కవిత**

## మౌన ధీర...


- వాణి
9441345651




అనాది ఆభిజాత్యాల
ఇనుప కచ్చడాలు తొలగి
స్వతంత్ర కిరణాల వెలుగు రేఖలు
చిలకలై ఎగిరాయి
స్వేచ్ఛా పావురాల రెక్కలు తొడిగి
దిక్కులన్నీ తిరిగొచ్చేలోగా
నిరంకుశ నిర్బంధ తెరలేవో రగిలి
నిరాశ ముసుగులలో నలిగి
పెల్లుబికిన అసమాన భావజాల
చీకట్లను మరల చీల్చుకుంటూ
ఎలుగెత్తిందో గళం
దురాచారాల దుర్గంధ మాలిన్యాన్ని
మౌఢ్య వాదాల ముసుగుల్ని
తొలగించడానికి
తార్కికవాద తిరస్కార
సమర శంఖం పూరించి
కదిలిందో పాదం..
కాలిబాట పొడవునా చిమ్మిన
నెత్తుటి చారికల జాడల్లో
తరాలన్నీ తరలి రాగల
వినూత్న సంకల్పానికి
ఋత్విజులమనే సందేశమే
నవ సమాజ ప్రణవగీతం
అవిద్య అజ్ఞానాలకు చరమగీతం
'మా' నవ చైతన్య యుగళగీతం ♦



# కొత్తబొమ్మ

- గనారా
99492 28298

మడిబట్టతో గోడకు తగిలించిన దేవుడి పటాలు దగ్గరకు వెళ్ళి, కళ్ళు మూసి నిష్ఠతో నమస్కారం చేసాడు వీరబ్రధం. తన వృత్తిలో ఇదొక భాగమే. పక్కనున్న తండ్రి ఫొటోకు నమస్కరించి విభూది నుదిటిన రాసి, కుంకుమబొట్టు పెట్టుకుని ప్రక్క గదిలోకి వెళ్ళాడు. నిదానంగా బట్టలు మారుస్తుంటే భార్య వచ్చి టిఫిన్ బల్లపై పెట్టింది.

"చల్లారిపోతుంది."

హెచ్చరించి వెళ్ళింది.

పది నిమిషాలు అయ్యేసరికి మరో హెచ్చరికతో ఆలోచన నుండి బయటపడ్డాడు.

వీధి అరుగు మీదకు వచ్చి ఇంటి ముందున్న పాకలోకి పరిశీలనగా చూసాడు.

మరో పని చేతకాక, చెయ్యలేక ఇద్దరు నడివయసు దాటినవారు మట్టిబొమ్మల మధ్య కూర్చొని సన్నని పొడవైన చెక్క బ్లేడుతో సరైన ఆకృతిని తెస్తున్నారు.

"ఎంతకాలం ఇలా నడుస్తుంది?"

అనుకుంటూ పాకలోకి ప్రవేశించాడు. చాలా స్టాకు ఉంది. ఆయా పండుగల సందర్భంలో కొన్ని అమ్మకం జరిగినా కొన్ని మిగిలిపోతుంటాయి. వాటిని చుట్టుప్రక్కల గ్రామాల సంతలలో అమ్ముతుంటారు. పట్టణాలలో, గ్రామాలలో క్లాసు దేవుళ్ళే కాకుండా ఏజెన్సీలలో దేవతల విగ్రహాలను తయారుచేసి అమ్ముతుంటారు. వాటిని అట్టపెట్టెలో పెట్టి రంపంపొట్టు, చిత్తుకాగితాల మధ్య పెట్టి పంపుతుంటారు. వారం పదిరోజులు అక్కడే సంతల్లో ఉండి విక్రయిస్తుంటారు.

ఈ తతంగం అంతా తండ్రి నుంచి వారసత్వ సంపదగా వచ్చింది వీరబధ్రానికి. విశ్వాసాలు, వృత్తి ధర్మాలు మారలేదు. ఆశలు, ఆశయాలు ఉన్నప్పటికి అనుకూలంగా మార్చుకోవలసిందేనని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాడు.

తండ్రి మట్టితో బొమ్మలు చేసి, కాలంతో పాటు మారకుండా అక్కడే ఉండిపోయాడు! ఆ తరం ఇచ్చిన కొన్ని విలువలు ఇంగువకు కట్టిన గుడ్డలాగ అతనితో పాటే ఉండిపోయాయి.

రైతు మట్టివాసనకు పులకించినట్లు తన తండ్రి కూడా మట్టినే నమ్మి జీవించాడు.

ఇద్దరు పనివాళ్ళు అతనివైపు చూస్తున్నారు. ఆ చూపు అతని మనసుకు తగిలింది.

రెండు వారాలు కూలీ బకాయి పడ్డాడు. అవి వాళ్ళకి చాలా అవసరం. కుటుంబాలు నడవాలి కదా! మెల్లగా పాకలోకి వెళ్ళి అక్కడ తనతండ్రి పటానికి నమస్కరించి కూర్చున్నాడు.

"సంతకు వెళ్ళినవాళ్ళు ఇంకా రాలేదా?"

"లేదుబాబు అప్పారావు రాత్రే వచ్చాడట. కాసేపట్లో వస్తాడేమో!" అన్నాడు ఓ పనివాడు.

పండుగ సీజనే అయినా పెద్దగా బేరాలు జరగడం లేదు. ప్లాస్టా ప్యారిస్‌తో చేసి రకరకాల కెమికల్స్‌తో రంగులద్ది ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు. వాటి ముందు తన మట్టిబొమ్మలు ఏపాటివి!

"అనేక వృత్తి ధర్మాలు, విలువలు మారుతున్నాయి. నేను నీకు ఒక కళను ప్రసాదించాను. అభివృద్ధి చేసుకోవలసిందే!"

తండ్రి చివరి మాటలు వీరభద్రానికి గుర్తే! దారిద్ర్యంలో రోజులు గడువకపోయిన దేవుళ్ళు, దేవతలు పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం తన కుటుంబాన్ని నల్లేరుమీద బండిలా తీసుకుపోయింది.

చాలా ఇళ్ళల్లో అలంకరించుకోవడానికి రాధాకృష్ణులు, పూజాగదుల్లో రామ పట్టాభిషేకం, తండ్రి చేసిన విగ్రహాలు గొప్ప పేరు తెచ్చుకొన్నాయి. చాలామంది పనివాళ్ళు వాటినే విరివిగా సంతల్లో అమ్మి బ్రతికేవారు.

కాని,

తనకాలం వచ్చేసరికి అనూహ్యమైన మార్పులు వచ్చాయి.

ఈ కళను నిలబెట్టడం కష్టమే. బ్రతుకు నడువదు.

వీరభద్రానికి చాలాకాలం నుంచి ప్రత్యామ్నాయమైన ఉపాధి కోసం ఆలోచిస్తున్నాడు. ఈ పని వదిలేస్తే మరో మార్గం లేదు. తల్లి, భార్య, కొడుకు వాళ్ళ భవిష్యత్తు ఏమిటి?

పనివాళ్ళకు కూలి ఇవ్వలేని పరిస్థితి. వాళ్ళను వదులుకుంటే చెదిరిపోతారు.

కళైనా, కావ్యమైనా, మార్కెటింగ్ చేసే రోజులు వచ్చేసాయనుకున్నాడు.

జేబులో రెండు వందలు తీసి ఇద్దరు పనివాళ్ళకు ఇచ్చాడు. పరిస్థితి తెలిసిన మీదట ఏమి అనుకుండానే తీసుకున్నారు.

దూరం నుంచి సైకిల్‌పై వస్తున్న పూల లచ్చన్నను చూసాడు. చిన్ననాటి స్నేహితుడు. అక్కడనుంచే చేయి ఊపి, సరాసరి వచ్చి వీరభద్రం దగ్గర బల్లపై కూర్చున్నాడు.

"ఏరా ఇంత పొద్దున్నే బయలుదేరావు." వీరభద్రం ప్రశ్నించాడు.

"రాక రాక పెద్ద బేరం తగిలింది. గృహప్రవేశం. అలంకరణ అంతా మనకే! సర్వవరం పోయి అన్నిరకాల సమకూర్చుకోవాలి. మూడు రోజులు ఉందిలే!" అన్నాడు లచ్చన్న.

"ఆహా! బాగా మిగులుతుందన్నమాట!"

"గీసి, గీసి బేరం చేస్తున్నారు. మనం కాకపోతే మరొకడు. ఎంత తెచ్చినా సరిపోవటం లేదురా! పిల్లాడిని కాన్వెంటులో వేయవద్దన్నా! వినలేదు. పైగా రోజు ఇంటింటికి వచ్చే స్కీములు. బతుకు నరకం అనుకో! రోజూ మా ఆవిడతో తగాదానేరా!... వాడి పారేసే పువ్వులకు గిరాకి ఏముంటుంది?"

'నా పరిస్థితి అలాగే ఉందిరా బావా! అప్పటికప్పుడు కావాలని ఆర్డరు చేస్తారు. మళ్ళీ కనపడరు. అదిగో రామపట్టాభిషేకం బజానా ఇచ్చిపోయారు. నెల దాటింది. దేవాలయం ఉన్నంతవరకూ ఆదాయమే. మనం దగ్గర మాత్రం బేరాలు. గౌరవించరు... వ్యాపారంలో మనం ఏదో 'మిస్' అవుతున్నామురా!"

"సంసారం ఎలా ఈదుకురావాలో అర్థం అవ్వటం లేదు. అంతా నలుగుడు అయింది". అన్నాడు లచ్చన్న.

"ఏంటిరా స్నేహితులిద్దరు దీర్ఘంగా చర్చిస్తున్నారు." అంటూ మాస్టారు వెంకట్రావు వచ్చారు. ఆయన్ని చూసి లేచి నమస్కరించారు. ఆరోతరగతి నుండి పదివరకూ ఆయనే మాస్టారు.

"రండి మాస్టారు" అంటూ ఆహ్వానించి, అరుగుమీద కుర్చీలు వేయించాడు వీరభద్రం.

"వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి?"

''నక్కలు నుంచి బయటకుపోయి కిళ్ళీకొట్టు పెట్టుకోండిరా అని తిట్టేవారు. ఆ పనిచేసినా స్థిరమైన జీవితం దొరికేది. గౌరవంగా బ్రతకలేకపోతున్నాను మాష్టారు".

"జీవితంలో ఇంకా పాఠాలు నేర్చుకోలేదన్నమాట! పెద్దవాళ్ళు మీకొక మార్గం చూపించారు. కాలాన్నిబట్టి నడుచుకుపోవాలి. మీరు అక్కడే ఆగిపోకూడదు".

"సీజనల్ వ్యాపారం మాష్టారు. పైగా కాంపిటేషన్

ఎక్కువ. మార్కెట్‌లోకి చాలా బొమ్మలు వస్తున్నాయి. ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ పాతకాలం బొమ్మలు ఎవరికి కావాలి."

"నువ్వు పద్ధతులు మార్చుకో"

"అదే మాష్టారు ఆలోచిస్తున్నాను. చాలా మౌల్డ్స్ కావాలి. ఖర్చుతో కూడినది... అమ్మగారు ఎలా ఉన్నారు."

"బాగానే ఉందిరా. మా అబ్బాయి బెంగుళూరులో సెటిల్ అయ్యాడు. మీ పిల్లలు ఏమి చదువుతున్నారు."

భార్యను పిలిచి పరిచయం చేసాడు.

"పెద్దవాడు ఇంటర్‌లోకి వచ్చాడు. పిల్ల చిన్నది. ఆరోతరగతి చదువుతుంది."

వీరభద్రం భార్య లోపలికి వెళ్ళి మంచినీళ్ళు , కాఫీలు ఇచ్చింది.

"క్లాసులో అందరికన్నా తెలివైనవాడివి. చదువు సాగించి ఉంటే బాగుండేది. నీతో చదివినవాళ్ళల్లో ఐ.ఏ.ఎస్.లు కూడా అయ్యారు."

"నాన్న పాతకాలపు మనిషి. అనాధిగా వస్తున్న వృత్తిని తన తరంతోటే అంతరించకూడదని తన ఆలోచన."

"ఏమైనా మంచి శిల్పివి అయ్యావు. అదే సంతోషం."

"వ్యాపారం నడవడం లేదు మాష్టారు. చాలా ఇబ్బందిగా ఉంది."

"వచ్చే నెల 31న నేను రిటైర్డ్ కాబోతున్నాను. నువ్వు తప్పకుండా రావాలి. పాత విద్యార్థులు మంత్రి గారు వస్తారు."

"చాలా సంతోషం మాష్టారు"

"మన కాలేజీకి స్థలం ఇచ్చిన దాత మంత్రి గారి తండ్రే కదా. ఆయన విగ్రహం పెట్టాలి. దానిని నువ్వే చేయాలి."

"తప్పనిసరిగా మాష్టారు."

"మాష్టారు డబ్బులు ఇవ్వబోయారు."

"ఉంచండి. అవసరమైతే నేను అడుగుతాను, ఇలా అన్నా మీ రుణం తీర్చుకుంటాను."

"లచ్చన్నా! ముందురోజు కనబడు. ఎన్నిదండలు కావాలో, ఎన్ని గుత్తులు కావాలో ఆర్డరు చేస్తాను".

మాష్టారు మంత్రి తండ్రి నిలువెత్తు ఫొటో ఇచ్చి వెళ్ళారు.

వీరబధ్రం ఈ అవకాశం వ్యాపారంలోకి ఎలా ఉపయోగించుకోవాలో దారులు వెతుకుతున్నాడు. ఎడతెగని ఆలోచన.

ఒకతరం వైపల్యం. మరోతరం మోయకూడదు. ఇది సూత్రం. అమాయకులు అనుభవం అనే పాఠశాలలో అక్షరం దగ్గర ఆగిపోకూడదు. ఇది ఓ సందర్భంలో మాష్టారే చెప్పారు.

విగ్రహానికి సంబంధించిన ముడిసరుకు సమకూర్చుకున్నాడు. పేపరుపై నిలువెత్తు చిత్రాన్ని గీసాడు. బాగా అధ్యయనం చేసాడు. ఎక్కడ మడతలు, ఎక్కడ నొక్కులు ఉన్నాయో చూసుకున్నాడు. వీరభద్రం చేతిలో పడిన ఏ విగ్రహమైనా నడిచి వచ్చినట్లు ఉండాల్సిందే. తండ్రికి మించిన తనయుడు.

ముందుగా ఒక అస్థిపంజరాన్ని తయారుచేసాడు. దాని అన్నిభాగాలకు తడిపిన పేపరుతో చుట్టి పైన గోనెముక్కలు చుట్టి ప్రత్యేకంగా కుమ్మిన బంకమన్ను పూసి ఒక డమ్మి తయారుచేసాడు. ఇద్దరు సీనియర్ల సహాయం తీసుకుని చెక్క బ్లేడుతో, తన బొటనవేళ్ళతో చకచకా రూపం తీసుకొచ్చాడు. పంచె, చొక్కా, మడతలు, భుజంపై ఉత్తరీయం, అంతంతమాత్రంగా తల వెంట్రుకలు, ముఖంలో ముడతలు, కాంతివంతమైన కళ్ళు, ముక్కు, పెదాలపై చిరునవ్వు తీర్చిదిద్ది అపురూపంగా మలచగలిగాడు.

మాష్టారుకి కబురుచేసి ఎక్కడైనా లోపాలు ఉన్నాయోమోనని చర్చించాడు.

"పరఫెక్ట్. నా నమ్మకం నిలబెట్టావు.'

ఆ ప్రశంసని వినయంగా స్వీకరించాడు.

మంత్రిగారు ప్రైవేటు కాలేజీలో తనకు ప్రిన్సిపాల్ పోస్టు రావడం ఖాయమని మాష్టారు మనసులో అనుకొంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

తండ్రి తన కాలంలో సంపాదించిందేమి లేదు.

'మానవమూర్తులను దేవుళ్ళు చేయకూడదు. వ్యక్తి ఆరాధన చెడు చేస్తుంది.' అంటూ ఉండేవాడు.

"పెద్దలకు కొన్ని నిర్ధిష్టమైన అభిప్రాయాలు ఉండవచ్చు. అవి మనపై రుద్దితే ఎలా"

తల్లి కూడా 'నీతి నియమాలు అంటే రోజులు గడుస్తాయా! ఆదర్శాలు కూడు పెడతాయా!' అంటుంది.

చేతిలో కళ ఉండి కూడా తండ్రి అవహేళనకు గురైనాడు. శిల్పకళలో అతని ప్రజ్ఞాపాఠవాలు కొరగాకుండా పోయాయి.

వీరభద్రం ఈ అనుభవాల నుండి జీవితంలో వాస్తవికతని గ్రహించాడు. వ్యాపారం కొన్ని సూత్రాల మీద నడుస్తుంది. దాని ఆర్థిక విధానాలు దానికి ఉంటాయని గ్రహించాడు.

రెండు రోజులు ముందుగానే విగ్రహాన్ని కాలేజీకి తరలించి

# కొలకలూరి ఇనాక్‌కు
# కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



ప్రసిద్ధ రచయిత కొలకలూరి ఇనాక్‌కు 2018 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఇప్పటికే ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారం కూడా లభించింది. 2015లో భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ వారు ఇచ్చే మూర్తి దేవి పురస్కారం వీరి 'అనంతజీవనం' నవలకు లభించింది. 1939 సంవత్సరం జులై 1 తేదీన గుంటూరుకు సమీపంలోని చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఇనాక్ జన్మించారు. గుంటూరు, చిత్తూరు, కడప, అనంతపురం, తిరుపతి తదితర చోట్ల తెలుగు ఆచార్యుడుగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పదవీ బాధ్యతలను నిర్వర్తించారు. 1954లో లోకం పోకడ, ఉత్తరం అనే కథానికలతో తెలుగు సాహితీ లోకంలో అడుగుపెట్టారు ఇనాక్. 1958లో దృష్టి అనే నాటికను రాసి కేంద్ర ప్రభుత్వ బహుమతి అందుకున్నారు. 1965లో జైహింద్ అనే మరో నాటికకు కూడా రాష్ట్ర ప్రభుత్వం బహుమతి ఇచ్చింది. అన్నిటిని మించి 1986లో ఆయన రాసిన ఊరబావి అనే కథా సంపుటి ఆయనను ఉత్తమ రచయిత అని సాహిత్య లోకానికి చాటిచెప్పింది. కేవలం రచయితగా మాత్రమే కాకుండ మంచి విమర్శకుడిగా కూడా ఆయనకు పేరుంది. మంచి పరిశోధకుడిగా, పరిశోధక మార్గదర్శకుడిగా ఆయన కీర్తినందుకున్నారు. వసుచరిత్ర వైశిష్ట్యం, ఆది ఆంధ్రుడు, కన్నీటి గొంతు, కంచికచర్ల కోటేశుహత్య(నాటిక) అలాగే ఆయన జానపద సాహిత్య విమర్శ రాశారు. ప్రస్తుతం ఆయన రాసిన విమర్శిని గ్రంథానికి జనవరి 29న ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఇనాక్ అందుకోనున్నారు. ♦

ప్రత్యేక స్థలంలో ఉంచి తెరలు కట్టారు. విద్యార్థులు, స్టాఫ్, మాష్టారు చేతిలో రూపుదిద్దుకున్న పూర్వపు విద్యార్థులు చేరుకున్నారు.

కార్యక్రమం చాలా సందడిగా జరిగింది. అనేకమంది ఉపన్యాసాల తరువాత మంత్రి తనతండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించాడు.

ఒక్కసారి తండ్రి విగ్రహాన్ని చూసి భావోద్రేకానికి లోనై కళ్ళు చెమ్మగిల్లాయి. అది గమనించాడు వీరభద్రం.

"విగ్రహాన్ని ఎవరు తయారుచేశారు?"

"నా శిష్యుడు వీరభద్రం"

"ఈ ఊరు వాడేనా? ఇక్కడే ఉన్నాడా!"

వీరభద్రాన్ని మాష్టారు పరిచయం చేసారు. వేదిక మీదకి శిల్పిని పిలిచి మంత్రి ఆలింగనం చేసుకుని శాలువా కప్పి అభినందించాడు. తండ్రి త్యాగాలు తన రాజకీయాలకు ఉపయోగపడతాయని గ్రహించి గ్రామగ్రామాలలో విగ్రహాలు పెట్టాలనే ఆలోచన తట్టింది.

"నన్ను తప్పనిసరిగా ఒకసారి వచ్చి కలు"

♦♦♦

లచ్చన్న సైకిలుపై తిరగడం మానేసాడు. దేవాలయం అరుగుపై పూలకొట్టు పెట్టాడు. సినిమా హీరోల అభిమాన సంఘాలతో స్నేహం చేసాడు. వారికి గజమాలలు సప్లయ్ చేసేవాడు. అందరూ హీరో సంఘాలకు అతనే సప్లయ్‌దారుడు. క్రమంగా అయ్యప్పమాల వేసాడు. వందల్లో పెరుగుతున్న భక్తులకు దండలు వేసే సాంప్రదాయం అలవాటు చేసాడు. మరోప్రక్క దుర్గ భక్తులు. వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో అలంకరణ. కాలక్రమంలో ఒక డెకరేటర్‌గా మారిపోయాడు.

వీరభద్రానికి లచ్చన్నకు చేతినిండా పని, లక్షల్లో బ్యాంకు బ్యాలెన్స్.

♦

# పవిత్ర స్మృతులు

- శ్రీమతి నాళం సుశీలమ్మ



కందుకూరి వీరేశలింగం
(16.04.1848 -27.5.1919)

ఆంధ్రప్రదేశంలోని ఈనాటి వికాసమునకు కారణభూతుడైన శ్రీ వీరేశలింగంగారి వర్ధంతిని ఈనాడు మన ఆంధ్ర ప్రభుత్వము చేయడానికి - సంకల్పించడం ఆంధ్రులందరకూ చాలా సంతోషకారణం.

శ్రీ వీరేశలింగంగారి శుభనామాన్ని సంస్మరించుటతోనే ఆనాటి సంఘమునందు బాగా వ్రేళ్ళుతన్నుకొని పోయివున్న సనాతన మతాచార పద్ధతులు, ఆ పద్ధతులను అతిక్రమించి నడువలేకపోయిన మాబోటివారి ఆశక్తత నాకు బాగా జ్ఞాపకం వస్తూ ఉన్నది.

అందులో సంఘ సంస్కరణాది సమస్త కార్యాలలోను, శ్రీ వీరేశలింగంపంతులుగారి అంతేవాసి శిష్యరత్నములని ప్రసిద్ధిపొందిన శ్రీ నాళం కృష్ణారావుగారు, నా భర్తగా రగుటవలన, ఆనాటి సంఘ సంస్కారోద్యమము వలన పరమ సనాతనాచారములో పుట్టి పెరిగిన నా అనుభవము చాలా చిత్రముగా ఉండేది.

ఆనాడు ఏ విధంగాను నేను శ్రీ వీరేశలింగంగారి ఉద్యమాలతో జోక్యం కలిగించుకొన్న దానిని కాకపోవడమే కాక నా భర్తగారితో నేనేమీ సహకరించిన దానను కూడా కాదు. అయినను ఈనాడు నాబోటి పెద్దవాళ్లం కూడా సంఘసేవ చేస్తూ అదే పరమార్థమని భావించకల్గుతున్నామంటే, ఆనాటినుండి శ్రీ పంతులుగారి సంఘసంస్కరణోద్యమము, స్త్రీ జనాభ్యుదయ సేవా భావములు మాలో అంతర్లీనముగా నుండి క్రమ పరిణామాన్ని కల్గించడానికి పూర్తిగా కారణాలయ్యాయనే చెప్పాలి. ఆనాటి నా అనుభవాలంటే మావారితోబాటు నే ననుభవించిన సంఘటనలే మీ ముందు వివరించగల్గేది.

నా కిప్పుడు 75-76 సంవత్సరాల వయస్సు. నాకు 12 వ సంవత్సరముననే పెండ్లి అయినది. నా పెండ్లి నాటికే మా వారికి బ్రహ్మ సమాజంతోను, వీరేశలింగంగారి వితంతు వివాహోద్యమాలతోను సంబంధం కొంచెముగా ఉండేదట. కాని, మా పుట్టింటివారైన మోతే వారికి ఆ విషయాలు తెలియవు. ఆ విషయాలు పెండ్లి నాటికి తెలియనందున పిల్ల నియ్యడం జరిగినదని ఇప్పుడు ఇట్లా బాధలపాలు కావలసి వచ్చిందని నన్నూ, మావారినీ రాజమండ్రిలో వెలివేసినప్పుడు ఏలూరులో అనుకోవడం విన్నాను.

అటు మా పుట్టింటివారైన మోతేవారు, ఇటు అత్తవారైన నాళం వారు చాలా సనాతనమైన కుటుంబాలు. ఆడపిల్లలకు చదువు లక్కరలేదనే రోజులవి. అయితే నన్ను ఏలూరులో మంచి గుణములుగల ఒక నాయుడు గారి వీధి బడికి పంపేవారు. అప్పుడు ఎక్కువగా స్కూళ్ళు లేవు. పెద్ద పెద్ద క్లాసులు చదివిన పిల్లలు కూడ లేరు. కాని అప్పట్లో నాలుగో క్లాసులోనే భారతము, రామాయణమును మాకు చెప్పేవారు. మా పెత్తండ్రిగారి కుమారులు సుప్రసిద్ధ దేశభక్తులైన మోతే నారాయణరావు గారి తండ్రిగారైన మోతే సుబ్బయ్యగారికి మంచి సంస్కార భావాలుండేవి. ఆయన చాలా కళాప్రియుడు. ఆయన నాకు, తన భార్యకు ఇంగ్లీషు దొరసానిని పిలిపించి

ఆంగ్లమున్నూ, మగ మాష్టారుగారి చేత చాలా రహస్యంగా సంగీతమున్నూ చెప్పించేవారు. అయినా, అది యెట్లాగో పైకిపొక్కి వోతేవారింట్లో సానిపెట్టి (హార్మోనియం) చెప్పిస్తున్నారని, జనం అంతా విడ్డూరంగా చెప్పుకొనినారు. సుబ్బయ్యగారు పెద్దవాళ్ళకు తెలిసిన ఏమందురోయని, మాష్టర్లకు జీతము క్రింద, తాను పనిచేయుచున్న వారి బియ్యంమిల్లులోని బియ్యం ఇచ్చేవారు.

ఆ పరిస్థితుల్లో నేను అత్తవారింటికి రాజమండ్రి వచ్చాను. నా చదువు నాలుగోక్లాసు కంటె పైకి రాలేదు. మొదట్లో మావారు, తన సంస్కారోద్యమాలలో తనకు సహకరించవలసిందిగా నన్ను చాలా ప్రోత్సహించేవారు. కాని, నా దగ్గరనుండి ఎటువంటి అనుకూల్యము లభించక పోయేటప్పటికి వారు నాకు ఏమీ చెప్పేవారు కాదు. అంతతో అది ఆగినా బాగుండును కాని, తరువాత తరువాత, నాకుగల సహజ సనాతన మతాభిమానము, సంస్కారోద్యమముపట్ల గల వ్యతిరేక భావము మావారికి నాపై చాలా కోపభావాన్ని కల్గించాయి. వారు ఇంటివద్ద భోజన సమయమున, నిద్ర సమయమున తప్ప ఉండేవారు కారు. లైబ్రరీ పనులతో, టౌను కాంగ్రెసు సెక్రటరీ పనులతో, ఈ వితంతు వివాహ సంస్కార కార్యక్రమాలతో వారికి విరామం లేదు కాబోలునని నేను సరిపెట్టుకొనేదాన్ని. కాని వారి సంస్కారోద్యమాల పట్ల నేను అనుకూలత చూపకపోవడంచేత నాపట్ల వారికి కల్గిన విముఖ భావం యొక్క ఫలితమేనని తెలిసినప్పుడు నేను చాలా బాధపడ్డాను. అయినా, నేను స్వతంత్రించి వారికి నా సహకారం ఇయ్యలేకపోయినాను. మా అత్తగారు లక్ష్మీదేవమ్మ గారు, సాక్షాత్తు లక్ష్మీదేవమ్మగారే. ఆమె కుమారుని పల్లెత్తుమాట అనేదికాదు. మా ఆడపడుచు ఒకామె మాత్రం ఆయన భోజనమునకు ఇంటికి వచ్చినప్పుడు ఆ సమయమున 'ఏరా కృష్ణయ్యా, ఇట్లా ఇల్లు పట్టించుకోకుండా తిరిగితే ఎట్లారా' అని మందలించేది. 'వాడు ఇంటికి వచ్చేదే భోజనానికి. ఆ భోజనం కూడ సరిగ్గా చెయ్యకుండా నీవెందుకు మందలిస్తావు' అని మా అత్తగారు ఆమెను మందలించేవారట. ఇవి నేను కాపురమునకు రానప్పటి సంగతులు. నేను వచ్చిన తరువాత, అన్నదమ్ములు కూడ ఏమీ అనేవారు కాదు. ఇంకా పైగా ఉద్యమాల కోసం గాని, తన ఖర్చుకోసం గాని, మా వారు ఏ కొట్లో ఎంత అప్పుగా తీసుకొన్నా అన్ని బాకీలు తమ్ముని కోపపడకయే చెల్లించివేసేవారు. ఇంట్లో ఎవ్వరి ఆటంకాలు లేకపోవడంతో వారు ఇంకా యధేచ్ఛగా, తన ఉద్యమాలకు అర్పిత మయిపోయినారు. ఉదయం ఇల్లు విడిస్తే మధ్యాహ్నం భోజనానికి తప్ప మరల ఇంటికే రాక, రాత్రియైన తరువాత ఇంటికి చేరే వారి పట్టుదలకు కారణం ఏమిటో కూడ నాకు అప్పట్లో అర్థం కాక చాలా బాధపడేదాన్ని.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే – శ్రీ వీరేశలింగం పంతులుగారి అన్ని ఉద్యమాలలోనూ, ఈయన కుడి భుజం వలె పనిచేసి వారికి సహకరించుతూ ఉండడం చేత, ఈయన వారి సహచరుల దండు (రామదండు అని ఆ దండుపేరు) నకు దళవాయిగా ఉండే అవకాశం కల్గడం చేత ప్రొద్దస్తమయమూ ఆ పనులలోనే ఉండి దీక్షగా దేశమాతను సేవించే అవకాశం శ్రీ పంతులుగారు వీరికి కల్పించారు. వీరితో దేశరాజు పెద్దబావయ్యగారు, శ్రీ కామరాజు హనుమంతరావుగారు, పెద్దాడ సుందర శివరావు గారు, శ్రీ పాలపర్తి నరసింహం గారు, శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మొదలైన పెద్దవాళ్ళంతా ఇట్లాగే పాటుపడుతూ ఉన్నారని కర్ణాకర్ణిగా వినేదాన్ని. కాని ఎప్పుడూ ఇంట్లోంచి బయటికి వెళ్ళడం అలవాటు లేకపోవడంచేత ఎవరినీ అప్పట్లో నేను చూచి యెరుగను. అయితే, అప్పట్లో చాలా వ్యాప్తంగా ఉన్న దురాచారాలైన భోగం మేళములు మాన్పించుదచు, సంఘ కార్యక్రమాల కొరకు ప్రాణాలు అర్పించవలసి వచ్చినా వెనుదీయకుండా ఉన్నారు. కలలో కూడ అబద్ధమాడకుండుట, నిత్యమూ పరిమిత వేళలలో దైవప్రార్థనలు జరుపుట, విగ్రహారాధన విసర్జించుట మొదలైన దీక్షలు పట్టించి, ఈ యువతరం వారినందరనూ శ్రీ వీరేశలింగం పంతులుగారు సుశిక్షితులుగా తీర్చి దిద్దారని కూడ నేను విన్నప్పుడు మాత్రం నాలో నేనే ఆనందించి వెయ్యి దేవుళ్ళకు నమస్కారాలు చేశాను.

ఆజన్మాంతమూ, ఈ విషయాల నన్నింటినీ కూడా తప్పకుండా మావారు పాటించారు. ఎంత గొప్ప దేవాలయమైనా వారు శిల్ప దృష్టితో అంతా చూచేవారు. కాని గర్భగుడి లోనికి అడుగు పెట్టేవారు కారు. ఈ సంఘ సంస్కారోద్యమం తీవ్రతలో తనకు అనుకూలురాలను కాదనే భావంతో నన్ను విడచి ఎవరో వితంతువును, వారు తిరిగి పెండ్లి చేసుకుంటారనే వదంతులు నేను కాపురమునకు రానప్పుడు కలుగగా, మా పుట్టింటివారు చాలా ఆందోళనపడి రాజమండ్రికి వచ్చి వారిని బ్రతిమలాడుకొన్నారు. తరువాత నేను కాపురమునకు వచ్చిన కొత్తలో ఇద్దరమూ బొంబాయికి వెళ్ళినాము. అప్పుడు నేను మా పినతండ్రితో బొంబాయి నుండి ముందు వచ్చినాను. తరువాత 3, 4 దినములకు మావారు

రాజమండ్రి వచ్చి, కలకత్తా బ్రహ్మ సమాజములోనికి వెళ్ళవలెనని ఉద్దేశముతో ఇంటికి రాక, ఎక్కడనో ఉన్నారు. అప్పుడు వారి అక్కగారు, ప్రియమైన వదినగారు ఒక ఆమె బజారులో ఉండగా వెళ్ళి బ్రతిమలాడి ఇంటికి తీసికొని వచ్చినారు. ఆ సమయమున నేనక్కడలేను. కాని తరువాత "మా వదిన మూలాన ఇంటికి వచ్చాను గాని, నీ మూలాన రాలేదని నన్ను కోపదృష్టితో అనేవారు. ఎలాగైతేఏమి నాకు దక్కినారని సరిపుచ్చుకొనేదాన్ని. ఆ పైన వితంతువును పెండ్లి చేసికొనే వదంతికి మా వాళ్లు వద్దంటే చెప్పిన జవాబు ఏమనగా 'నా కటువంటి అభిప్రాయము లేదని, పెండ్లి అనేది ఒక జీవితానికి ఒక స్త్రీతోనే జరగాలి తప్ప, ఇంకొకరితో జరగడానికి వీలులేదన్న పవిత్ర భావము, వైవాహిక జీవితంపట్ల తనకు ఉన్నదని మావారు మా పుట్టింటివారికి ప్రత్యుత్తరమిచ్చి పంపివేశారు. శ్రీ వీరేశలింగం పంతులుగారు తన సహచరులను కేవలం కర్మవీరులుగా మాత్రమే కాక ప్రాచీన పవిత్ర భారతీయ సంస్కృతికి చెందిన ధర్మవీరులుగా కూడ తీర్చిదిద్ది ఉన్నారనేది నేను గ్రహించగల్గినప్పుడు నాలో ఒక విధమైన చైతన్యం కల్గిందని చెప్పాలి.

ఇప్పటికీ ఆ తరం వారంతా ఆ విధంగానే నిష్కామకర్మ వీరులుగానూ ధర్మదీక్షా పరాయణులుగాను త్యాగప్రియులుగాను ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. ఆనాటి ఈ జాతికి యీ నైతికబలాన్ని ప్రసాదించిన మహానుభావులు శ్రీ వీరేశలింగంగారే. ఆయన ఇంకెన్ని విధాలుగా శ్రమించి ఈ ఆంధ్రజాతిని సంస్కరించడానికి పూనుకొన్నారో అవన్నీ నేనిక్కడ వ్రాయడం అనవసరం. కాని వారి సేవల వలననే ఈనాటి మహత్తరమైన ఈ ఆంధ్రజాతి కింత వికాసము కలిగిందనే విషయంలో సందేహం లేదు. అందుచేతనే ఆయన యుగపురుషులైనారు.

తరువాత తరువాత నేను మావారి ప్రీతికోసం స్త్రీల ప్రార్థన సమాజానికి ఎప్పుడైనా వెళ్ళేదాన్ని. అక్కడ శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ గారితో కూడ నేను అట్టే పరిచయం కల్గించుకోలేకపోయినాను. సభలకు వెళ్ళినప్పుడు శ్రీ పంతులుగారిని మూడు నాలుగు పర్యాయములు చూడడం తప్ప నేను వారితో ఎన్నడూ మాట్లాడి యెరుగను. ఇంట్లో కొన్నాళ్ళు పూజలు కూడా మానివేశాను. పర్వదినాలలో గోదావరి స్నానం కూడ మానివేశాను. అయితే ఇట్లాంటి వెన్ని చేసినా మా వారి ప్రీతి కొరకు కాని, నాకు సహజంగా ఆ పనులలో అనుకూల భావం ఉండేది కాదు. సుమారు అరవై సంవత్సరాల తరువాత చిన్ననాటి జీవితాన్ని తలంచుకుంటే నాకేమీ సిగ్గుపడవలసిన సమయము కనబడడం లేదు. ఎందుకంటే ఆ రోజులలో ఉండే సనాతనా భావప్రభావం అది. ఒకప్పుడు శ్రీరామానుజాచార్యుల సహధర్మచారిణి తంజమాంబ కూడా శ్రీరామానుజాచార్యుల సంస్కార ప్రియత్వానికి సహకరించలేదని విన్నప్పుడు నా ప్రవర్తన ఎడల సానుభూతి కలిగిందే తప్ప ఏమీ సిగ్గుపడవలసినదిగా తోచడం లేదు.

తరువాత జందెం తీసేసినందుకు, సర్వమత భోజనాలు ఏర్పాటు చేయించి అందులో తిన్నందుకు మావాళ్ళు మా వారిని వారితోపాటు నన్నూ వెలివేశారు. రాజమండ్రిలో మమ్ములను చాలా పాట్లు పెట్టినారు. మా పుట్టింటి వారు యేలూరు తీసికొని వెళ్ళి మా వారికి వూళ్లో పెద్దలందరి చేత ఈ సహకారోద్యమం మానమని ఎంతో చెప్పించారు. ఎంతో డబ్బు ఆశ చూపారు. అయినా వారు తమ దీక్షను వదలిపెట్టలేదు. ఇంతా దృఢదీక్షా బలమంతా, శ్రీ వీరేశలింగం పంతులుగారి శిక్షణే. ఈ వెలి బాధకు మాకంటే కూడ శ్రీ దేశరాజు పెద్దబాపయ్యగారు ఎక్కువ కష్టాలు పడ్డారు. ఆయినా ఆ కాలంలో శ్రీ పంతులుగారి శిష్యులైన వారు ఎవ్వరూ కూడా కష్టాలకు జంకేవారు కారు. పైగా చాలా ఆనందంతో స్వీకరించేవారు.


తరువాత వచ్చిన గాంధీగారి ఉద్యమ ప్రబోధాలతో యావద్భారత దేశానికీ కనువిప్పు కల్గింది. పంతులుగారి నిరంతర ప్రబోధం వలన అప్పటికే కొంచెం కొంచెంగా సంఘసేవకు సుముఖత కనపరుస్తూ ఉన్న మా బోటివారికి తరువాత ధైర్యసాహసాలు కల్గడం, వేమంతా దేశహితకరములైన ఉద్యమాలలో పాల్గొనడం జరిగింది. మాబోటి వారిలోని ముఖ్యంగా నాలోని యీ క్రమచైత్యానికి, ఆనాడు ఇల్లు విడిచి బయటికి రాలేకపోయిన నేను ఈనాడు ఆంధ్రమహిళా గాన సభ పేరుతో ఒక సంస్థను నడపకల్గుతూ ఉన్నానంటే ఈ సేవా కార్యక్రమాలకు శ్రీ వీరేశలింగంగారి నిరంతర ప్రబోధమే కారణమని నిస్సందేహముగా చెప్పగలను.

మూగజీవాలకు ప్రాణముపోసి నేటి జాతీయ వికాసమునకు నాందిగీతం పాడిన యుగ పురుషుడు, మహనీయుడు, శ్రీ వీరేశలింగం పంతులుగారికి నా కృతజ్ఞతా వందనాలు.

***(వ్యాస రచయిత్రి కందుకూరి వీరేశలింగంతో సంఘసంస్కరణ ఉద్యమంలో అతి సన్నిహితంగా పనిచేసిన ప్రముఖ రచయిత నాళం కృష్ణారావు సతీమణి)*** ♦

## కలనేత చీర

- వైష్ణవి శ్రీ
8074210263



పుట్టుక నా చేతిలో లేదు
మరణమూ నా చేతిలో లేదు
పుట్టుక అమ్మ పొత్తిళ్ళకెరుక
చావు నన్నెప్పుడూ
తన గుప్పెట్లోనే బంధించుకుంటుంది తెలివిగా

ప్రతిరోజూ ఉషోదయ.. మధ్యాహ్న ..
సాయంత్ర..రాత్రి సమయాలకు
తెలియకుండానే 24 గంటల గడియారమౌతాను
అవిశ్రాంత సమయాలు కొన్ని నన్ను
ఓదార్చుతుంటాయి
కొన్ని విశ్రాంత సమయాలు తెలివిగా నన్ను
దాటేస్తుంటాయి

గతమో వర్తమానమో ..గాయపడిన దేహం నుండి
పొలుసులు పొలుసులుగా రాలిపడుతుంటుంది
ఎంత రాలినా విసుక్కోని దేహం
కొత్త ఆశల ఊపిర్లను నింపుకుంటూ
ఉజ్వల భవిష్యత్తుకి ఆహ్వానం పలుకుతుంటుంది

తిరిగి ఆశల సముద్రంలో
మునిగిపోతుంటాను
ఏరోజుకారోజు కొత్తగా కనిపిస్తుంది
మరిన్ని మధురానుభూతులను
మూటకట్టుకోమంటూ...

జీవితమెంత మధురమనీ...
చావుపుట్టుకల కలనేత చీరను
మరణశయ్యపై సింగారించుకుంటూ... ♦

---

## శబ్ద కలుషం గజల్ (విజిల్)

- బండి ప్రసాదరావు
9866483732



కొత్తపాతల పథక ప్రకటన శబ్ద కలుషం
ఛానపట్టిన బేండు తిప్పిన శబ్ద కలుషం

నిర్మలంబది గళము చిన్నది నిక్కమయ్యె
స్వచ్ఛభారతు స్వరము పెద్దగ శబ్ద కలుషం

సున్నఖాతది–'జనుల దన్'యిది దన్నుయొకటె
గతపు పథకమె హితము కాదుగ శబ్ద కలుషం

యువతశక్తది కౌశలంబిది యావయొకటె
సహజ పథకమె నిరతమేలను శబ్ద కలుషం

అప్పులేయవి స్టాండుస్టార్టులు గొప్పలేల?
పథక ప్రకటన ఖర్చు దండగ శబ్ద కలుషం

ప్రీమియముతో భీమదన్నది ప్రియముగాదు
అభయహస్తము హతము జేయగ శబ్ద కలుషం

అంద రెరుగును అమలుయైనవి అరచుటేల?
వినెడి వీనుల విందు కాదుగ శబ్ద కలుషం

ధీటు జచ్చును దీర్ఘ ప్రకటన ఘాటు వ్యయము
క్షేమ నిధులకు పెద్ద చిల్లెగ శబ్ద కలుషం

విజిల్ = అప్రమత్త చేసే కవిత (గజల్) ♦



# ఘంటసాల గొంతులో శ్రీశ్రీ పాట

- సక్కిరి భాస్కర్
9440171708

**శ్రీశ్రీ** అభ్యుదయ కవిత్వానికి యుగకర్త మాత్రమే కాదు. కర్త, కర్మ, క్రియ అన్నీనూ. 'పాడవోయి భారతీయుడా' శ్రీశ్రీ సినిమా పాటల సంకలనానికి ముందుమాటలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రాసిన వాక్యం శ్రీశ్రీపై వచ్చిన గొప్ప వ్యాఖలలో ఒకటి.

శ్రీశ్రీ అభ్యుదయ దృష్టి వ్యాపార పరిధులకు లోబడిన సినిమా పాటల తోటలో సైతం ఎర్రపూలను పూయించింది. ఐతే అవకాశం లేనిచోట మంకెనలకూ మందారాలకూ బదులుగా మల్లెలనూ మొల్లలనూ గుబాళింపజేసి సినిమా పాటల రచనలో వైవిధ్యాన్నీ, ప్రతిభనూ ప్రదర్శించాడు శ్రీశ్రీ. ఘంటసాల వందలాదిగా శ్రీశ్రీ రాసిన పాటలు పాడారు.

శ్రీశ్రీ రాసిన మొత్తం పాటలు 2000 పైగా వుంటే వాటిలో దాదాపుగా సగం వరకు అనువాద గీతాలే. 22.06.1950న విడుదలైన 'ఆహుతి' అనే డబ్బింగ్ చిత్రంలో రాసిన 'ప్రేమయే జననమరణ లీల...' అనే పాటను తన మొట్టమొదటి సినిమా పాటగా పేర్కొన్నాడు. తొలిపాట ఘంటసాల గళంలోంచి వెలువడడం విశేషం. ఈ చిత్రం ఆర్థికంగా విజయవంతం కాలేకపోయినా అందులోని పాటలు విశేష ఆదరణ పొందాయి. ఆ పాటలు విన్న హెచ్.ఎం.రెడ్డి, అప్పటికి పూర్తికావస్తున్న తమ 'నిర్దోషి' తమిళ చిత్రానికి శ్రీశ్రీని రచయితగా తీసుకున్నాడు. ఆ తరువాత తెలుగు నిర్దోషి, తమిళ నిరపరాధి బ్రహ్మాండమైన విజయాలు సాధించడంతో హెచ్.ఎం.రెడ్డి రోహిణి స్టూడియో నిర్మించి, నెలకు 300 రూపాయల పారితోషికంతో పర్మనెంట్ రచయితగా తీసుకున్నాడు. ఆ విధంగా ఈ మహాకవి సినీ పరిశ్రమలో స్థిరపడ్డాడు.

'గాంధారీ గర్వ భంగం' (25.06.1956)లో 'మనుష్యుడిల మహానుభావుడే చూడగ - మనుష్యుడిల మహానుభావుడే' అనే పల్లవిలో సాగే డబ్బింగ్ పాట రాశాడు శ్రీశ్రీ. ఈ సినిమా విడుదలైన తొలిరోజుల్లోనే యూరీ గగారిన్ భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి గగనతలంలో కాలుమోపడం శ్రీశ్రీ క్రాంతదర్శి అనడానికి నిదర్శనం.

శక్తివంతమైన సినిమా మాధ్యమాన్ని జన చైతన్యానికి వినియోగించాలనే ఆశతో శ్రీశ్రీ బహుళ ప్రజాదరణ పొందిన తన కవితల్ని ఇలా పాటలుగా మలచాడు.

శ్రీశ్రీ విప్లవాత్మక చిత్రాలకు ముందే వ్యాపార చిత్రాలతో సామ్యవాదాన్ని ప్రబోధించే, సామాజిక చైతన్యాన్ని ఉద్దేశించే ఎన్నో గీతాలు రాశాడు. 'తోడికోడళ్ళు' (11.01.1957), 'నలుగురు కలిసి పొరుపులు మరచీ చెయ్యాలి ఉమ్మడి వ్యవసాయం...' అనే శ్రామికగేయంలో సామ్యవాదాన్ని ప్రకటించడం జరిగింది. 'ఇతరుల కష్టం దోచుకు తినడం ఇకపై సాగే పనికాదు' అంటూ పెత్తందారుల గుత్తాధిపత్యాన్ని ఖండించాడు. 'వెలుగు నీడలు' (07.01.1961)లో 'కలకానిది విలువైనది..' పాట చేజేతులా బ్రతుకు పాడుచేసుకునే వాళ్ళకు ధైర్యాన్నిచ్చే గీతం. ఆత్మహత్య చేసుకోబోయిన ఒక వ్యక్తి ఈ పాటను విని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు శ్రీశ్రీకి స్వయంగా చెప్పాడట. 'అగాధమౌ జలనిధిలోన ఆణిముత్యమున్నటులే శోకాల మరుగున దాగి సుఖమున్నదిలే' అనే పంక్తులు అర్థం చేసుకొనే ఎవ్వరికైనా తట్టిలేపుతాయి. అదే చిత్రంలోని 'ఓ రంగయో పూలరంగయో..' అనే గీతంలో పేదల కష్టాలను వివరిస్తూ 'కలవారలు లేనివారి కష్టాలను తీర్చుదారి కనిపెట్టి మేలు చేయగల'గాలి అని పరిష్కారమార్గాన్ని చూపాడు. వాగ్దానం (05.09.1961)లో 'కాశీపట్నం చూడరబాబు కల్లాకపటం లేని గరీబు...' అనే గీతంలో కూడా పేద గొప్పల తారతమ్యాలను ఎత్తిచూపాడు. సంఘపెద్దలని చెప్పుకునే నాయకుల కుతంత్రాలను వెలికితీసిన చిత్రం 'దేవుడు చేసిన మనుషులు(09.08.1973). ఇందులోని శీర్షికా గీతం (టైటిల్ సాంగ్) ఎంతో ప్రజాదరణ పొందింది.

సాధారణంగా విప్లవ శంఖం, రక్త జ్వాలలు, ఉక్కు

## అమితవ్ ఘోష్‌కు జ్ఞానపీఠ్



**భా**రత సాహిత్య రంగంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారం ప్రఖ్యాత ఆంగ్ల రచయిత అమితవ్ ఘోష్‌ను వరించింది. ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేస్తూ భారతీయ జ్ఞానపీఠ్ బోర్డు ప్రకటన చేసింది. ఈమేరకు జ్ఞానపీఠ్ గ్రహీత, మేధావి, ప్రముఖ నవలా రచయిత ప్రతిభారాయ్ అధ్యక్షతన బోర్డు సమావేశమైంది. ఈ సందర్భంగా అమితవ్ సాహితీ ప్రజ్ఞను భారతీయ జ్ఞానపీఠ్ కొనియాడింది. "అమితవ్ ఘోష్ అద్భుత నవలా రచయిత. చరిత్రను ఆధునిక శకానికి అనుగుణంగా రాయడంలో ఆయనకుఆయనే సాటి."అని పేర్కొంది. ఈ పురస్కారాన్ని తాను ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు అమితవ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అమితవ్ ఘోష్ 1956లో కోల్‌కతాలో జన్మించారు. ప్రస్తుతం తన భార్య దేబొరాహ్ బకెర్‌తో కలిసి న్యూయార్క్‌లో ఉంటున్నారు. ఢిల్లీ, ఆక్స్‌ఫర్డ్, అలెగ్జాండ్రియాల్లో చదువుకున్నారు. ఇప్పటికే పద్మశ్రీ, సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. షాడోలైన్స్, ది గ్లాస్ ప్యాలెస్, ది హంగ్రీ టైడ్, సీ ఆఫ్ పపీస్, రివర్ ఆఫ్ స్మోక్, ఫ్లడ్ ఆఫ్ ఫైర్ వంటి నవలలు రాశారు. ఆయన రాసిన తాజా నవల 'ది గ్రేట్ డిరేంజ్‌మెంట్' 2016లో విడుదలైంది. ♦

పిడికిలి, ఖబడ్దార్, ఉష్ణరక్త కాసారం లాంటి ఘాటు పదాలు పలికే శ్రీశ్రీ కలం భక్తి రసాన్ని కూడా ఒలికించింది. 'జయభేరి' (09.04.1959)లో అధికులు, అధములు అనే తారతమ్యాలను సామ్యవాద దృష్టితోనే మొదలుపెట్టి భక్తిమార్గంలోకి నడిపించే గీతం 'నందుని చరితము వినుమా..', ఆనాటి జనజీవనంలో భాగమైపోయిన హరికథలు, బుర్రకథలు తెలుగు సినిమాల్లో అడపాదడపా దర్శనమిస్తుండేవి. కథా ప్రాధాన్యత గల సినిమా పాటలపై హరికథల ప్రభావం బాగా కనబడేది. ఆ సమయంలో శ్రీశ్రీ రాసిన 'వాగ్దానం'లోని శ్రీ నగజా తనయం సహృదయం...' హరికథ ఇటు సినిమా అభిమానులను అటు భక్తులను సమానంగా ఆకట్టుకుంది. ఈ హరికథను 'కరుణశ్రీ' రాసిన 'హృదయశ్రీ' అనే కావ్యంలో ఉన్న 'ధనుర్భంగము' అనే ఖండిక నుంచి యథాతదంగా తీసుకోగా చివరన వచ్చే 'భూతల నాథుడు...' అనే కందపద్యాన్ని పోతన భాగవతం నుండి తీసుకోవడం జరిగింది.

పెనుచీకటాయే లోకంన.... (మాంగల్య బలం - 07.01.1959), పయనించే మన వలపుల బంగరు నావ...(బావా మరదళ్ళు- 11.02.1961), బొమ్మను చేసి ప్రాణము పోసి... (దేవత - 24.07.1965), మనసున మనసై...(డాక్టర్ చక్రవర్తి - 10.07.1964), చీకటిలో కారుచీకటిలో... (మనుషులు మారాలి - 02.10.1969) మొదలైన విషాదగీతాలు శ్రీశ్రీ రాయగా ఘంటసాల గానం చేశాడు.

సినిమా వ్యాపారకళ కాబట్టి సినిమా పాట రాయడం రచయిత ఇష్టాలకు పూర్తిగా లోబడి వుండదు. చాలామందిలాగే బతకడం కోసం సినిమారచన చేపట్టిన శ్రీశ్రీ సామాజిక ప్రయోజనం గల పాటలతో పాటు అన్ని రకాల పాటలనూ రాశాడు. ఇంకా చెప్పాలంటే అవసరమైన చోట వేరే రచయితల కంటే ఉదారంగా తన 'ముద్ర' నుండి తప్పుకొని మరీ రాశాడు. అలా రాసిన పాటలే ప్రేమపాటలు. 'నీలోన నన్నే నిలిపేవు నేడే...' (గుడిగంటలు - 14.01.1964), 'ఓ...సజీవ శిల్పసుందరీ...ఎవరివో నీవెవరివో...' (పునర్జన్మ - 29.08.1963) 'ఆకాశవీధిలో అందాల జాబిలి..' (మాంగల్య బలం - 07.01.1959), 'ఎవ్వరి కోసం ఈ మందహాసం...' (నర్తనశాల - 11.10.1963), 'ఎందుకో సిగ్గెందుకో..' (సిరి సంపదలు - 19.09.1962), 'జోరుగా హుషారుగా షికారుపోదమా...' (భార్యాభర్తలు - 31.03.1961) లాంటి ప్రేమగీతాలు రాశాడు శ్రీశ్రీ.

ఛందో బందోబస్తులను ఛట్‌పట్ చెయ్యమన్న శ్రీశ్రీ - సినిమాలలో పద్యాలను రాయడమే కాక పద్య రచనలో అనేక ప్రయోగాలు కూడా చేశాడు. శ్రీనాథుని 'సొగసు కీల్జడదాన' అనే సీసపద్యాన్ని కొంత మార్పుచేసి శృంగారాన్ని పండించాడు.

శ్రీశ్రీ కలం నుండి జాలువారిన పద్యాల్లోని, పాటల్లోని ఉద్వేగాలు, మధుర భావాలు ఘంటసాల గళంద్వారా వెలువడ్డాయి. అవి ప్రేక్షక శ్రోతల మనోఫలకాలపై చెరగని ముద్ర వేశాయి.

శ్రీశ్రీ సినిమా పాటలను సాకల్యంగా పరిశీలిస్తే ఆ మహాకవి ఎర్రపాటల వేగుచుక్కగా మాత్రమే కాదు - తన సత్తా పూర్తిగా చూపకుండా, రసజ్ఞుల దాహం పూర్తిగా తీర్చకుండా వెళ్ళిపోయిన ఓ గాలివాటు నీలి మేఘంగా కూడా అనిపిస్తాడు. ♦

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2018 పురస్కారాలు

**ముస్లిం అస్తిత్వ ఉద్యమ కథలు - కథామినార్**
వ్యాసం: రూ.500/-
రచయిత : డా॥ తవ్వా వెంకటయ్య

**T - సర్కిల్**
కవితకు : రూ .500/-
రచయిత : సురగౌని రామకృష్ణ

■■■

*కవితకు సినీ రచయిత జనార్ధన మహర్షి అందిస్తున్న పురస్కారం, వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.

**- ఎడిటర్**

**సాహిత్య ప్రస్థానం మాసపత్రిక ISSN : 2581 - 7477**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు ఇప్పటికే అకడమిక్ సంస్థల్లో ప్రతిష్ట ఉంది. ఇప్పుడు సాంకేతికంగా ఆమోదం ఉండేలా ఈ నెంబరు ఉపయోగపడుతుంది. విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులకు ఉపయోగం అని తీసుకోమని రెండు తెలుగు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాల నుండి ప్రొఫెసర్లు, విద్యార్థులు పలుసార్లు కోరారు. వారందరికీ ధన్యవాదాలు. విలువైన పరిశోధనా వ్యాసాలకు సాహిత్య ప్రస్థానం ఎల్లప్పుడూ ఆహ్వానం పలుకుతుంది. ఔత్సాహిక సాహిత్య విద్యార్థులను ప్రోత్సహించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. రచనలు ఎప్పటిలానే పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**- ఎడిటర్**

**కవిత**

## అలా తిరిగొద్దాం రా !

- నూనెల.శ్రీనివాసరావు
9492970231



ఇప్పుడూ ఊరుంది
చెట్టుంది పిట్టుంది
వాగుంది వంతెనుంది
కానీ తీరికేది
మనసుపెట్టి చూసేందుకు
మనిషినై చూసేందుకు !

ఇదేం కాలం
క్షణాలకు ముడుపులు కట్టి
డాలర్లుగా మార్చే కాలం
నిమిషాలకు రెక్కలు కట్టి
అవకాశాల ఆకాశాలపై
ఎగిరే కాలం
చల్లని సాయంత్రాలు
వెన్నెల రాత్రులు
ఏవీ పట్టక
ఏవీ నప్పక
ఎవరో తరుముతున్నట్లు నడకతో
ఏదో సాధించాలన్న తపనతో
తనకు తాను యంత్రమై
తనకు తాను మంత్రమై
తిరిగే కాలం
మరిగే కాలం !

ఇక్కడ ప్రపంచం
అరచేతిలోకి వచ్చేసింది
మెదడుతో సంబంధం తెగి
చూపుడు వేలుకు పట్టాభిషేకం
జరిగిపోయింది
మీటనొక్కితే చాలు
అన్నీ ముందు వాలుతాయి
శుభోదయాలు శుభరాత్రులు
అనుబంధాలు అనురాగాలు
అలా తెరపైకొచ్చేస్తాయి
తైతక్కలాడేస్తాయిజి
ఆపైన అవి కంటబడవు
కంటబడినా గుర్తించబడవు !

అంతా మాయ
తనకు తాను గిరిగీసుకున్న
మనిషి మాయ
తన చుట్టూ తాను
స్పృహ కోల్పోయిన మనిషి మాయ
చివరకు తాను మాయమై
మాయమైనాడమ్మా మనిషంటూ
వ్యధచెందే మాయ
ఈ మాయకు విరుగుడేదీ ?

ఇప్పటికీ ఊరుంది
చెట్టుంది పిట్టుంది
వాగుంది వంతెనుంది
పద నేస్తం
అలా తిరిగొద్దాం
హాయిగా అలా ప్రకృతిలోకి
మమేకమౌతూ ప్రక్షాళనమౌతూ ! ♦

# నమ్మకం

- కె. ఉషారాణి
9492879210



చరిత కూర్చున్న పడక కుర్చీ నెమ్మదిగా ఊగుతున్నది ఆమె ఆలోచనలకు అనుగుణంగా. పడక కుర్చీ చరిత బెడ్ రూమ్‌లో కిటికీకి దగ్గరగా ఉంది. కుర్చీలో కూచుని బయటకి చూస్తూ కాలక్షేపం చేయవచ్చు. పటమటి గాలిని ఆస్వాదిస్తూ. గది పక్కనే ఉన్న బాల్కనీలో గులాబీమొక్కకు పూసిన గులాబీల గుబాళింపులు గాలికి తమ పరిమళాన్ని జత చేస్తున్నాయి. చరిత కోసం సాయంత్రమయితే సన్నజాజితీగె నేను ఉన్నానంటుంది.

"చరితా ! ఈ రోజు కాలేజీకి సెలవా? వెళ్లే ఉద్దేశం లేదా? నిన్న ఫంక్షన్ ఎలా జరిగింది ? నీ పాటలు నచ్చాయంటా ?" ప్రశ్నల జడివాన ఆగింది.

"లేదమ్మా! ఈ రోజు కాలేజీకి వెళ్లనులే . క్లాస్‌లు జరగవు. అందరూ అలిసిపోయి ఉంటారుగా."

"సరే ! నేను ఆఫీస్‌కి వెళ్లి వస్తాను" తలుపేసుకో.

తలుపు పడ్డ శబ్దం. ఆ తరువాత టక టక మంటున్న చెప్పుల శబ్దం క్రమంగా తగ్గుతూ వినిపించడం ఆగింది. చరిత కుర్చీ ఊగుతూనే ఉంది.

పన్నెండేళ్ల క్రితం ఇలాగే …

అప్పుడు తాను ఐదో క్లాస్ చదువుతోంది. దసరా సెలవలు. మామయ్య అప్పుడింకా చదువుకుంటున్నాడు. మామయ్య వస్తాడని అమ్మ చెప్పిన రోజునుండి మామయ్య కోసం ఎదురు చూస్తున్నది. రెండో తరగతి చదివే వరకు మామయ్య సెలవలకు వచినప్పుడల్లా తెగ ఆడించేవాడు. తాను ఉప్పెక్కేది కూడా. పెరట్లో మామిడి చెట్టు కాయలు కోసిచ్చే వాడు. బజారుకు తీసుకెళ్లేవారు. అక్కడ బూరలు కూడా కొనే వాడు. బోల్డన్ని కథలు చెప్పేవాడు. మామయ్య తననే ముద్దు చేసేవాడు. అందుకనే మామయ్య కోసం ఎదురుచూడడం. ఇంతగా ఎదురుచూసిన మామయ్య ఊరినుండి పొద్దున్న వచ్చినా బడి హడావుడిలో సరిగ్గా మాట్లాడలేదు. అందుకే బడి నుండి వస్తూనే అందుకుంది.

'మామయ్యా! ఏం తెచ్చావు నాకోసం? ఉత్సాహంగా అడిగింది చరిత. ఇల్లంతా సందడి లేక నిశ్శబ్దంగా ఉంది. అమ్మ కూడా లేదు. ఆకలిదంచేస్తున్నది.

'అమ్మ ఏదీ?' అంటూ మరో ప్రశ్న. మామయ్య తనకోసం తెచ్చిన కొబ్బరి లౌజు, చాకలేట్లు ఇచ్చాడు. తిని కబుర్లు చెప్పింది. తన కొత్త స్నేహితులు, మాస్టర్లు, ఆటలు, మాస్టర్లను ఎలా ఆటలు పట్టించారో కథలు కథలుగా చెపింది. టైం తెలియలేదు. పొద్దుపోయిన తరువాత అమ్మ వచ్చింది.

ఆఫీస్ నుండి వస్తూ దారిలో వాళ్ళ కొలీగ్‌కి బాగులేకపోతే చూడడానికి వెళ్లిందట. మర్నాడు అమ్మ ఎప్పటిలాగానే ఆఫీస్ కి వెళ్ళింది.

"మామయ్య ఉన్నాడుగా! మధ్యాన్నం నేను లంచ్‌కి ఇంటికి రాను. ఏకంగా ఐదింటికే వస్తాను. సరేనా ?" అమ్మ

"ఒకే ! నేను బొమ్మలు వేసుకోవాలి. హెూమ్ వర్క్ కూడా బోలెడుంది." నవ్వుతూ టాటా చెప్పాను .

హాల్‌లో టి వి చూస్తున్నాడు మామయ్య. హాల్లోనే ఉన్న డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని బొమ్మలు వేసుకుంటున్నది తను.

ఒంటి గంట అవుతుండగా కాబోలు. "ఆకలేస్తోంది ఇక తిందామా" అన్నాడు మామయ్య .

"సరే ! మామయ్య" అంటూ టేబుల్ మీద పుస్తకాలు పక్కన పెడుతుండగా వచ్చి పక్కన కూచున్నాడు. కంచాలు ఇద్దరికీ పెట్టాడు. అన్నం కలుపుకుంటానన్నా తానే కలిపి పెట్టాడు. చక్కగా నెయ్యి వేసాడు. అమ్మయితే నెయ్యి ఎక్కువ తినవద్దంటుంది. తనకేమో నెయ్యి అన్నంలో వేసుకుంటే మహా ఇష్టం. భోజనాలు ముగించాక తను మళ్ళీ పుస్తకాలు ముందేసుకుంది. మ్యాప్స్ వేయాలని సిద్ధమవుతున్నది.

ఈ సారి మామయ్య తనపక్కనే కూచున్నాడు. టి వి చూసి బోర్ కొట్టిందేమో అనుకుంది.

పక్కనే కూచున్న మామయ్య చెయ్యి నెమ్మదిగా తన తొడ మీద పెట్టాడు.

"ఏం మ్యాప్ వేస్తున్నావు. నీకు నేను వేసి పెట్టనా ?"

"వద్దులే నేనేసుకోగలను"

"చూడనీ .. ఎలావేస్తున్నావో " కుడి చెయ్యి మెడ చుట్టూ వేసాడు. కానీ ఆ వేయడంలో ఏదో మార్పు ఉంది. మామయ్య ఊపిరి మెడకు తగులుతుంది వెచ్చగా. ఎడం చెయ్యి కాలి తొడపై ఉంది. కాసేపటికి చెయ్యి ఇంకొంచం పైకి వచ్చింది. దాదాపు తొడల మధ్యలోకి చేరింది. ఎక్కడో తడుముతున్నాడు. లేచి పక్క కుర్చీలోకి వెళ్ళ బోయింది.

"పరవాలేదు ఏమీకాదు. నీ పని నువ్వు చేసుకో."

ఒక వైపు అయోమయంగా, కొత్తగా, ఇబ్బందిగా ఉన్నా, మామయ్య ఏంచేస్తున్నాడో అర్థం కాలేదు. కొంతసేపు అచేతనంగా అనిపించినా తేరుకుని విసురుగా పుస్తం తీసుకుని పక్కింటికి వెళ్లి పోయింది.

అయిదింటికి అమ్మ వచ్చింది. అమ్మ రావడం చూసి ఇంటి కొచ్చాను.

"నీ కూతురికి పెత్తనాలు బాగా అలవాటయినట్టు ఉన్నాయే" మామయ్య.

"ఏరా! చదువుకోలేదా" అమ్మ .

"కాసేపు ఏవో బొమ్మలు కెలికిందిలే! భోజనం చేయగానే చెక్కేసింది." మామయ్య

ఎందుకెళ్లానో అమ్మకు చెప్పాలా వద్దా? చెప్పాలంటే ఏమని చెప్పాలి? మామయ్య నన్ను కొట్టలేదు. తిట్టలేదు. పైగా చక్కగా అన్నం కూడా పెట్టాడు. ఆలోచించి ఆలోచించి ఏం చెప్పాలో తెలియక ఎలా చెప్పాలో అసలే తెలియక మామయ్య ఊరెళిపోతే బాగుండునని అనుకుంటూ నా గదిలోకి వెళ్లిపోయాను. అమ్మ ఏ మూడ్‌లో ఉందోగాని మళ్ళీ మామయ్య కంప్లైంట్ మీద ఏమి కదిలించలేదు. నా లక్ మామయ్య మర్నాడు ఫ్రెండ్ దగ్గరికని పొద్దున్నే వెళ్లి రాత్రికిగాని రాలేదు .

"ఏం పెత్తనాలని" అమ్మ మామయ్యని అడగనేలేదు, ఆశ్చర్యంగా. ఆ తరువాత రోజు హాస్టల్‌కి వెళ్ళిపోయాడు.

"అబ్బా ! బతికిపోయాను" అనుకున్నాను. చాలారోజులు ఆ సంఘటన అప్పుడప్పుడు గుర్తుకొస్తూనే ఉంది. అమ్మకెలా చెప్పాలి? అసలు చెప్పాలా వద్దా ? ఏదో తప్పని పించింది. కానీ జరిగిన తప్పేమిటో, ఎలా చెప్పాలో తెలియలేదు. దాని గురించి ఆలోచిస్తుంటే అమ్మ "నీకీ మధ్య పరధ్యాన్నం ఎక్కువ యింది" అని కేకలేసింది కూడా. అలా తరువాత బడిలో ఆటలు పాటల హడావుడితో ఆ తరువాత మామయ్య భయాన్ని మరిచిపోయింది

ఓ రోజు ..చెంగుచెంగున దూకుతూ గుమ్మంలో ఓ పెద్ద వెండి కప్పుతో అడుగు పెట్టిన చరితకు అమ్మ చిరునవ్వు ఎదురొచ్చింది.

"ఏం పందెం"

"హర్డిల్స్"

ఎప్పుడూ హడావుడిగా అటూ ఇటూ పరిగెడుతూ మధ్య మధ్యలో ఏదో ఒక ప్రైజ్‌తో ఇంటికి రావడం అమ్మకు మామూలే. వచ్చాకే అది రన్నింగ్లోనా, క్విజ్ లోనా, మరే ఇతర ఈవెంటో అమ్మకు తెలిసేది. కప్పును అప్పటికే కప్పులతో నిండి ఉన్న షో కేస్‌లో దూర్చి అమ్మ పక్కన చేరింది. పోటీలలో పాల్గొన్న వాళ్ళు ఆడిన ఆటలు, జరిగిన పోటీలు అన్నీ పూసగుచ్చినట్టు చెప్పడం మొదలు పెట్టింది. అమ్మ దోసెలు పోస్తూ వింటున్నది. దోసెలు ఒకదాని తరువాత ఒకటి ఖాళీ అవుతున్నాయి. ప్లేట్ భర్తీ అవుతున్నది. ఖాళీ అవుతున్నది. కబుర్లు ఆగడం లేదు.

రోజులు గడుస్తున్నకొద్దీ పాత జ్ఞాపకాలు మసక బారాయి.

మళ్ళీ ఈ రోజు .... అవి గుర్తుకొస్తున్నాయి ..

నిన్నటి సంఘటనతో జ్ఞాపకాల పొరలు కదులుతున్నాయి.

ఎందుకో  అందరిలాగా తనకీ నాన్న ఉంటె బాగుండుననిపిస్తున్నది. నాన్న పదే పదే ఈ రోజు గుర్తుకొస్తున్నాడు. చరితకి నాన్న లీలగా గుర్తున్నాడు. ఒకసారి ఇద్దరూ పార్కుకి వెళ్లినట్టు అక్కడ నాన్న ఐస్క్రీమ్ కొని పెట్టినట్టు గుర్తు. నిజంగా కొనిపెట్టడా లేక అది తన ఊహ అన్నది అప్పుడప్పుడు అనుమానం వస్తుంటుంది. తన మొదటి పుట్టినరోజు ఫొటోలో నాన్న, అమ్మ తను. అదే తనకిష్టమయిన ఫోటో. కానీ తనకు బాగా తెలిసిన నాన్న, హాల్లో పూలదండ తగిలించి గోడకి వేలాడుతున్న ఫోటో. తనకి రెండేళ్లప్పుడు తాగి తాగి చనిపోయాడని అమ్మమ్మ చెపుతుండేది.

"మా అక్కది  కులాంతర వివాహం. మా బావది మీ కులమేలే" అని ఒక సారి పిన్ని బజార్లో కనిపించిన తనని ఆమె స్నేహితురాలికి పరిచయం చేసింది. అలా తెలిసింది తనకు అమ్మ పెళ్ళి గురించి. ఏవో తనకు తెలియని సంగతులు ఉన్నాయనుకుంది.  అవెలా తెలుసుకోవాలో, ఎందుకు తమ కుటుంబం అందరికన్నా వేరుగా ఉంటుందో అర్థం కాలేదు. అలా బయట కనపడినప్పుడు మాట్లాడడం తప్ప పిన్నికూడా ఇంటికి రాదు. అమ్మ అయినా  నాన్న గురించి మాట్లాడడానికి అంతగా ఇష్టపడదు. రైల్వేస్‌లో గార్డుగా పనిచేసేవాడని అమ్మ ఒక సారి ఎప్పుడో చెప్పింది. నాన్న పోయిన తరువాత అమ్మకి రైల్వేస్‌లో ఉద్యోగం ఇచ్చారుట.

ఇంటికి ఈ మధ్యనే అప్పుడప్పుడు అమ్మమ్మ వస్తుంది. తాతయ్య ఉండగా వెళ్లనిచ్చేవాడు కాదని చెపుతుంటుంది. తన చిన్నతనంలో మామయ్య తరచుగా వచ్చేవాడు. ఆ రోజు.. తరువాత మామయ్య రావడం మానేసాడు.. అమ్మ అడిగితే సెలవలు లేవని, పని ఉందని అంటుంటాడు. ఇప్పుడు ఇంటికి వచ్చే చుట్టాలు చాలా తక్కువ. ఎప్పుడయినా వచ్చేది అమ్మ స్నేహితురాలు అరుణ ఆంటీ ఒక్కతే. చుట్టాల గోలని స్నేహితులు పిర్యాదులు చేస్తుంటే చుట్టాలసలు ఎవరూ ఎందుకు రారా అని చిన్నప్పుడు చరిత ఆశ్చర్య పోయేది. ఒకటి రెండు సార్లు అమ్మని అడిగే ప్రయత్నంచేసింది.  కానీ సమాధానం రాబట్టలేక పోయింది.

పడక గదిలో పశ్చిమాన ఉన్న కిటికీని అనుకుని తాను కుర్చీ  వేసుకుంది. తోచక బయటికి చూస్తే రోడ్డులో వెళ్లే వారు వచ్చేవారితో సందడిగా ఉంటుంది. అదో కాలక్షేపం. పుస్తకాలు చదువుతున్నా మధ్య మధ్యలో కిటికీలోంచి తొంగి చూడడం ఓ అలవాటు. ఉత్తరం వైపు మంచం. చరితకు స్నేహితులు ఆటపాటలు సరదాలు అన్ని ఇంటి బయటే. అందుకని ఎక్కువసమయం బయట గడపడానికే ఇష్టపడుతుంది. కానీ పదోక్లాస్స్ తరువాత స్నేహాలు పలచబడ్డాయి. గ్రూప్స్ మారాయి. కాలేజీలు మారాయి. స్నేహితులంతా చదువులు, పరీక్షలు, పుస్తకాలూ, వాళ్ళ వాళ్ళ సర్కిల్స్ లో బిజీ అయిపోయారు . సెలవల్లో తోచక చేరిన లలిత సంగీతం క్లాస్ ఆ తరువాతి కాలంలో ఎంతో ఆనందాన్నిచ్చే హాబీగా  మారింది. ఇంట్లో అనుక్షణం తన వెంటే ఉండే నిశ్శబ్దం సాహచర్యానికి అలా ఓ బ్రేక్ పడింది. ఆలా సాఫీగా సాగిపోతున్న సమయంలో మల్లి ఓ అలజడి . ...

అనుకోకుండా నిన్న జరిగిన సంఘటన పాత జ్ఞాపకాలను మళ్ళి గుర్తుచేసింది ...

తొమ్మిదో క్లాస్‌లో స్పోట్స్‌లో పాల్గొనేది. ఆ రోజు స్పోట్స్ మాస్టరు బాల్ ఇస్తానంటే స్పోట్స్ రూమ్ కి వెళ్ళింది. హ్యాండ్ బాల్ టీమ్ తనది. స్పోర్ట్స్ డే కోసం ప్రాక్టీస్ చేయాలనీ అందరు హుషారుగా ఉన్నారు. బాల్ ఇస్తానని రూమ్‌కి వెళ్ళగానే బాల్ ఇస్తూ చేతిని, భుజాలను తాకడం గమనించింది. బాల్ లాక్కుని బయటికి వచ్చింది. కోపంతో తన ముఖం కంది పోయింది. ఫ్రెండ్స్ అంతా ఏమైందంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. చెపితే, వీడింతే అంటూ తమ తమ అనుభవాలు పంచుకున్నారు. కానీ రిపోర్ట్ చేస్తే మననే స్కూల్ నుండి పీకేస్తారు. వీడికేం కాదు. పైగా అమ్మ నాన్న కూడా మనలని తిడతారు. వదిలేయ్. అంటూ అనునయించారు స్నేహితులు. ఆ తరువాత మాస్టార్ని తప్పించుకు తిరగడం స్నేహితులతో కలిసి మాత్రమే ఆయనతో మాట్లాడటం చేసేది. పోటీల్లో బహుమతులు ఈ అపశృతులు మరిపించాయి .

ఆ తరువాత ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ చేదు అనుభవం ...

చరిత కుర్చీ ఊగుతూనే ఉంది. చెంపలపై కన్నీటి చారలజాడలు  ఇంకా అలాగే ఉన్నాయి. కను రెప్పలు కాస్త దళసరిగా ఉన్నాయి నిద్రలేమిని సూచిస్తూ. లాషెస్ తడిగానే ఉన్నాయి. గాలికి ముంగురులు  చెదిరి మరింత గజిబిజిగా ముఖాన్ని కమ్మేస్తున్నాయి. జడివాన వెలిసిన తరువాత ఉండే ప్రశాంతతే గదంతా ఆవరించింది. ఆలోచనల మేఘాలు ఇంకా మస్తిష్కాల్లో కదలాడుతూనే ఉన్నాయి. ఏళ్లతరబడి గుండెలో పేరుకుపోయిన ఆవేదన. పరిష్కారం కోసం తపన. నిస్సయురాలిని అనిపించి ఆ రాత్రి ఆలోచనల వరదలు అలా ముంచెత్తాయి. గదిలోని నిశబ్దాన్ని చీలుస్తున్న ఒకే ఒక

చిన్నపాటి శబ్దం. సీలింగ్‌కి కట్టిన గంటల డెకర్ గాలికి ఊగి చేసే శబ్దం. దక్షిణం వైపున్న బాల్కనీ తలుపు తెరిచే ఉండడంతో గాలికి గంటలు ఊగి చిన్నపాటి శబ్దం చేస్తున్నాయి. శబ్దం చిన్న పాటిదే అయినా నిశ్శబ్దానికి పెద్ద భంగమే మరి. ఇంకా తెల్లవారక పోవడంతో వీధిలో అలజడి మొదలు కాలేదు . పాలవేను కూడా రాలేదు. రాత్రి జరిగిన సంఘటన మళ్ళీ మళ్ళీ గుర్తుకొస్తూనే ఉంది . ...

నిన్న రాత్రి కాలేజ్ డే సంబరాలు

చరిత డిగ్రీ స్టెల్లాలో ముగించుకుని యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో చేరింది. తనకు నచ్చిన అర్థశాస్త్రంలో సీటొచ్చిందని సంబర పడింది. చదువుకు పడ్డ కష్టాలను యిట్టె మరిపించిందా విజయం. లెక్చరర్ గా ఉద్యోగం చేయాలన్న కల సాకారం చేసునేందుకు కష్టపడి డిగ్రీలో హానర్స్ చేసి పి జి ఎంట్రన్స్‌లో సెలెక్ట్ అయింది . క్లాస్‌లో నలభై మంది విద్యార్థులు ఉన్నారు. యూనివర్సిటీ అవడం వలన అన్ని ప్రాంతాల వారు ఉన్నారు. చరితకు అదో కొత్త అనుభూతి. ఇది వరకు తాను చదివిన కాలేజీ కేవలం ఆడపిల్లల కాలేజి. లెక్చరర్లు కూడా ఆడవారే. ఇక్కడలా కాదు. అబ్బాయిలు, అమ్మాయిలు. అన్ని ప్రాంతాల వారు. రకరకాల యాసలు భాషలు ఆలోచనలు. వాదనలు ప్రతివాదనలు, అల్లర్లు. ఉత్సాహం కలిగించే వాతావరణం. పెద్ద లైబ్రరీ. చరితకి ఈ వాతావరణం బాగా నచ్చింది. ఉత్సాహంగా అన్ని కార్యక్రమాలలోను పాలుపంచుకుంటున్నది . ఇక కాలేజ్ డే సంగతి చెప్పాలా! ఆనాటి ప్రోగ్రాంలో చరిత పాటల ప్రోగ్రాం ఉంది. నెలరోజుల ముందు నుంచే బాగా సాధన చేయడం మొదలు పెట్టింది. తోటివారిని ఉర్రూతలూగించే పాటలను ఎంచుకుంది. పాడేందుకు సిద్ధమయ్యింది.

ఏడింటికి ప్రోగ్రాము. ఆరింటికి కాలేజ్ చేరి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్ళింది. డ్రెస్సింగ్ ముగించుకుని పడాల్సిన పాటలను ఓ సారి చూసుకుని పాడేందుకు సిద్ధంగా ఉంది. మైక్‌లో పేరు పిలవంగానే స్టేజ్ ఎక్కింది.

'రంగమ్మా మంగమ్మా.. అంటూ మొదలు పెట్టి వరసగా పాటలు పడుతున్నది... పాటలు ఆహూతుల చప్పట్లు వాతావరణం ఉత్సాహంగా ఉంది. సహజంగా శ్రావ్యమైన గొంతు మంచి ప్రిపరేషన్‌తో ఆహుతులను ఆకర్షించగలిగింది. చప్పట్లు. ఈలలు. చరిత మనసు గాలిలో తేలిపోయింది. పాటల ప్రోగ్రాం ముగిసింది. అభినందనలు వెల్లువెత్తాయి. సంతోషంగా కింది కొచ్చి మిగిలిన ప్రోగ్రామ్స్ చూద్దామని వచ్చి కూచుంది. రాగానే తన విభాగం ప్రొఫెసర్ ఆనంద్ ఎంతో బాగా పాడావని అభినందిస్తూ కరచాలనం చేసారు. నిజానికి ఆ రోజు చాలామంది కరచాలనం చేసాడు.

కానీ ఆనంద్ సార్ కరచాలనంలో వేడి చరితను కాస్త ఇబ్బంది పెట్టింది. అయినా సద్దుకుంది. ప్రోగ్రామ్స్ ముగిసేసరికి రాత్రి తొమ్మిదయింది. అందరూ ఇళ్ళకి బయలు దేరారు. ఆనంద్ ఇల్లు కూడా చరిత ఇంటి వైపే. బస్ కోసం ఎదురుచూస్తుంటే ఎంతకీ రావడం లేదు. ఈ లోగా ఆనంద్ వచ్చి "నేను డ్రాప్ చేస్తాను చరితా నీకేమన్నా అభ్యంతరమా ! ఈ రోజు నుంచి నేను నీ అభిమానిని అయిపోయాను. క్లాస్‌లోనే లెక్చరర్ ని." అన్నాడు.

అభ్యంతరం ఉన్నదనడానికి సందేహిస్తూ లేదన్నది. తెరిచిన డోర్‌లో కెళ్ళి కార్‌లో కూచుంది. కార్లో కూచోగానే క్లాస్ల గురించి టీచర్ల గురించి కాసేపు మాట్లాడుకున్నారు. చరితకు జంకు తగ్గింది. తన సహజ ధోరణిలో మాట్లాడడం మొదలు పెట్టింది. బహుశా ఇందాకలా అతని కరచాలనాన్ని తానే అనవసరంగా అనుమానించిందేమో! పది నిముషాలు దొర్లాయి.

ఈ లోగా ఏదో స్పీడ్ బ్రేకర్ వచ్చి సడన్‌గా బ్రేక్ వేశాడు ఆనంద్. చరిత తూలింది. ఆమెను ఆపేందుకు అన్నట్టుగా సాకుతో ఎడం చేయితో పొదవి పట్టుకుని పొట్టపై చేయి వేసాడు.

"సారీ ముందుకు పడతారని .. సీట్ బెల్ట్ మీరు పెట్టుకోలేదుగా !"

"మళ్ళీ అపార్థం చేసుకున్నాను" చరిత పశ్చాత్తాప పడింది.

ఫరవాలేదన్నట్టు చూసింది.

ఆనంద్ నవ్వి రోడ్ వైపు చూసాడు.

రోడ్ నిర్మానుష్యంగా ఉంది. చరిత వాళ్ళ కాలనీ దగ్గరలోకి చేరారు. ఇంకొక్క మలుపు తిరిగితే కాలనియే. ఈలోగా చరిత ఊహించని విధంగా ఆనంద్ కుడి చేయితో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూనే ఎడంచెయ్యిని చరిత నడుం చుట్టూ బిగించాడు.

చరిత ఒక్క క్షణం బిత్తర పోయి వెంటనే తేరుకుని

"ఏంటి సార్. మీరేం చేస్తున్నారు" అని కోపంతో అరిచింది.

"ఇదేం పెద్ద విషయం కాదు చరితా ! టేక్ ఇట్ ఈజీ. మనం వయసులో ఉన్నాం. ఈ వయసులో ఎంజాయ్ చేయాలి. ఆ తరువాత మళ్లీ ఇవన్నీ కుదరవు."

చరిత చేతిని విదిలించే ప్రయత్నం చేస్తూనే ఉంది. తన

రెండు చేతులతో అతని చేతిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నా బలమయిన ఆ చెయ్యి తన శరీరంపై నాట్యం చేయడం ఆగడంలేదు. కారు మాత్రం కదులుతూనే ఉంది.

"చరితా ఇదంతా ఇప్పుడు కామన్. లెట్ అస్ ఎంజాయ్! నాకు నువ్వంటే ఎంతో ఇష్టం. పెళ్లి అయిపోబట్టిగాని లేకుంటే నిన్నే చేసుకునే వాడిని. అయినా ఫరవాలేదు. వీలయినప్పుడల్లా ఎంజాయ్ చేయవచ్చు. ఇది ఎంజాయ్ చేయాల్సిన ఏజ్. నీ పాటలు నాకు మత్తెక్కించాయి. ప్లీజ్ నన్ను ఆపకు. నీకూ ఆ మాత్రం మత్తు ఎక్కలేదా. లేకుండానే అంత మత్తుగా పాడగలిగావా! నేను ఆ మాత్రం అందంగా లేనా? కేవలం పెళ్లవడం నా డిస్క్వాలిఫికేషన్ అంటావా? ఒక్క చిన్న కిస్. అంతే. నీ సక్సెస్ సెలిబ్రేషన్...మొహమాటపడకు. నీకు క్లాస్‌లో మంచి పెర్సెంటేజ్ రావాలంటే నాలాంటి వారి ఆశీస్సులు ఉండాలి. నీ భవిష్యత్తుకి బంగారు బాట వేస్తాను. నీ కల సాకారం చేసుకోవాలంటే నాలాంటి వాళ్ళసహకారం తప్పనిసరి. మనకి మంచి జ్ఞాపకాలు ఉండనీ.."

విసురుగా దూరం జరిగింది. కోపంగా ఓ చూపు చూసింది. ఆనంద్ ఆగిపోయాడు. కార్ ఆపమనింది దృఢమయిన స్వరంతో. కార్ ఆగింది. చరిత కారు దిగింది. ఇంటికి ఇక వంద గజాలే దూరం ఉంది. కారు లోపల కన్నా బయటే సేఫ్ అనిపించి దిగిపోయింది.

కాస్త దూరంలో వీధి దీపం కాంతిలో ఎదురింటి నజీర్ కనిపించాడు. వీధిలో లైట్స్ అన్నీ వెలగడం లేదు. కాస్త చీకటిగానే ఉంది. అయినా నజీర్ ముందు ఉన్నాడన్న భావనతో కొంత మనసు కుదుట పడింది. నజీర్ చిన్నప్పటి నుంచి తెలుసు. నజీర్ చెల్లి నసీమ తన క్లాస్. బాగా చదువుతుంది. ఇప్పుడు గుంటూరు మెడికల్ కాలేజీలో చదువుతున్నది. నజీర్ తన కాలేజీ లోనే చదువుతున్నాడు. కాలేజ్‌లో ఎం ఏ మాథ్స్. మంచి పేరుంది. అనవసర విషయాల జోలికెళ్ళడు. తెలిసినా తననెప్పుడూ పలకరించలేదు. ఇద్దరూ వీధిలో నడుస్తున్నారు. నిశ్శబ్దమయిన వీధిలో అడుగులో అడుగులు వేసుకుంటూ నడుస్తున్నా అడుగుల చప్పుడు లీలగా వినిపిస్తూనే ఉంది. వీధి లైట్లు లేవు. అమావాస్య కావడంతో, వీధి లైట్లు కూడా సరిగ్గా వెలగక పోవడంతో చీకటి గానే ఉంది. చీకటికి కాస్తంత అలవాటు పడ్డ తరువాత దారి కనిపించడం మొదలయింది. నజీర్ అసలు తనవైపు తిరిగి చూడలేదు. పలకరించలేదు. మాట్లాడలేదు. బహుశా తాను వెనకాల రావడం గమనించి ఉండవచ్చు. అయితే ముందు నడుస్తున్నాడన్న భరోసా నడకలో తెలిపాడు. ఆ నడకలో తోడున్నాన్న నమ్మకాన్ని ఇచ్చాడు. ఇంతలో ఒక్క సారి నలుగురు అబ్బాయిలు నజీర్‌పై పడ్డారు. జై శ్రీరామ్ అంటూ బాదడం మొదలెట్టారు. ఏరా! నీకు మా అమ్మాయి కావలసి వచ్చిందా? నీదేశం నుండి తెచ్చుకో. లేకపోతె అక్కడికే పో. లవ్ గివ్ అంటూ మా అమ్మాయిల జోలికొస్తే ఊరుకోము. మా దేశం మీద పడి తినడమే కాక మా అమ్మాయిలకు వలలు వేస్తారా?" అంటూ పిడిగుద్దులు కురిపించారు. రెండు నిముషాలలో మళ్ళీ ఆ గుంపు మాయం అయింది. ఈ హఠాత్పరిణామానికి చరిత దిమ్మ దిరిగి పోయింది. అసలే భయంగా ఉంది. నజీర్‌తో ముందెప్పుడూ కలిసి నడవలేదు. ఈ మధ్య కాలంలో రాత్రికి ఒంటరిగా అడుగు పెట్టిందే లేదు . ఇన్ని రోజుల తరువాత చక్కగా స్నేహితులతో గడిపి వస్తుండగా ఈ దారుణం. చరిత పూర్తిగా ఆశ్చర్య చకితురాలయింది. వారెవరో ఎందుకు కొడుతున్నారో ఇద్దరికీ అర్థం కాలేదు. లవ్ అన్న మాట విన్న తరువాత నజీర్ కి కాస్త వెలిగింది. చెప్పాడు. వార్నింగ్ అంటూ అరుస్తూ వెళ్లిన తరువాతగాని వారికి పరిస్థితి అర్థం కాలేదు. రక్తం కారుతూ నజీర్, భయం గుప్పిట్లో చరిత ఇల్లు చేరుకున్నారు. తలుపుతీసిన అమ్మ చరిత ఆందోళనను గమనించలేదు. గదిలో చరిత మంచంపై వాలి పోయింది. రాత్రంతా ఒకటే ఆలోచనలు. కంటికి కునుకు దూరం అయింది. తననింతగా ఆందోళనకి గురిచేసినవారు దర్జాగా ఉన్నారు. సమాధానం దొరకని ప్రశ్నలు ఎన్నో ...

రాత్రంతా అంతులేని ఆలోచనలు. దొంగలు దర్జాగా తిరుగుతున్నారు. నమ్మినవాళ్లు 'నమ్మావు కాబట్టి మోసం చేసాం' అని విర్రవీగుతున్నారు. అమాయకులు బలవుతున్నారు. సరితకు 'మీటూ' ఉద్యమం గుర్తుకొచ్చింది. తనలాంటి అమాయకులు మరెందరో. తాను ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలి. దొంగలను పట్టించాలి . ఆలోచనలనుండి తేరుకుని నిర్ణయాని కొచ్చింది. మనసు కొంత ప్రశాంతతని పొందింది. ఇటువంటి వారిని భరించడం అర్థం లేదు. మన మౌనం వారి బలం. గొంతు విప్పాల్సిందే. వారి అకృత్యాలను బయట పెట్టాల్సిందే. నిర్ణయం తీసుకున్న తరువాత మనసు తేలిక పడింది. ఇక ఆలోచనలకూ స్వస్తి చెప్పి ఆచరణకు బయలు దేరింది చరిత. ఇప్పుడిక బెదురు లేదు. బిడియం లేదు. నిర్భయంగా అడుగులు వేసుకుంటూ బయలు దేరింది . సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యింది. ♦

## నువ్వూ నేనూ.....

- యం.ప్రగతి
9440798008



నేను నీలో సగాన్ని కాదు,
నువ్వూ నా సగానివి కాదు
అది నువ్వు ఇది నేనుగా గుర్తించలేనంతగా
ఒక్కటి మనం!
నీ మెడ శిఖరం చుట్టూ నా చేతులు
సెలయేళ్లయి చుట్టుకుంటాయి.
నీ మమతల గిరుల మొదళ్ళు
ఈ సెలయేళ్ల చుట్టూ పచ్చని కాపు కాస్తాయి.
నా కురులు నీ మనసును ఊయలలూపే పిల్ల
తెమ్మెరలవుతాయి.
నీ ఊపిరి సుగంధం నా సిగలో పూలకు
పరిమళాన్నద్దుతుంది.
ఒక కొమ్మ మీదున్నంత వరకే మనం ఒకరికొకరం!
చిట్టి గువ్వల తోడుగా సాగే బృందగానమవుతాం.
కొమ్మ విడిచి పైకెగిరామా....
మన పయనం చెరో తీరాలకు.
ఆశయ సాధనలో నువ్వు...
కర్తవ్యపాలనలో నేను...
మన అడుగులు సమాంతర రేఖలు
నువ్వెవరి చేతిలోనో జెండావై రెపరెప లాడతావు.
ఏ గొంతులోనో రణన్నినాదమై ప్రతిధ్వనిస్తావు.
నేనెవరి వేలి కొసనో అక్షరాన్నయి ప్రభవిస్తుంటా.
ఏ గుండెలోనో స్ఫూర్తి పలుకునై ప్రవహిస్తుంటా.
అసుర సంధ్యవేళ ఇంకా గూటికి చేరలేదేమని
నీ స్వరతంత్రులు రేడియో తరంగాలై
హ్యాండ్ సెట్ల మీదుగా హెడ్ ఫోన్ల ద్వారా
కర్ణభేరిని దాటి నా హృదయాన్ని కంపింపజేస్తుంటే
నాలో గిలిగింతలు మొదలు.
గూటికి చేరిన క్షణాన నీ దర్శనం కరువైతే
శూన్యం లోకి ప్రవేశించినంత వెలితి నాకు.
నీ అడుగుల సవ్వడిని మోసుకొచ్చే గాలి అలల కోసం
నా మనసు తలుపు తీసి ఎదురుచూపునవుతా!
అలలు తలపుల తలుపులు తట్టిన క్షణం నేను
ఆనందపు గీతమై పల్లవిస్తాను.
ఊసులు కలబోసుకుంటూ మళ్ళీ మనం
మరో ఉదయాన్ని స్ఫూర్తి కిరణాలతో నింపడానికి
చైతన్య స్రవంతులవుతాం. ♦

## మానవత్వపు వర్ణం

- రోహిణి వంజరి
9000594630




రక్తం గ్రూపులు నాలుగేనట
ఎ, బి, ఎబి, ఓ అని
ఏ గ్రూపు రక్తం అయినా
దాని వర్ణం ఎరుపేనట..
ఎక్కడైనా, ఎవరైనా
విశ్వ దాతలు, విశ్వ గ్రహీతలు
కావచ్చునట...
రక్తానికి కులం, మతం,
ప్రాంతమని బేధాలే లేవట..
తాను నిత్యజీవన స్రవంతిలా, జీవనదిలా
యుగాలుగా మనుషుల్లో
క్షణమాత్రకాలం కూడా
విరామమెరుగక ప్రవహిస్తూ
కొన ఊపిరితో ఉన్న దేహానికి
ప్రాణభిక్ష పెడుతుందట....
కానీ మనిషో!!
కులమత విద్వేషాలు పెంచుకుని,
అంతరంగాన్ని
కదనరంగంగా మార్చుకుని
రుధిర తర్పణాలు విడుస్తున్నాడు.....
మనలో ప్రవహించే జీవనదికి లేని
బేధాలు
మనకెందుకో మరి......
యుగాలు మారినా
తరాలు మారినా,
మారని మనిషి అంతరంగాన్ని మార్చే
మానవత్వపు రక్తవర్ణమా
నీవెక్కడ, ఎక్కడ?????

**(మళ్లీ ఎక్కడో కులపిచ్చితో పరువు హత్య జరిగింది అని తెలిసి ఆవేదనతో.....)** ♦

# సంక్లిష్టత నుంచి... సరళత దిశగా... తెలుగు భాష

- భమిడిపాటి గౌరీశంకర్
9492858395



ప్రియతమా.. ప్రియతమా.. ఏ శబ్ధశాస్త్రం వారి చక్కని భాషలో పలుక నీయకుండా చేసిందో కాని.. దాని వలన లాభమేముంది. దేనిచేత అర్థం చాలా విశదంగానూ, దాపరికం లేని హృదయంతోనూ వెల్లడి అవుతుందో అదే చక్కని భాషా నియమం. అదే మీ పాలిటికి శబ్దం అని నా మతం. పరిశుద్ధంగా విప్పారిన హృదయం గల ఇంపైన కథలు విస్తారంగా దేశిమారగలో బప్పి ఉండేటట్లు చెప్పండి... ప్రాకృత భాషలో వున్న లీలావతి కథను తెలుగులో చెప్తూ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారు వ్యాఖ్యానించారు. ఈ కథ క్రీ.శ. 6-7 శతాబ్దాల మధ్యదని లాక్షణికుల, విశ్లేషకుల అంచనా.

కొంచెం ముందుకు కదులుదాం...

నన్నయ్యగారికి పూర్వం అసలు భాషే లేదని ఒకప్పుడు భావించారు. ఉందని తెలిసాకా అదంతా ద్రవస్థితిలో ఉండేదని, దాన్ని ఆయన సంస్కరించి ప్రమాణీకరించారని భావించారు. శాసనభాష అంటే తెలుగే. శాసనమంతా గద్యంలో వున్నది. కొన్ని కొన్ని పదాలు మాత్రమే కాకుండా వాక్యరచన కూడా విలక్షణంగానే వున్నది. ఇది ఇప్పుడు మనము వాడు పద్ధతికి భిన్నం అని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి వ్రాతలను బట్టి గ్రహించవచ్చు.

అనగా మార్పు... మారుతున్న కాలంతో పాటుగా భాష కూర్పు అనేవి కొంచెం కొంచెంగా ఈ నేపథ్యాల నుంచి తెలుసుకోవచ్చు. మరో మచ్చుతునక- చారిత్రక కాలంలో జరిగిన మార్పులను లెక్కలోనికి తీసుకొని బూదరాజు రాధాకృష్ణగారు తెలుగు భాషా చరిత్రను 3 దశలుగా విభజించారు. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 మధ్యనున్న దశ ప్రాక్సాహిత్యదశ. ఈ దశలో నిరూపకమైన విలక్షణ నిర్మాణ క్రమం, ప్రత్యేక భాషాక్రమం ఏర్పడ్డాయి. సాహిత్యదశ రెండవది. క్రీ.శ. 7-9 శతాబ్దాల మధ్యకాలం. వ్యావహారిక సాహిమాండలికాలు ఏర్పడ్డాయి. మణిప్రవాహశైలి ఆచారంలోకి వచ్చింది. నాలుగో వంతు మాటలు ఎరువుగా వచ్చాయి. మూడవది కావ్య భాషాదశ. క్రీ.శ. 10-11 శతాబ్దుల మధ్యకాలం. ఈ దశలో ఎరువు మాటలు సంఖ్య సగానికి సగంగా ఉంది.

ఒక్కమాట...

అజ్ఞాతంగా ఉన్న వాటిని బయటకు తీయటం చరిత్రకారుల కర్తవ్యం. కనుమరుగైపోతున్న వాటిని కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడటం సంస్కృతి సంరక్షకుల బాధ్యత. గతాన్ని అవగాహన చేసుకొని వర్తమానాన్ని వ్యాఖ్యానించడం, భావికి బాటలు వేయటం సాహితీపరుల విద్యుక్త ధర్మం. చరిత్రను అర్థం చేసుకొనేవారికి అభ్యుదయం తథ్యం.

అసలు విషయానికి వద్దాం...

మార్పు కాలానుగతం. సమాజ పరిభ్రమణంలో మార్పు అనివార్యం అనే మార్పు నిర్వచనం భాషకు అన్వయించుకోవచ్చు. తెలుగు భాషా వికాసం.. తెలుగు సాహిత్య చరిత్ర మహోజ్వల ఘట్టాలను మననం చేసుకొంటే ముందుగా గుర్తుకు వచ్చేది కృష్ణదేవరాయలు.. భువన విజయం.. అముక్త మాల్యద... గోదా రంగనాధుల కమనీయ వివాహ వేడుకలు.. తెలుగు భాషా ఔన్నత్యాలు. అయితే కృష్ణదేవరాయలను సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా

ఎందుకు పరిగణించాలి. ఎందుకు కీర్తించాలి. ప్రతి భాషాభిమాని వేసుకోవలసిన ప్రశ్నలివి. ఎందుకంటే దేశభాషలందు తెలుగు లెస్సని ఘనంగా చెప్పిన తుళువ వంశీయుడు శ్రీకృష్ణదేవరాయలు. నాటి దృక్కోణం నుంచి నేటి కోణాన్ని రేఖామాత్రంగా స్పృశించి దర్శించటమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

తెలుగు సీమలో 25 దశాబ్దాలుగా అనేక సామ్రాజ్యాలు వెలసి కాలానుగతంగా రూపుమారి సోదిలోకి రాకుండా పోయాయి. శాతవాహనులు, విష్ణు కుండినులు, చాళుక్యులు, పల్లవులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు తమ ప్రాభవంతో, పాలనా పటిమతో ప్రజల హృదయాల్లో మిగిలిపోయారు. అందులో 230 సంవత్సరాలు అవిచ్ఛన్నంగా తొలిరాజధానిలోనే జేగీయమానంగా వెలిగి మరో 130 సంవత్సరాలు పెనుగొండ, చంద్రగిరిల్లో పాలుపంచుకొన్న విజయనగర రాజ్యాన్ని, కృష్ణదేవరాయల కీర్తీ మరువలేనిది. కృష్ణదేవరాయల చరిత్ర మనకు అమూలాగ్రంగా నేటికీ లభించనే లేదు. ఆనాడు సామ్రాజ్యానికి వ్యాపారులుగా, రాయబారులుగా వచ్చిన పోర్చుగీసు వారి వ్రాతల నుంచి.. ఆయన అనుయాయులు వేయించిన శాసనాలు, తెలుగు సాహిత్యంలో రత్నదీపాల్లాంటి ప్రబంధయుగ సాహిత్యం, అముక్తమాల్యద వంటి వాటి నుంచి సేకరించిన విషయాలలో తగుమాత్రం చరిత్రకు రూపకల్పన చేసారు చరిత్రకారులు, పరిశోధకులు. ఆయన వంశ, భాష, జన్మ, గ్రంథ రచనా మూలాల గురించి అనేక వాదోపవాదాలు జరిగాయి. స్థూలంగా తెలిసిన విషయాల నుంచి సాహితీ పరంగా మాత్రమే వివరాలు తీసుకోవడం జరిగింది.

రాయలు కాలంనాటి సామాజిక స్వరూపాన్ని గమనిస్తే కొన్ని వైవిధ్యాలు గోచరమవుతాయి. ఆయన రాజ్యానికి వచ్చిన నాటికి బల్లాళులు, ఇక్కేరి నాయకులు తిరుగుబాట్లు లేవదీశారు. గజపతుల చేతిలోనున్న ఉదయగిరి దుర్గం (నెల్లూరు జిల్లా) ను వశపరుచుకొన్నాడు. ఆ తరువాత కొండవీడు, కొండపల్లి, తంగేడు, కేతవరం వంటి దుర్గాలను స్వాధీన పరుచుకొన్నాడు. రాయచూరు ముద్గల్లులు, కల్బరిగి (నేటి గుల్బర్గా) బహమనీ సుల్తానుల ఆధీనంలోనివి. పోర్చుగీసు వారితో ఒడంబడిక చేసుకొని 1100 ఏనుగులు, 1 లక్ష 25 వేల గుర్రాలు, 7 లక్షల కాల్బలంతో రాయచూరుపై సునాయాసంగా విజయలక్ష్మిని చేజిక్కించుకొన్నాడు. రాజమండ్రి, పిఠాపురం, సింహాచలం వంటి వాటిని జయించి పొట్నూరు (విశాఖ జిల్లా) విజయస్తూపం నిర్మించాడు. మరోవైపు రాయచూరు ముట్టడి అవమానకరమని, అందుకు తాము అంగీకరించమని రొమ్ము విరుచుకొన్న గోల్కొండ కుతుబ్షా, అహ్మద్ నగర్ నిజాంషా, బరాల్ అహ్మద్‌షాలు రాయల మీదకు రాబోయారు. రాయలే వారికి ఎదురేగి వారిని గెలిచాడు.

విజయనగర చరిత్రను ప్రధానంగా మూడు దశలుగా విభజించవచ్చు.

1. 1336 – 1480 – కన్నడ, తమిళ ప్రాంతాలను, రాయలసీమను ఆక్రమించుకొన్నారు.

2. 1480 – 1550 – తెలంగాణ మినహా ఆంధ్రదేశమంతా కృష్ణరాయల పాలనలోనే ఉంది.

3. 1550 – 1650 – పతనావస్థ – 1565లో కళ్ళికోట యుద్ధంలో ఓడిపోయిన మీదట క్రమంగా రాజ్యం శిథిలమై 1650కి పూర్తిగా అంతరించింది.

ఎందుకివన్నీ వివరిస్తున్నానంటే భాష వినియోగం... సాహితీసృజనలకు చారిత్రక, సామాజిక, రాజకీయ నేపథ్యాలు సహితం భావవాహికలుగా ఉపకరిస్తాయి. కనుక ఈ కోణం నుంచి కూడా వివిధ భాషలకు, ఆయా భాషల చలామణికి ఎక్కువగా అవకాశం ఉందని చెప్పటం కోసం. ఆనాటి భాషను వర్తమానంలోని భాషను తులనాత్మకంగా వివరించుకోవాలంటే ఈ నేపథ్యం అవసరం.

ఒక ఉదాహరణ..

దక్కన్ నవాబుల కాలంలోని సాహిత్యం పెచ్చుభాగం పర్షియన్, అరబిక్ భాషలో వుండేది. మార్మిక కవిత్వం లేక ప్రేమ కవిత్వం.. మరాఠీ, కన్నడ, తెలుగు సాహిత్యంలో కూడా ఈ కాలం ప్రభావం స్పష్టంగా గమనించవచ్చు. సంస్కృత గ్రంథ రచన కూడా సాగింది.

అనగా భాష పదాలు వివిధ సాహితీ ప్రక్రియలుగా రూపాంతరం చెందటం వెనుక మతం, రాజ్యం, ప్రజల మనోభావాలు.. మారే కాల గమనాలు ఉన్నాయనే స్ఫురిస్తుంది. గ్రంథస్తం కాకుండా ఆనోట, ఈనోట ప్రచారమైన ప్రాణాహిత్యం కూడా ఈ రోజుల్లోనే పెరిగింది. బాలనాగమ్మ కథ, కాంభోజరాజు కథ, పాముపాట, లక్ష్మణ దేవర నవ్వులాట వంటి గేయ సాహిత్యం కూడా ఈనాటిదే!

రాయలు కాలంనాటి తెలుగు భాషా వైభవాన్ని పైనుదహరించిన అన్ని అంశాల సారాంశాల నుంచి సాదృశ్యులను సారించినా కొన్ని విషయాలు తెలుసుకోగలం.

ఆయన చిన్నతనంలో సంస్కృతం, కన్నడ, తెలుగు,

తమిళం నేర్చుకొన్నాడు.

ఆయన మదాలస చరిత్ర, సత్యవధూప్రణవం, సకల కథాసార సంగ్రహం, జ్ఞాన చింతామణి, అలంకార శాస్త్రమైన రసమంజరి వంటి కావ్యాలు, జాంబవతి పరిణయం అనే నాటకాలను సంస్కృతంలో రచించారు. అముక్తమాల్యద ఒక్కటే తెలుగు రచన. (పై కావ్యాల్లో జాంబవతీ పరిణయం ఒక్కటే లభ్యం)

అముక్తమాల్యదలో ఆయన చేతిలో తెలుగు భాష ఎన్నెన్నో హొయలు పోయింది. వన్నెలద్దుకుంది. భక్తి, శృంగార, ఆధ్యాత్మిక, జ్ఞానభక్తి, అనన్య నిష్టాభక్తులతో పాటు నగర, గ్రామీణ జీవితాలు, ప్రకృతి వైచిత్రి, రాజసభలు, రాజుల విలాసాలు, విద్యాగోష్టులు వంటి వర్ణనలతో ఆనాటి సమాజంలో ఉన్న భాష, పదచిత్రాలను చిత్రించిన వైనం విశిష్టంగా ఉంటుంది.

కృష్ణదేవరాయలు ప్రేరణతో అష్టదిగ్గజాలు ఎన్నో గ్రంథాలు రచించారు. వాటిలో భాషా గుభాళింపు అనుభవించగలమే గాని చెప్పలేము.

ఆయన కేవలం తెలుగు భాషా కవులనే కాక సంస్కృత, కన్నడ, తమిళ, మళయాళ కవులను ప్రోత్సహించారు. (తిమ్మణ్ణ కవి అష్టోత్తర భారత పర్వాలు కన్నడంలోకి అనువదింపబడ్డాయి. ) తమిళం, మంజిరప్పా, ఇరుసమయ విళక్కం, రాయలు కుమార్తె మోహనాంగి (తిరుమలాంబ) తెలుగులో మరీచీ పరిణయం అనే గ్రంథం రచించింది.

మనుచరిత్ర, పారిజాతాపహరణం, కాళహస్తి మహత్యం, కళాపూర్ణోదయం, పాండురంగ మహత్యం, వసుచరిత్ర వంటి ఉత్తమోత్తమ గ్రంథాలు తెలుగు భాషను పరిపుష్టం చేసాయి. తెలుగు భాషకు రాయలు కాలం పునురుక్తిగానే అయినా అది స్వర్ణయుగం.

వర్తమానంలోకి వస్తే...

సమాజాభివృద్ధికి భాషాభివృద్ధికి విడదీయరాని అనుబంధం ఉంది. సమాజంలో మార్పులు ఒకదశలో అతిత్వరంగా వస్తాయి. ఆధునిక యుగంగా పిలుచుకొనే 20వ శతాబ్దంలో మానవ జీవితంలో అన్ని రంగాలలోనూ వచ్చిన మార్పులను అంతకు ముందటి శతాబ్దుల్లో వచ్చిన మార్పులతో పోల్చి చూస్తే తేడాను గ్రహించవచ్చు. ఇప్పటి సంఘ జీవితం అత్యంత క్లిష్టంగా మారింది. మార్పుల వలన వివిధ రంగాల్లో భాషా ప్రయోగం అవసరమయింది. ఎన్నో రకాల జ్ఞాన విశేషాలను, భాషను ప్రయోగించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. కనుక అతిపరిమిత ప్రయోజనం కలిగిన ప్రాచీన రచనా భాష, సమాజంలో కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న ప్రాచీన సాహిత్య భాష ఈనాటి సామాజిక అవసరాలకు సరిపోవు. ఆయా భాషల్లో రాసే వారి నియమాలు, ఆలోచనలకు స్వేచ్ఛకు సంకెళ్ళుగా తయారయ్యాయి. ఆ భాషలో నియమాలను కొన్నింటిని సడలించి వర్తమానంలో ఎక్కువమంది చక్కగా భాష వలన ప్రయోజనం పొందాలని ఆ దిశగా కృషి జరగాలని ఎందరెందరో ఆశించారు.

కందుకూరి, చిలకమర్తి, కట్టమంచి, రాళ్ళపల్లి వంటివారు ఆచరించారు. ఆ దిశగా కృషిచేశారు. అయితే అతి విస్తృతమైన ఆధునిక ప్రయోజనాలకు పైపెద్దల ప్రయత్నం కూడా సరిపోలేదు. ఈనాటి సామాజిక అవసరాలకు అనుగుణంగా ఈనాటి రచనా భాష నేటి కాలపు మాట్లాడే భాషనుంచి తయారు కావాలని మరికొందరు భావించారు. గురజాడ, గిడుగు వంటివారు క్రియకు శ్రీకారం చుట్టారు. ఆ విధంగా.. ఈనాటి రచనా భాష లేదా సమాజంలో చలామణి అవుతున్న భాష మాట్లాడే భాషనుంచే తయారవుతున్నది. కనుకనే ఎన్నెన్నో అన్యభాషా పదాలు విచ్చలవిడిగా విరివిగా తెలుగు భాషలో కలిసిపోయాయి. కలిసిపోతున్నాయి. ఔచిత్యాన్ని మరిచిపోకుండా ఏ సందర్భంలో అయినా భాషను కళాత్మకంగా ప్రయోగించవచ్చు. పదప్రయోగం, సమాసఘటన, వాక్యవిన్యాసం, విషయ సంయోజనం ఇలా ఎన్నో అంశాల్లో భాషను కళాత్మకంగా ప్రయోగించవచ్చు. ఇందుకు అనేకమైన ఇతర భాషాపదాలు ఉపకరిస్తాయి. వర్తమానంలో జరుగుతున్నదదే..

కాని.. విచారించదగ్గ అంశం ఏమిటంటే... వినియోగించుకొనేందుకు ఎన్నెన్నో పదాలు అందుబాటులో ఉన్నా.. గ్రామీణులు స్వచ్ఛంగా వినియోగిస్తున్న పదాలను నాగరికులనబడేవారు వినియోగించకపోవటం. తవ్వోడ అనే పదం ఇందుకు ఉదాహరణ. మాండలీక పదాలు పల్లెల్లో గ్రామీణులు చక్కగా వినియోగిస్తున్నారు.

ప్రస్తుతం... తెలుగు భాషా పదాలను వెలికితీసి, వాటిని వినియోగంలోనికి తెచ్చే ప్రయత్నాలు... సాంకేతిక శాస్త్ర విజ్ఞానం సహితం తెలుగులోకి తర్జుమా కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నది. కంప్యూటర్‌లో కూడా తెలుగు లిపి కోసం పలు ఫాంట్‌లను కనుగొంటున్నారు. అమలు చేస్తున్నారు. భాష మరల జవసత్వాలను పుంజుకుంటున్నది. మంచిరోజులు వస్తాయనే ఆశ... ♦

## ఒక్కోసారి...!!



- యామినీ దేవి కోడే
9492806520

మది గదిలో నువ్వు మోస్తున్న సవ్వడి
నా నుంచీ విందామనుకుంటావ్..!
తాళానికి శృతి కలిపే రాగం రానే రాదనుకునే నేను..
మాటతోనో, మనసుతోనో కాక మౌనాన్ని మాత్రమే తిరిగి
ఇవ్వగలుగుతాను.
మాట లేని గాయమొకటి నా మౌనం చేసిందని తెలిసాక...
మౌనం కూడా ప్రమాదమని అర్థమైన క్షణాలవి!
నేనూ... గాయపరచగలననే నిజాన్ని చూసానప్పుడు.
నా మాటని ఇప్పుడు
నీ మౌనం నిజంగా మింగేసినట్టుంది.
ఊహనైనా ఊహించలేదు!!
కాలానికి మాత్రమే ఆశలిచ్చి..
మనసుకైన గాయాన్ని మాన్చలేని వేదననై..
వరమైనా, శాపమైనా
ఏదీ అందుకోలేని శక్తిహీనతకు గురికాబడతానని..
చేతనలో ఉండగలనో..
అచేతన స్థితికి చేరుకుంటానో..!
కొన్నిటికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

మనసు మాట్లాడలేని
క్షణాలన్నీ పోగేసినప్పుడు
అవ్యక్తపు వేదనలో మునిగి
గురుతుకు రాని క్షణాలను ఏరి వేసి
గుర్తొచ్చే సుమాలను దండగుచ్చమంటే ఎలా..
మదిపూలవనం అంతా కలియతిరుగుతూ
కాలం వైపు చూస్తూ అలా నిశ్చలమైపోయా.. ♦

---

## జంక్షనులో టీ కొట్టు

- బొద్దూరు విజయేశ్వర రావు
9490544551

గేటు జంక్షనులో టీ కొట్టంటే చాలు
మనసు రెక్కలు కట్టుకొని వాలిపోతుంది!
కూటికోసం గూటినొదిలిన పక్షుల్లా
కూలికోసం మేమంతా బయటికొచ్చాక
కలుసుకొనే స్నేహ సంగమమది!
దాన్ని తప్పించుకొని వెళ్ళినరోజు
పరీక్ష తప్పిన పిల్లాడిలా
ముఖం వాడిపోయేది!
కాలాన్ని కరిగిస్తూ కదులుతున్న
ఒడిదుడుకుల జీవన రహస్యపు మొగ్గలన్నీ
స్వేచ్ఛగా విచ్చుకొనేదిక్కడే!
చిరిగిన బతుకులో
చెరగని ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ
నిలువెత్తు ప్రేమ స్వరూపి ఆ టీకొట్టువాడు!
పాలవంటి తన మనసు నుండి
మాటలను పొంగిస్తూ
ఆప్యాయతల టీ పొడిని కలిపి



అనుబంధాల చిక్కటి 'టీ'ని
మాకందించేవాడు!
నిరంతర జీవనగమనంలో
మాకొక జ్ఞాపకాల మూటలను
అందించిన

ఆత్మీయ మమతల కుటీరం ఆ
టీకొట్టు!
ఆధునికీకరణ గారడీలో
ఇప్పుడది ఫ్లైవోవర్ పునాదుల క్రింద
సమాధి అయ్యింది!
దాన్ని నమ్ముకొని
బతుకుబండిని నడిపిన వాడు
తన నెత్తుటితో
రైలు పట్టాలని అభిషేకం చేసి
రుణం తీర్చుకొన్నాడు! ♦

ఇంటర్వ్యూ

# కవిత్వం సామాజిక ప్రయోజనం కోసం రాయాలి

## - పక్కి రవీంద్రనాథ్




ఇంటర్వ్యూ: పాయల మురళీకృష్ణ
8309468318

సాహిత్యంలో పార్వతీపురానికి గొప్ప విశిష్టత వుంది. అన్ని సాహితీ ప్రక్రియలలోనూ రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధులయిన వారుండడం ఈ నేల గొప్పతనం. ప్రస్తుత కాలంలో ఇక్కడ ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు నాలాంటి ఎంతోమంది సృజనశీలురను వెతికి పట్టుకుని మరీ ప్రోత్సాహిస్తున్నారు. అతని మార్గనిర్దేశంలోనే మెరికల్లా తయారయిన నా మిత్రులు మల్లిపురం జగదీష్, చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడులతో పాటు ఔత్సాహిక కవులు, కథకులూ అయిన పల్ల రోహిణీకుమార్, చందనపల్లి గోపాలరావు, హరిచందన్, తిమ్మక రాంప్రసాద్ లాంటివారు ఎందరో వున్నారు. వీరేకాక సాహిత్య ప్రముఖులయిన కె క్యాబ్ వర్మ, పాలకొల్లు రామలింగ స్వామి కూడా స్థానికంగానే వున్నారు. ఇక బాలసాహిత్యానికి సంబంధించి నాలుగు దశాబ్దాలుగా రచనలు చేస్తున్న లబ్ద ప్రతిష్ఠులైన నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెహరా ఉమామహేశ్వరరావు బెలగాం భీమేశ్వరరావు, బి.వి.పట్నాయక్ వంటివారు కూడా పార్వతీపురానికి చెందినవారే

♦ ***రవీంద్రనాథ్ గారూ నమస్తే.. ఎక్స్‌రే జాతీయ కవితల పోటీలో అత్యుత్తమ బహుమతి పొందినందుకు ముందుగా అభినందనలు***

ధన్యవాదాలు మురళీకృష్ణ గారు

♦ ***మీరు తొలిసారిగా కవిత్వం రాయడానికి ఎప్పుడు పూనుకున్నారు దానికి ప్రేరణ ఏమిటి?***

కవితలను చదవడం పట్ల చిన్నప్పటి నుండే నాకు ఆసక్తి ఏర్పడింది. దీనికి కారణం మా మేనమామ బృందావన్‌పట్నాయిక్ అనే చెప్పాలి. నా హైస్కూల్ చదువంతా మేనమామ గారి సంరక్షణలోనే సాగింది. అప్పట్లో ఏదో దిన పత్రికలో 'కొత్త పాళీలు' అనే శీర్షిక పేరుతో ప్రతిరోజూ రెండో మూడో కవితలు ప్రచురించేవారు. మా మేనమామకు సాహిత్యంలో ప్రవేశం వుండేది. ఆయన ఆదేశం మేరకు మాకు ఇష్టం వున్నా లేకపోయినా మేము వాటిని విధిగా చదివి ఒక నోటుపుస్తకంలో రాయాల్సి వచ్చేది. ఈ కాలక్రమంలోనే దృష్టి కవితలు చదవడం నుంచి రాయాలనే కోరిక కలిగేవరకూ వెళ్ళింది. అందరిలాగే యవ్వనారంభపు రోజుల్లో కళాశాల కన్నెగాలిహోరుతో గుండెలోంచి దూకిన కవిత్వం పుస్తకాల్లో దాక్కోవడం మొదలయింది

♦ ***పార్వతీ పురం నుండి అనేకమంది సాహితీ సృజన చేస్తున్న వారు ఉన్నారు కదా! వాళ్ల సాంగత్యం మీ సృజనకు ఎలా దోహదం చేస్తోంది?***

♦ ***ఎప్పుడో కవిత్వం రాయడం మొదలు పెట్టిన రవీంద్రనాథ్ ఇప్పటికీ పుస్తకం తీసుకు రాలేక పోవడానికి కారణమేంటి?***

దీనికి ప్రధాన కారణం నన్ను నేను ఒక సీరియస్ కవిగా గుర్తించలేకపోవడమే. 1985, 1987 నుండి 90 మధ్యలో

రాసిన కవితలు ప్రముఖ పత్రికలలో ప్రచురించబడుతుండేవి. అయితే నేను రాస్తున్న కవిత్వం ప్రామాణికత, నాణ్యతల విషయంలో నాకు అంతగా సంతృప్తిగా అనిపించేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే వచన కవిత అన్నిస్థాయిల పాఠకుణ్ణి చేరుకోలేకపోవడం నాకు బాగా అసంతృప్తిని కలిగించేది. వీటన్నిటికీ సంతృప్తికరమైన సమాధానాలు నాకు గౌరునాయుడు గారి ద్వారా లభించాయి. ప్రస్తుతం పుస్తకాన్ని తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది

♦ *మీ కవితా ప్రస్థానం లో రెండు సార్లు సుదీర్ఘ విరామాలు రావడానికి కారణమైన అవరోధాలేంటి...సున్నిత మనస్కుడైన మీరు వాటినెలా దాటి వచ్చారు?*

పైన చెప్పిన జవాబే దీనికీ వర్తిస్తుంది. అయితే నాకు సంబంధించినంతవరకు నిజాయితీగా చెప్పాలంటే నేను కవిత్వంలో వెలిబుచ్చిన అభిప్రాయాలను నేనెంతవరకు ఆచరిస్తున్నానన్న ప్రశ్న అడుగడుగునా అడ్డం పడేది. అదే చాలా సందర్భాలలో నన్ను రాయనీకుండా కూడా చేసింది. అయితే కవిత్వం మీద వున్న ప్రేమ మీలాంటి సాహితీమిత్రుల సాంగత్యం ఈ అవరోధాలను దాటిస్తూ మళ్ళీ కవిత్వపుదారి పట్టిస్తోంది .

♦ *ఉత్తరాంధ్ర లో మీకు నచ్చిన కవి,తెలుగులో ఇష్టమైన కవి,ఇతర భాషల్లో మీరు అమితంగా ప్రేమించే కవి ఈ వివరాలేవైనా చెప్పగలరా*

ఉత్తరాంధ్రకు సంబంధించినంతవరకు గంటేడ గౌరునాయుడు, కె.క్యూబ్ వర్మ గార్ల కవిత్వాన్ని నేను బాగా ఇష్టపడతాను. ఇతర భాషల కవులను ఎవర్నీ నేనింతవరకూ చదువుకోలేదు.

♦ *మీరు కవిత్వం మొదలు పెట్టిన రోజులకీ ఇప్పటి రోజులకీ కవిత్వ నిర్మాణం లో ఎలాంటి మార్పులు గమనించి ఉంటారు*

నేను కవిత్వం రాయడం మొదలుపెట్టింది 35 ఏళ్ల క్రితం. అప్పటి కవిత్వానికీ ఇప్పటి కవిత్వానికీ నిర్మాణం, శిల్పంలో బాగా తేడా వచ్చింది. ఇప్పుడు రాస్తున్నవారిలో ఒకపక్క రోజుకో కవిత రాసి పడేయాలనే ధోరణిలో రాస్తుంటే మరోపక్క తక్కువగా రాసినా కవిత్వమంటే మన అనుభవాలకు అక్షరాల రెక్కలు తొడిగి పాఠకుల హృదయాలలో విహరింపజేయడమే ధ్యేయంగా సిన్సియర్‌గా కవిత్వాన్ని రాస్తున్న వారున్నారు. వీరిలో అనిల్ డ్యానీ, పాయల మురళీకృష్ణ, అరుణ్ బవేరా, పుప్పాల శ్రీరాం, చింతా అప్పలనాయుడు, మొయిద శ్రీనివాసరావులాంటి వారున్నారు

♦ కవిత్వంలో ఇప్పటి వారితో పోటీ పడటం మీకెలా అనిపిస్తోంది. కవిత్వంలో పోటీ అనే మాటకు తావు లేదు. కవిత్వం ఒక హృదయం నుండి మరో హృదయానికి జరిగే నిశ్శబ్ద సంగీత ప్రసారం. ఏకాంత యానకంలోంచి అక్షరాలను ఆవహించే ఈ క్రమంలో నాకయితే ఇంతవరకూ కవిత రాస్తున్నానన్న స్పృహకూడా లేని స్థితికి చేరగలిగితే ఎంత బాగుణ్ణనిపిస్తుంది. అలాంటప్పుడు ఇంకొక కవి ఎలా గుర్తొస్తాడు. అతనితో మనం పోటీ పడాలన్న ఆలోచనకు చోటెక్కడుంది.

♦ *కవిత్వంలో మార్క్సిస్ట్ దృక్పథం గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

ఆకలిరాజ్యం సిన్మా చూశాకగానీ నేను మహా ప్రస్థానాన్ని చదవలేదు. అది చదివాక మాత్రం కవిత్వమంటే సామాజిక ప్రయోజనంకోసమే రాయాలి అనే నిశ్చయానికొచ్చేలా చేసింది. మార్క్సిజం చదివాక సమాజంలో జరుగుతున్న వర్గ దోపిడీ స్పష్టంగా అర్థమైంది. అనివార్యంగా మన అక్షరాన్ని శ్రామిక వర్గపు పక్షాన నిలబెట్టాలన్న స్పృహ మార్క్సిజం కలిగించింది.

♦ *దళిత వాదం ,స్త్రీ వాదం,మైనారిటీ వాదం లాంటి అస్తిత్వ వాదాలపై మీ అభిప్రాయమేమిటి?*

ఎవరి వేదనను వారు వ్యక్తం చేసుకునేటప్పుడు ఆ కవిత్వం సూటిగా పాఠకుడి హృదయాన్ని తాకుతుంది. అయితే ఇప్పుడు వస్తున్న వివిధ వాదాల కవిత్వాలను నిశితంగా పరిశీలిస్తే ఇందులో చాలా మంది వర్గ స్పృహ లేకుండా రాయడం వల్ల వారి కవిత్వాన్ని ఆయుధం చేయడంలో సఫలమైనా గురితప్పి దోపిడీ శక్తులను పట్టి చూపించడంలో విఫలమవుతున్నాయనిపిస్తోంది. ఇది కేవలం నా వ్యక్తిగత అభిప్రాయం

♦ *ముందు ముందు కవిత్వం లో మీ ప్రయాణం ఎలా ఉండబోతోంది?*

కవిత్వానికి పూర్తికాలపు సృజనకారునిగా నా ప్రయాణం మొదలుపెడతాను.

ఈ అవార్డును నాకు ప్రకటించిన ఎక్స్ రే సంస్థకు, దీనికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పెద్దలు నందిని సిధారెడ్డిగారికి , ఈ ఇంటర్వ్యూ ద్వారా నా భావాలను సాహితీ మిత్రులతో పంచుకునే అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు.

♦

# అక్షర అంగారకుడు

- రత్నాల బాలకృష్ణ,
9440143488

పొగచూరిన ఆకాశంలోంచి
సముద్రమంత ఆకుపచ్చని నేలకు
అక్షర కిరణాలను ప్రసరింపజేస్తూ
నింగికెగసిన అక్షర సూరీడా...
అద్దేపల్లి రామ్మోహనుడా...
కాలంతో ప్రవహించిన నిత్యయవ్వనుడవు నీవు
గోదావరి నీ ప్రతిబింబంగా చేసుకొని
తెలుగునేలను నలుచెరగులా
కవితా సుమాలు పుష్పింపజేసావు
యువకవులను వెన్నుతట్టి
పెన్నుపట్టి పోరాటపటిమనిచ్చి
ప్రగతిశీల సాహిత్యపు
కొవ్వొత్తికి వత్తిగా నిలిచావు
గోదావరికి అర్ఘ్యమిచ్చే
ప్రతిదోసిలి నీటిలో వీరేశాన్ని దర్శించి
ప్రవహించే మనిషికి
ప్రతిబింబం గోదావరని చాటావు
కామప్రకోపిత బహుళ జాతి భావజాలపు
మార్కెట్ మాయాజాలం
విసురుతున్న మాయాజాలరి వలకు
చిక్కుకుని విలవిలలాడుతున్న
ప్రపంచీకరణయుగంలో
మానవ సంస్కృతిపై మానని గాయాన్ని చేసి
ముక్కపచ్చలారని పిల్లలాడుతున్న
డాన్స్‌బేబిడాన్స్, ఫైర్ అంటూ చేస్తున్న వెకిలి చేష్టలను
అక్షర ఖడ్గాలతో ఖండఖండాలుగా ఖండించావు
ఆకాశంలో సగమైన వారిని
అరచేతిలోకి తీసుకొని
అర్ధనగ్న నృత్యాలు చేయించిన
ఆ డాలర్ సంస్కృతికి
సర్వసంస్కృతులు దాసోహం అంటుంటే
ఒక చేతిలో బుద్ధుడు - మరో చేతిలో బూతు బొమ్మలా
అని నిరశిస్తూ అక్షర ఆయుధాన్ని చేతబూని
పోరాటయోధునిగా నిలిచావు
సమాచార విప్లవమని
సమాచార మద్యం పోస్తూ
కాలిపోతున్న శరీరంలో కూడా



06.09.1936-14.01.2016


ఆడదాని అందాని ఎంతందంగా చూపించాలా అన్న
తాపత్రయపు యాంకరింగ్, జర్నలిజాన్ని
ఎండగట్టి ఆరేసి
సమకాలీన రుగ్మతలను
సిగపట్టి నిలదీసి ధీరుడిగా నిలిచావు
మనిషితనానికి, మానవత్వానికి
సంస్కృతికి, సంస్కారానికి
అనుక్షణం అండగా నిలిచావు
అమ్మ కడుపులో కూడా
పిడికిలి బిగించిన 'అ' అక్షరాన్ని
శిశువుగా భావించి
నిజమైన తెలుగు అక్షరాభిమానివి అనిపించుకున్నావు
అందుకే
తెలుగు అక్షరం ఉన్నంతకాలం
అద్దేపల్లీ!
నీవు అక్షర అంగారకుడివై నిలుస్తావు !

(అద్దేపల్లి రామమోహనరావు
వర్ధంతి 13-1-2018 సందర్భంగా)

నచ్చిన రచన

# భారతీయ ముస్లింల హృదయస్పందన

- డా. షేక్ ఇబ్రహీం
9533336227






ఆధునిక మహా కవి, కళాప్రపూర్ణ, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా నడిచిన నేలలో మొలకెత్తిన మరో అరుదైన సాహితీ మొక్కకవి కరీముల్లా. 72 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ముస్లింలు నేటికి అనుక్షణం ఎదుర్కొంటున్న నిందారోపణలు భరిస్తూ అభద్రతా భావంలోకి ఏ విధంగా నెట్టివేయబడి, అనుక్షణం మత వివక్షకు గురవుతూ కన్నీళ్లను, దుఃఖాన్ని, బాధను దిగమింగుకుని భారతీయ ముస్లింలు పడుతున్న మనోవేదనను "సాయిబు" అనే దీర్ఘ కవిత ద్వారా సాహిత్య లోకానికి, సమాజానికి తెలియజేసిన కవి కరీముల్లా.

గత 15 సంవత్సరాలుగా ముస్లిం జీవితాలను అక్షర రూపంలో జీవం పోస్తూ, ఇస్లాంవాద సాహిత్యానికి ఒక వారధి నిర్మించి నాటి నుండి నేటి వరకు వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి కవి కరీముల్లా. 2004లో తెలుగు సాహిత్యలోకానికి "సాయిబు" అనే దీర్ఘ కవితను ఇస్లాంవాద కవిత్వం పేరుతో అందించి ఒక అదనపు గౌరవాన్ని కలిగించారు. కాలానుగుణంగా మార్పులు ఏ విధంగా సహజంగా చోటుచేసుకుంటాయో ఆ విధంగానే సాహిత్యంలో కూడా మార్పులు చేర్పులు జరగాలి. బహుశా అందుకేనేమో అనతికాలంలోనే 2008లో 'ఈద్ ముబారక్' కవితా సంపుటి ద్వారా ఇస్లాంవాద కవిత్వం ప్రగతిశీల ముస్లిం కవిత్వంగా రూపుదాల్చడం జరిగింది. అయితే ఆధునిక తెలుగు సాహిత్యంలో తొలుత ముస్లిం జీవితాలను 1991లో ఖాదర్ మొహియుద్దీన్ "పుట్టుమచ్చ" దీర్ఘ కవిత ద్వారా భారతీయ ముస్లింల గుక్క పట్టిన మనోవేదనను కళ్ళకు కట్టినట్లుగా కవిత్వీకరించాడు.

కానీ కవి కరీముల్లా రచించిన 'సాయిబు' కవిత సుదీర్ఘమైన దీర్ఘ కవిత. ఈ 'సాయిబు' భారత ముస్లింల యదార్థ స్థితిని విభిన్న పార్శ్వాలలో వ్యక్తపరిచింది. ఈ కవిత మొత్తం పన్నెండు భాగాలుగా సాగింది. సాధారణంగా కవి ఒక కవితకు అక్షర రూపాన్ని ఇవ్వాలంటే ఎంతో ఒత్తిడికి గురవుతాడు. ఎందుకంటే కవితను మలచే టప్పుడు శీర్షిక, ఎత్తుగడ, ముగింపు, ఆద్యంతాల సమన్వయం, భావ ప్రకటనలు, భావచిత్రాలు మొదలైన శిల్ప నిర్మాణ పరమైన నియమాలు కూడా పాటించాల్సి వస్తుంది. ఇవన్నీ పాటించినప్పుడే కవితకు బలం చేకూరుతుంది. ఎంచుకున్న వస్తువుకు అనుగుణంగా కవితను మలిచే క్రమంలో ఆ వస్తువు ప్రాధాన్యం ఏమాత్రం తగ్గినా ఆ కవితను పాఠకుడు చదివేటప్పుడు వెలితిగా కనిపించవచ్చును. అదే కవి ఒక దీర్ఘ కవితను రాసే క్రమంలో ఎన్ని జాగ్రత్తలు పాటించాలి.

సాయిబు దీర్ఘ కవిత పన్నెండు భాగాలుగా నడిచినప్పటికీ, పాఠకుడికి 12 భాగాలు ఉన్నాయా అని ఆలోచన కూడా కలిగించదు. ఎందుకంటే ఒక భాగం పూర్తిగా పాఠకుడు చదవడం అవ్వగానే మరో భాగంలోకి పాఠకుడు తెలియకుండానే వెళ్ళిపోతాడు. ఇలా చదువుకుంటూ వెళ్లడానికి ప్రధాన కారణం ఇది వరకు చదివిన భాగంలోని పాదాలకు కొనసాగింపుగా ఉండడమే పాఠకునికి ఆ ఉత్సాహాన్ని కలగజేస్తుంది. ఈ కవిత తెలుగు సాహిత్యంలో ఓ కొత్త ఒరవడికి, కొత్త చర్చకు దారితీసింది. ఈ కవిత ప్రధాన లక్ష్యం ఇస్లాం పట్ల ప్రజలలో కలుగజేస్తున్న అపోహలను తొలగించి భారతీయ ముస్లింలను అభ్యున్నతి దిశగా ప్రయాణింప చేయడానికి తగిన ప్రేరణ కలిగించింది.

***నేనిప్పుడు/ నిర్బీక్షణ శిబిరంలో / నేలకేసి కొట్టుకుంటున్న పావురాయి రెక్కను/ కార్ఖానాల్లో కాగిన ఇరుసునై/ కాకా హెూటల్లో కిచిడి మెతుకునై/ స్టీరింగ్ నుండి/ మిషిన్ బేరింగ్ వరకు/ ఈ మట్టిలో ఆవిరైన రక్తాన్ని***

సాయిబు ఎత్తుగడలోని పాదాలు ఇవి. ఎత్తుగడలో సాధారణంగా కవులు ఒకే విషయాన్నో, సంఘటననో మలుస్తారు. కానీ కవి కరీముల్లా ఈ కవితలో సామాజిక వెనుకబాటు తనాన్ని, అస్తిత్వాన్ని తెలియజేస్తున్నాడు. భారత ముస్లింల పురోగమనానికి, అభివృద్ధికి ప్రధానంగాసామాజిక వెనుకబాటుతనం అభద్రతా భావన ఆటంకంగా నిలుస్తున్నాయి. ఒకటి వారి సామాజిక వెనుకబాటుతనం వలన ప్రస్తుత ముస్లిం సమాజం వివిధ చేతివృత్తులు చేసుకుంటూ ఎలా పొట్టనింపుకుంటున్నదో, బతకడానికి కాలంతో ఎలా పోరాటం చేస్తుందో తెలియపరిచింది. దారిద్ర్య రేఖకు దిగువగా ముస్లిం జీవితాలు ఎలా తల్లడిల్లుతున్నాయో స్పష్టంగా తెలుస్తుంది. రెండవ అంశం ముస్లింలను మెజారిటీ పరులు అభద్రతా వాతావరణంలోకి నెట్టేసి ముస్లింల అస్తిత్వాన్ని పరిహాసిస్తున్నారు. అస్తిత్వ పరివేదన అత్యంత కీలకమైంది. అయితే అస్తిత్వ పరిరక్షణ రాజకీయ పోరాటం తో ముడిపడి ఉందని కవి చాటాడు. ఈ బూటకపు ప్రచారాన్ని తిప్పికొట్టడానికి, సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి యావత్తు భారత ముస్లిం సమాజం ఒక తాటి పైకి రావాలని ఈ కవిత ఎత్తుగడలోని పాదాలు తెలియజేస్తున్నాయి. ముస్లింల చుట్టూ అల్లుకున్న సామాజిక వెనుకబాటుతనం ఇప్పట్లో నశించేది కాదని, వారి వెలివెతలు, ముల్లాల ఆంక్షలు ఎప్పటికి చెరిగిపోతాయోనని, వారి జీవితాల్లో వెలుగు జీవితం ఎప్పుడు వస్తుందో అని కవి ఆందోళన ఈ కవిత ఎత్తుగడలో గమనించగలం.

***బూచోడు దొరతనం రాబందు రెక్కయి/ ఈ గడ్డను చెరపట్టినపుడు/ జాతి నవనాడుల్నీ / నలి నుజ్జు చేస్తున్నపుడు/ ఉప్పెనై ఎగిసిన సమర ఖడ్గాన్ని /మృత్యువును ముద్దాడిన / నాటి అష్ఫాకుల్లా ఖాన్ వారసుడ్ని/ నా ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకమైంది /నా శ్వాసిక్కడ* countdown *లెక్కిస్తుంది/ నన్ను తురుకోడంటుంది.***

నేను టర్కీ నుంచి దిగలేదు. నాలో అసలు తుర్కిస్తాన్ మూలాలు లేవు. గడ్డం పెంచి జుబ్బా ధరిస్తే సాయిబునవుతాను. తురకోడు అని ఎందుకు బిరుదునిస్తున్నావు అని కవి ఆవేదనతో చెప్పిన వాక్యాలివి. ఏ దేశంలోనైనా సరే పరదేశీయులు దాదాపు ఐదు సంవత్సరాలు నివాసం ఉంటే అక్కడ వారికి ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. ఈ మట్టిలో పుట్టి, ఈ మట్టిలో పెరిగి, ఈ మట్టితో మమేకమై, ఈ మట్టిలో మట్టిగా తరతరాలుగా ముస్లింల అస్తిత్వం పైన వేసుకొని ఉంది. ఈ మట్టితో ముస్లింలకు ఉన్న గాడ బంధాన్ని చూసి ఓర్వలేక పోయిన కొందరు మెజారిటీ వాదులు ముస్లింల ఉనికిని గూర్చి చేసే దుష్ప్రచారాన్ని కవి సహేతుకంగా ఖండిస్తున్నాడు. ఈ మట్టిలో పుట్టి ఈ మట్టిలో కలిసే ప్రతి మనిషి భారతీయుడే. ప్రతి భారత ముస్లిం ఈ మట్టికణాల్లో కణమైనోళ్లు అని కవి తన గొంతుకను చాటాడు. భారతదేశంలో రాజ్య పరిపాలన చేసిన హునుల్ని హునులు అనడం లేదు. కుషాణుల్ని కుషాణులు అని అనడం లేదు. ఆర్యుల్ని ఆర్యులు అని అనడం లేదు. అసలు తురుష్కుడి మూలాలు, లక్షణాలు మాలో లేకపోయినా కూడా భారతీయ ముస్లింలను తురక అనే ముద్రలు వేయడం ఎంతవరకు సమంజసమని కవి ప్రకటించిన విధానం సమంజసనీయయమైంది.

***ఈ జమీన్ జమీనంతా/ బ్రిటిషోడి రాక్షస రతికి గురైనపుడు/ ప్రాణాల్ని పేలాలుగా పర్చిందెవరు?/ తెల్లోడి తూటాకు బేంబేలెత్తినోళ్లంతా/ టిప్పు ఖడ్గానికి మసి పూస్తుంటే /సామరస్యాన్ని పంచే సమాధులూ/ కంకర రోడ్లు వేస్తుంటే/ సారే జహా సే అచ్ఛా రాసిన మా కలాలే/ నిప్పులు కురిపిస్తాయని తెల్సుకోండి***

దక్షిణ భారత నెపోలియన్‌గా ఖ్యాతి గడించిన హైదర్ ఆలీ ఈస్టిండియా పాలకులతో అనేకమార్లు దండయాత్రలు చేసి శత్రు సైన్యాల ఎముకల్లో చలి పుట్టించిన యుద్ధవీరుడు, పరిపాలకుడు. హైదర్ ఆలీ కొడుకు టిప్పు సుల్తాన్. టిప్పు సుల్తాన్ మైసూరు పులిగా ఖ్యాతి గడించాడు. టిప్పు సుల్తాన్

ప్రజల ఇష్టానుసారంగా పరిపాలించి కంపెనీ పాలకుల దాడులను తిప్పి కొట్టాడు. రాజ్యంలో సర్వ మానవతా అభివృద్ధి సాధించాడు. అఖండ డిస్కవరీల వారసత్వాన్ని కలిగిన సారే జహాసే అచ్ఛా అని నినదించే ఈ దేశ అసలుసిసలు మూలవాసులైన ముస్లింలను ఎలా విడిచిపొమ్మంటారని కవి ఆవేశాన్ని ప్రదర్శిస్తాడు. ఆనాడు దేశం కోసం, ప్రజల కోసం దేశ విముక్తి కోసం వారు యుద్ధాన్ని ప్రకటించారని కవితాత్మకంగా వ్యక్తీకరిస్తాడు.

గోద్రా సంఘటనలో హిందూ-ముస్లిం సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే దర్గాలను నేలమట్టం చేసి తారురోడ్డు వేయడాన్ని కూడా ఈ కవితలో కవి ఖండిస్తాడు...

*నాది కాని స్వరాన్ని/ అరువు తెచ్చుకున్నోడ్ని/ తెలుగు ముస్లింల గుండెల్లో /ఉర్దూ మేకుల్ని దిగ్గొట్టినోడ్ని/ తోకల్లేని ఇస్లాంకు/ రంగురంగుల ఈకల్ని మొలిపించినోడ్ని/ ఆ ఉర్దూ సాయిబును/ నేనే....*

ఇస్లాం మతం లో కులాలు గాని, వర్గాలు గాని, జాతులు గాని ఉండవు. అందరూ కలిసికట్టుగా మహ్మదీయులుగా జీవించాల్సిందే . అన్నపానాదుల దగ్గర కానీ ప్రార్థనాలయాల్లో గానీ ఏ తారతమ్యాలు పాటించకుండా అంతా సమానంగా మెలగాలని బోధించడం ఇస్లాం మత గొప్ప లక్షణం. కానీ ఇది భారతీయ ముస్లింలలో ఆచరణలో కనిపించక పోవడం బాధాకరం. నిజానికి ముస్లిం లోని భాగమైన దూదేకుల వారిని అవమానించడం చులకనగా చూడడం చాలా చోట్ల నేటికీ జరుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల, కొన్ని ప్రాంతాలలో అక్కడక్కడ నేటికి సగంసాయిబు అని, సగం తెలుగోడు అని ఇరు మతాల పోకడలు కూడా దూదేకుల జీవితాన్ని అపహాస్యం చేస్తున్నాయని కవి చెప్పిన విధానం గమనించదగినది.

గతంలో రాజుల కావొచ్చు, నాటి నుండి నేటి వరకు పాలకుల పాలన కావొచ్చు వారు ఏ మతాన్ని అధికార మతంగా ప్రకటిస్తున్నారో ఆ మతం మిగతా మతాలను మింగేస్తున్నది. జైనం,బౌద్ధం, శైవం, వైష్ణవం, ఇస్లాం ఏ మతమైనా కావచ్చు. కానీ నేడు మతాన్ని పిచ్చిగా ఆరాధించి మూర్ఖపు భావజాలాలను పెను వేసుకున్న మతతత్వ వాదుల వలన సమాజానికి చాలా ప్రమాదకరం. ఎందుకంటే మతాన్ని పిచ్చిగా ఆరాధించడం వలన తమ మతమే గొప్పదనే భావన రాకతప్పదు. అప్పుడు మతాన్ని సాకుగా చూపెట్టి సమాజాన్ని చీల్చుతూ ప్రజల మధ్య అభద్రత భావనను, వైరుధ్యాలను పెంచుతారు. ప్రాక్టికల్‌గా చెప్పాలంటే ఎవరైతే తమ మతాన్ని మతంగా అభిమానిస్తారో వారే నిజమైన మత విశ్వాసి. అటువంటి వారే మిగతా మతాలను గౌరవిస్తారు. తన మతాన్ని ప్రేమిస్తారు. ఏ మతమైన శాంతినే బోధించింది. ప్రేమనే పంచింది. సాటి మనిషిని మనిషిగా చూడమని చెప్పింది. కానీ మనుషులు ఈ వర్తమాన కాలంలో కూడా మతాల పేరుతో ఒకర్ని ఒకరు చంపుకుంటున్నారు. 1992, 2002లో జరిగిన మత ఘర్షణల్లో అమాయకులైన వేలాది ముస్లింల ప్రాణాలు రక్తపుటేరుల్లో కలిసిపోయాయి. ఈ సంఘటనలను కవి సాయిబు కవితలో ఒక చోటా

*ఏకతే వాడి నినాదం/ మా ముఖాలపై విదేశీ ముద్రలు పొడిచి/ గొంతులు నొక్కేందుకు/ రక్తసిక్తమైన పాదాల్ని/ పెట్రోల్ సీసాలై తరిమేందుకు/ అన్నదమ్ముల్లాంటి హిందూ-ముస్లిలను/ శత్రు శిబిరాలుగా మలిచేందుకు/ వాడు ఏకంగానే ఉంటాడు/ అవును ఏకతే వాడి నినాదం*

ఇలా కవిత్వీకరించాడు. ఈ సువిశాల భూప్రపంచంలో కొన్ని లక్షల జీవ జాతులు ఉన్నాయి. ఏ జీవజాతికి లేని మేధోసంపత్తి ఒక మానవ జాతికి మాత్రమే ఉన్నది. అంత విజ్ఞానం ఉన్న మనుషులు కూడా కులాలు, మతాలు అని విభేదాలు సృష్టించుకొని, కలహించుకొని విడిపోతున్నారు. ఇలా ఉంటే మానవ జాతి ఎప్పటికీ ఒక జాతి కాజాలదు. ప్రపంచంలో ఏ దేశానికి లేని ప్రత్యేకత, గొప్పదనం మన దేశానికి మాత్రమే ఉంది. దాని పేరే లౌకికత. బిన్న కులాలు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న ప్రాంతాలతో సమ్మిళితమైన అందమైన రంగుల తోట మన దేశం. స్వార్థ రాజకీయాలతో మనిషి ఇలా విభేదించుకొని, కలహించుకుని మనిషిని మనిషి దూరం చేసుకుంటూ పోతే ఎప్పటికీ మన జాతీయత ఒకటి కలదు. ఒకప్పుడు మన తాతల నాటి కాలంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ మామయ్య బాబాయ్ అని కుటుంబ వలసలతో మనుషుల్ని దగ్గర చేసే ఆత్మీయతో పలకరించుకునే వారు. కానీ నేడు ఈ ఆత్మీయ పలుకులు మంటగలుస్తున్నాయి. మన దేశ ఐడెంటిటీ కూడా మంటగలుస్తున్నదని కవి పూర్వవైభవం కోసం, ప్రపంచానికి మనదేశ లౌకికతను తిరిగి చాటిచెప్పేందుకు పడుతున్న తపన మెచ్చుకోదగింది.

*"ఒక అదృశ్య పీడన /చెంపల్ని కొరుకుతుంటే / వరద ముంపుకు గురైనా/ కోత మైదానంలా /నిట్టనిలువునా చీలాను/ బుల్లి తెర నుండి 70 MMవరకూ / సాయిబులపై సంధించే శస్త్రాలే /పలకరింతలు వెక్కిరింతలు/ అగడ్తలు లేపనాలు / అంతరంగ పొరలమాటు విషాన్ని బిగించి /పెదాలపై పారాడే ప్లాస్టిక్ నవ్వులు /తెర లేస్తే చాలు/దృశ్యాలు విషాణువులై /*

*గాయాలపై వాల్తాయి"*

దాదాపుగా భారతీయ ముస్లింలు ఏ ప్రాంతంలో అయితే బతుకుదెరువు కొనసాగిస్తుంటే ఆ ప్రాంతంలో వారు ఇంట్లో మాతృభాష మాట్లాడుకుంటే, బయట ఆ ప్రాంత భాషను మాట్లాడుకుంటారు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇంట్లో ఉర్దూ మాట్లాడితే బయట తెలుగు మాట్లాడుతారు. అలా మాట్లాడే సమయాల్లో వారిని అలా చూస్తూ నవ్వడం పరిపాటిగా చూస్తుంటాం. మనిషిని బాగా ప్రభావితం చేసే సాధనాలలో సినిమా రంగం, మీడియా రంగం ప్రముఖమైన పాత్రను వహిస్తాయి. సినిమాల్లో కావచ్చు, మీడియాలో కావచ్చు అప్పుడప్పుడు ముస్లింల గురించి లేనివి ఉన్నట్లుగా కథకు అనుకూలంగా మార్చి చూపించినప్పుడు ఎంతోమంది ముస్లింల మనసులు గాయపడి మూగబోతున్నాయి. ఆ సినిమాను చూసిన ముస్లిమేతరులు కావచ్చు, నిరక్షరాస్యులు కావచ్చు వాళ్లకి ఆ సినిమాలు మీడియాలు ఏవిధంగా రిజిస్టర్ అవుతుందనేది అంతుచిక్కని ప్రశ్న. భారతదేశంలో వెనుకబడిన వర్గాల్లో ముస్లిం సామాజిక వర్గం రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, వైద్య పరంగా వెనుకబడి వున్నదని సచార్ నివేదికలు తెలిపాయి. ఈ ముస్లిం సామాజిక వర్గం మిగతా వర్గాల అన్నిటి కంటే వెనుకబడి ఉన్నది అని కూడా తెలియజేసింది. వారి బాధలను, కన్నీళ్లను, సమస్యలను చూపించాలి గానీ, చరిత్రను వక్రీకరిస్తూ వారి జీవితాన్ని అపహాస్యం చేసే విధంగా తీస్తే ఎంత వరకు సమంజసమని కవిలో దాగిన మనోవేదనను చెప్పిన విధానం ప్రశంసించదగింది.

*"గ్లోబల్ బుసల్లో /మన ఫుట్పాత్ బతుకులు /అర్థికలై కొట్టుకుపోయాయి /మన కుట్టుమిషిన్ చక్రాలు /ఆకలి తీరంలో మునిగాయి"*

పారిశ్రామిక విప్లవం తర్వాత వచ్చిన చిన్న చిన్న చేతివృత్తులు ముస్లింల బతుకుదెరువుకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఎప్పుడైతే ప్రపంచీకరణ ప్రభావం దేశంలోకి చొరబడిందో అప్పుడు దేశంలో అనేక మందికి ఆధారమైన చేతివృత్తులమీద, చిన్న చిన్న షాపుల మీద, చిన్న చిన్న వ్యాపారాల మీద కోలుకోలేని బలమైన దెబ్బ పడింది. ఈ దెబ్బతో చేతివృత్తులు మాయమై షాపులు మూతబడి ముస్లింల ఆర్థిక జీవన విధానం చిన్నాభిన్నమైంది. దీనివలన బతుకు జీవనాన్ని కోల్పోయిన ముస్లింలు నిరుపేదలుగా మారారు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్స్ వచ్చిన తర్వాత చిరువ్యాపారులు వృత్తిని కోల్పోయి రోడ్డున పడ్డారు. రోడ్ల విస్తరణ వల్ల ఫుట్ పాత్‌లపై పండ్లు అమ్ముకునేవారు కూలీలుగా మారారు. రెడీమేడ్ దుస్తులు రావడం వల్ల కుట్టుమిషన్లు కూడా మూతపడ్డాయని కవి తెలియపరిచాడు.

*హంతక ఐఎస్ఐ ముఠా/ ఉన్మాద క్రీడ షరా మామూలైంది/ మతం వాసనెరుగని చిగురాకులు/ పండుటాకుల్లా రాలాయి/ అక్షరధామ్ అశ్రువుల్ని వర్షించింది /నిన్న పార్లమెంట్ /నేడు అక్షరధామ్ /రేపు మరేదో / నయవంచక పాక్ పాలకుల్లారా/ అల్లాహ్ మిమ్మల్ని క్షమించడు*

ఇస్లాం అంటే శాంతికి ప్రతిరూపమనీ, ఇస్లాం అంటే ప్రేమకు నిలయమని, ఇస్లాం అంటే ధర్మానికి ప్రతీకని, ఇస్లాం అంటే బడుగు బలహీన వర్గాల్లో దాగిన పీడనల్ని, దౌర్జన్యాలను చెరిపేసే వెలుగని కవి చాటుతున్నాడు. వ్యవస్థలో ఎవరైనా తప్పు చేస్తే వ్యక్తిని మాత్రమే తప్పుపట్టాలి గానీ, పూర్తిగా వ్యవస్థను కాదు. పంట పండించే టప్పుడు చిన్న చిన్న కలుపుమొక్కలు వచ్చినప్పుడు వాటిని ఏకిపారేస్తాం తప్ప, మొత్తం పంటను ఏకిపారేయం కదా.! తప్పు చేసిన వ్యక్తి తన మతస్థుడా వేరే మతస్థుడా అని ఆలోచించి నిర్ణయం తీసుకోరాదు. ఒక మనిషిగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. వారు ఎవరైనా సరే తప్పు చేసినా తప్పు తప్పే. కవి తన స్వమతస్థుడైనా సరే చేసిన తప్పును ఖండించడమే కాకుండా అక్షర రూపంలో కూడా కవిత్వీకరించడం కవి యొక్క నిబద్ధతకు ప్రతిరూపమని చెప్పవచ్చు.

ముస్లిం జీవితాలకు సంబంధించి 'సాయిబు' కవితలో విశ్లేషించిన విధానం మెచ్చుకోదగింది. ఈ సాయిబు దీర్ఘ కవిత ఇప్పుడు ఇంగ్లీషు భాషలోను అనువాదమైంది.

*"నా ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకమైంది/ నా శ్వాస ఇక్కడ* **countdown** *లెక్కిస్తుంది"*

అని ఒకానొక చోట కవి కరీముల్లా చెప్పిన ఈ రెండు మాటలు మొత్తంగా భారతదేశంలోని 20 కోట్ల ముస్లింల దీన స్థితిని తెలియజేస్తుంది. ఈ సాయిబు కవిత ముస్లిం సామాజికవర్గానికి చెందినదే అయినా దాని వెనుక ముస్లింల అసహనం, మెజార్టీవర్గంలోని కొందరు వారిపైచూపే వివక్ష, అసమానతల్ని సమాజంలోని ఇతర వర్గాలు కూడా గమనించాల్సిన అవసరాన్ని కవి చెప్పకనే చెప్పాడు. కరీముల్లా కేవలం ఒక ముస్లిం కవి మాత్రమే కాదు. సమాజంలో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే వాటిపై ప్రతిస్పందించడమే గాక, వాటికి అక్షర రూపమిచ్చి సమాజంలోని రుగ్మతలు చెరిపేయాలని తపనపడే కవికరిముల్లా. ♦

## ముసిరిన చీకటి

- గరికిపాటి మాష్టారు
8897672733



తడబడుతున్న నా అడుగులు తప్పతాగే కాదు
గుండెపోటుతోనూ కాదు
హృదయంలో మొలకెత్తి మెదడులోకి
విస్తరిస్తున్న మహోద్వేగ భూకంపం
అదే దేశవ్యాప్తంగా ముసిరిన అవినీతి చీకటిని
చూసి
అనునిత్యం అగ్నిగుండం ఒకటి వెలుగుతూంటే
కురవని మేఘాల్ని సృష్టిస్తుంది
అగ్ని మాత్రం ఆరదు
ఆగర్భ శత్రుత్వం ఆగదు
ఇదివరకు దీపం ఆర్పి ప్రమాణం చేసేవారు
ఇప్పుడు ప్రమాణంచేసి మరీ
దీపాలార్పుతున్నారు
పగటి వేష పర్యటనలకు రాలిపడిన
ప్రజాభిమానమెంత?
గౌరవ, శాంతి, సద్భావన, ఓదార్పు,
సస్యశ్యామల, రథయాత్రల్లో
పోగైన సానుభూతి ఎంత?
సమయమంతా సమీకరణలతోనే సరి
అంకానికో ఏడాది అయిదంకాల నాటకాన్ని
ఎలా రక్తి కట్టించాలన్నదే అసలు సమస్య
ఎటొచ్చీ నిర్మాణ సూత్రాల గురించి ఎవరూ ఘోషించుకోరు
ఎలాగైతేనే వేదిక నెక్కడం వేషం కట్టడమే ఏకైక లక్ష్యం
పునాదుల్ని లోతుగానే తవ్వుకుంటాం
పిల్లర్లను పటిష్టంగానే నిర్మించుకుంటాం
పూర్తి అయిన నిర్మాణాలు ఆకాశానికి నిచ్చెనల్ని వేస్తాయ్
కంప్యూటర్లు రెక్కలు కట్టుకొని డాలర్ల ముంగిట వాల్తాయ్
ఇక్కడ కమ్మిన మేఘం విదేశాల్లో వర్షిస్తూంది
జన్మభూమి మాత్రం ఎడారి నోటిలో ఆవలిస్తుంది ♦

## నా కలల్ని ఎవరో తగులబెట్టారు

- మహబూబ్ బాషా చిల్లె
9502000415



ప్రకృతిలోకి పరకాయ ప్రవేశం
చేద్దాం అని ఎప్పటిలాగే  అక్కడికి వెళ్ళా
ఇప్పుడు అక్కడ పక్షుల కువ కువలకు బదులు
కసాయి వేటగాడి అరుపులు వినిపిస్తున్నాయి

చెంగు చెంగున ఎగరాల్సిన లేడి పిల్లలకు బదులు
వాటి రక్తాన్ని జుర్రు కుంటున్న వేట కుక్కలు
కనిపిస్తున్నాయి

నిత్యం అక్కడ నా కోసం  గొంతు సవరించుకొనే
కోయిల కూని రాగాలకు బదులు
ఆకాశ గద్దల అరుపులు వినిపిస్తున్నాయి

సకల ప్రాణుల సాన్నిహిత్యంతో చెట్టా పట్టాలేసిన
భూమాత బోరుమని విలపిస్తోంది

ఆ కన్నీటికి ఎన్నో జ్ఞాపకాల పాదముద్రల గుర్తులు
నెమ్మదిగా కరిగి పోతున్నాయి

అక్కడ ఇంతకు ముందు నే చూసిన పచ్చదనపు
ప్రమిదలు ఏవీ లేవక్కడ
ఓ మృగమనిషి  ఆడిన ఆటలకు అగ్ని కీలలు
ఎగిసి పడుతూనే ఉన్నాయి అక్కడ

నా కలల్ని ఎవరో తగలబెట్టి
మళ్లీ  వాళ్ళు ఆది మానవుల కాలంలోకి
వలస వెళ్లారు ...... ♦



# ఓ... పలకరింపు

**శ్రీహర్ష**

**ప**ది సంవత్సరాల క్రిందట...

పనిచేసిన సివిల్ సప్లయ్స్ ఆఫీసులోకే... ప్రమోషను తీసుకుని... మరోసారి అడుగుపెట్టా... తెలిసిన ఆఫీసు కదా! తెలిసిన వర్కే కదా! అన్న ధైర్యంతో. అయితే, స్టాఫ్ అందరూ కొత్తవాళ్ళు.

కేడర్ని బట్టి, ప్రస్తుతం ఉన్న సీటు కోర్టు కేసులకు సంబంధించినది. కాస్త కష్టంగానే ఉన్నా, భరించుకోక తప్పదు. అవ్వా కావాలి.. బువ్వా కావాలి అంటే, ఎలా కుదురుతుంది. ఇన్నాళ్ళూ లోయర్ కేడర్లో ఈజీ సబ్జెక్టులే చేశాను.

మనసులో బెరుకుని బయటకు కనిపించకుండా జాగ్రత్త పడుతున్నాను.

ఇప్పుడు ఉన్న ఆఫీసరుగారు చాలా ఫాస్టు. సబ్జెక్టు అంతా ఫింగర్ టిప్స్ మీదే ఉంటుంది. హెడ్ ఆఫీసు నుంచి ఏదైనా మెయిల్ వస్తే, నిముషాల మీద రిప్లై వెళ్లిపోవాలంటారు. అక్కడే వస్తుంది కష్టం. ఎంత సర్వీసు చేసినా... సబ్జెక్టు కొత్త కావడంతో కత్తి మీద సాములా... రోజుకో గండం గడచినట్లుగా ఉంటుంది.

ఇలాంటి నేపథ్యంలో...

అనుకోకుండా... ఓ రోజు ఆఫీసులో 'రఘునందన' కనిపించాడు.

చూసి చాలా రోజులైందేమో, అతడు కనిపించగానే... అప్పటి సంఘటన కళ్ళ ముందు కదిలి, ముఖం జేవురించి, చాలా అసౌకర్యంగా... ఊపిరి ఆడనట్లుగా తయారయ్యింది.

ఏం పనో ఇక్కడ? తెలియని వాళ్ళు లేరు డిపార్టుమెంటులో, తెలియని ఆఫీసు లేదు. షర్టు టక్ చేసుకుని... అప్పటిలానే ఉన్నాడు. ఏమీ లేదు.

నన్ను చూసీ, చూడనట్లే ముందుకు వెళ్ళిపోయాడు.

ప్రస్తుతం నేను ప్రమోషనులో ఉన్నట్లు తెలిసే ఉంటుంది.

మాటలని బట్టి, తెలిసింది ఏమిటంటే,... నేను ఇక్కడికి రావడానికి ముందు అతను ఈ ఆఫీసులోనే పని చేసాడని, వారం రోజుల తేడాలో... ట్రాన్స్ఫర్ మీద రాజమండ్రి వెళ్ళిపోయాడని.

ఎస్టాబ్లిష్మెంటు సీటు దగ్గరకు వెళ్లి ఆ క్లర్కుతో... ఏదో మాట్లాడాడు. ఆమె ఏదో అంటే 'అలాగే' అంటూ వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు.

మరోసారి అయితే,

రఘునందన వచ్చాడంటే... సందడే సందడి. ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి పలుకరిస్తారు.

అందరినీ పొగడ్తలతో ముంచెత్తి.. అందరితో స్నేహం కలుపుకుంటాడు. అలా అక్కడి వాతావరణం కబుర్లతో సరదాగా మారిపోయేది.

పెద్ద ఫ్రెండ్స్ సర్కిలు.

అలాంటిది.. ఈసారి మాత్రం ఎవ్వరితోనూ అంత టచెస్ పెట్టుకోకుండా, వంచిన తల ఎత్తకుండా.. సైలెంటుగా వెళ్ళిపోవడానికి కారణం 'నేను.. అక్కడ ఉండ బట్టే' అని అనిపించింది.

ఒకప్పుడు..

అంటే, దాదాపుగా అయిదేళ్ళ కిందట..

ఇద్దరం... ఒకే ఆఫీసులో కలిసి పని చేసాం. ప్రమోషనుకి ప్రపోజల్సు కూడా ఒక్క కవరింగ్ లెటర్లోనే పంపించాం. ఆ రోజు తీసిన ప్రమోషను లిస్టులో నా పేరు తరువాత మరో రెండు పేర్ల వెనుక అతని పేరు కూడా ఉంది. అంటే, సీరియల్ ప్రకారం నా తరువాతే, అతనికి ప్రమోషను రావాలి.

ఎడ్మినిస్ట్రేషను రూల్స్ ప్రకారం.. ప్రమోషనుకి అన్ని అర్హతలూ నేను సాధించానని అనుకున్నా! ఓ చిన్న మెలిక ఉండిపోయింది. లిస్టులో నా పేరు చేర్చేటప్పుడు అయినా... హెడ్ ఆఫీసు వాళ్ళు కాస్త జాగ్రత్తగా పరిశీలించి ఉంటే, నాకు అంత మనస్తాపం ఉండేది కాదు.

ప్రమోషను ఇచ్చేవాళ్ళలా 'నాలుగు నెలలు' ఊరించారు.

అప్పటివరకూ పూర్తిచేసిన సర్వీసులో...'ఓ నెల రోజుల' రెగ్యులర్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ కోర్సు అనారోగ్య కారణాల వల్ల పూర్తి చెయ్యలేకపోయాను. శెలవు పెట్టిన కారణంగా వేరే స్టేషనుకి ట్రాన్ఫ్ఫర్ అయిపోవడంతో అది అలాగే ఉండిపోయి... సమస్యని తెచ్చిపెట్టింది.

ప్రపోజల్సు పంపుకునే సమయంలో నేను పెద్దాపురంలో..

పుష్కర ఎత్తిపోతల పథకంలో పనిచేసాను. అది స్పెషల్ యూనిట్టు. ఆ సర్వీసు ఎంత చేసినా ప్రమోషనులో ఆరు నెలలు మాత్రమే లెక్కకి తీసుకుంటారు.

'ఆ నెల రోజుల పీరియడ్' పూర్తి చెయ్యడం కోసం నేను మళ్ళీ... పేరెంట్ డిపార్టుమెంటుకి వెళ్లిపోవాలి. అంటే, ఇంకో మండలానికి ట్రాన్స్ఫర్ పెట్టుకుని వెళ్లి.. తక్కువ అయిన పీరియడ్ని..'అక్కడ' పూర్తి చెయ్యాలి.

నా అంతట నేను ఉన్న చోటు కదుపుకుంటే, ఎక్కడికి వేస్తారో తెలియదు. ఈ స్టేషను అయితే, ఇంటికి కాస్త దగ్గరగా ఉంది.

అదీకాక, అనునిత్యం... చెయ్యి నొప్పితో బాధపడే నేను... ట్రాన్స్ఫర్లకి భయపడ్డాను.

ఇక్కడ అయితే, కష్టం లేకుండా జీతం వస్తుంది. ఈ రోజు ఇలా గడిస్తే.. 'చాలు' అనుకుంటూ అక్కడే ఉండిపోవడంతో.. తక్కువ అయిన నెల రోజుల.. పీరియడ్ తక్కువగానే లెక్క తేలింది.

నా ప్రపోజల్సులో..అవి అన్నీ, పై ఆఫీసుకి తెలియచేసినప్పటికీ...

చివరగా 'సర్వే మెయిన్టినేన్సు టెస్ట్' అనే డిపార్టుమెంటల్ టెస్టు... పాస్ అయి ఉండడంతో... నా పేరు కూడా ప్రమోషను లిస్టులోకి తీసుకున్నారు.

ఆ పరీక్షా హెడ్ ఆఫీసు పర్మిషనుతో వ్రాసిందే.

ఉద్యోగంలో చేరిన ఇరవై ఆరేళ్ళకి.. డిప్యూటీ తహసిల్దార్, ప్రమోషనుకి చేరువౌవుతున్నానన్న సంతోషంలో ఉండగానే... ఆశనిపాతంలా ... లిస్టులోని నా పేరుపై అభ్యంతరాలు వచ్చాయి. ఆమెకు 'రెవిన్యూ ఇన్స్పెక్టర్ కోర్సు పూర్తి కాకుండానే ఎలా ప్రమోషను ఇస్తారంటూ!'

దాంతో, నా పేరు లిస్టు నుండి డిఫర్ చేసి... ఖాళీలను బట్టి, పదిహేనుమందికి ప్రమోషన్లు ఇచ్చేరు.

నాపై అభ్యంతరాలు ఇచ్చిన వాళ్ళు ఎవరో కూడా నాకు తెలీదు. నన్ను అందరూ గుర్తు పెట్టుకున్నా... నాకు ఎవ్వరూ తెలీదు. చాలా ఆలస్యంగా తెలిసిన విషయం ఏమిటంటే..

కథ నడిపిన సూత్రధారి.. 'రఘునందనే' అని.

అభ్యంతరాలు తెలిపిన వారందరూ రాజమండ్రికి చెందినవాళ్ళే.

అదే సమయంలో అతని ఇంట్లో గృహప్రవేశానికి నన్ను పిలవలేదు. ఆ సంగతి వేరే వాళ్ళు అంటే గాని నాకు తెలీలేదు.

స్టాఫ్ అందరికీ ఒకటే కార్డు ఇస్తారు కాబట్టి, అదే, ఇది అనుకున్నా.

గత కొద్ది రోజులుగా అతనెందుకు 'నేనంటే' తప్పుకు తిరుగుతున్నాడో అప్పుడర్థమైంది.

నమ్మకంగా ఉంటూ వెన్నుపోటు పొడిచాడు.

అలా... పరుగు పందెంలో నాకన్నా అయిదేళ్ళు ముందుకెళ్ళిపోయాడు.

నా పని మళ్ళీ.. మొదటికి రావడంతో.. అవాంతరాలు

తొలగించుకుని ప్రమోషను పొందడానికి ఇంతకాలం పట్టింది.

ఆ తరువాత మళ్ళీ ఇప్పుడే రఘునందనని చూడడం.

◆◆◆

అతను అలా రెండుసార్లు వచ్చి వెళ్ళినా పరిస్థితి స్తబ్దుగానే ఉంది. అతను ఉన్నంత సేపూ ఏదో తెలియని అనిశ్చితి. చేసేపని బుర్రకెక్కేది కాదు.

నమ్మకద్రోహం చేసిన వాడిని ఎదురెళ్ళి పలకరించాల్సిన అవసరం నాకు లేదు. మౌనంగా ఉండిపోయా. ఆఫీసు అన్న తరువాత ఎవరెవరో వచ్చిపోతుంటారు. అలాగే, ఇతను.

ఆ రోజు...

అలాగే... నా పని మీద దృష్టి సారించి, కీ బోర్డు మీద టైపు చేసుకుంటుంటే,.

ఎవరో ప్రక్కనే నిలబడి "బాగున్నారా!... మేడం" అంటూ పలకరించడంతో.. చేస్తున్న పని ఆపి, 'ఎవరా' అన్నట్లు, అటు చూసాను.

ఎదురుగా... రఘునందన.

ఒక్క క్షణం... నా కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

అతడు అలా పలకరిస్తాడని అనుకోలేదు. ఎప్పటిలానే.. చూడనట్లు... వెళ్ళిపోతాడని అనుకున్నా.

అతని కళ్ళలో లీలగా అపరాధభావన, ముఖం చెల్లనట్లు.. ఏదో గిల్టీకాన్షస్. నేను మాట్లాడతానా లేదా అన్న సంశయం... సందిగ్ధత. అన్నీ కలగాపులగంగా కనిపించాయి.

ఒక్క నిముషం నాలోనూ తటపటాయింపు.

నా కుర్చీకి అంత చేరువగా వచ్చి పలకరిస్తే, నేను మాత్రం ఏమని ముఖం తిప్పుకోను?

అలా తిప్పుకుంటే, పని కట్టుకుని.. పలకరించిన వాడు ఊరికేనే, వెళతాడా! ఏదో బాధపడతాడు. దానికి చుట్టుప్రక్కల వాళ్ళు 'జరిగిందేదో జరిగిపోయింది..ఎన్నాళ్ళని గుర్తు పెట్టుకుంటారు' అంటూ రియలైజు అయిన అతన్నే సమర్ధిస్తారు.

నా మనసుని బయటపడనివ్వదలచుకోలేదు.

వెంటనే, తమాయించుకుని "ఆ బాగున్నాను" చెప్పాను తప్పనిసరై.

"ఎప్పుడు జాయిన్ అయ్యారు?"

నెల రోజుల నుంచి ఇక్కడ చూస్తూ కూడా... సంభాషణ పొడిగించే ఉద్దేశంతో..

దాంతో, అప్పటి వరకూ ఉన్న 'మౌనం' అనే అడ్డు తెర తొలగిపోయింది. అతను కనిపించినప్పుడల్లా రేగిన గుండె గాయం.. ఉపశమించి, మనసు దూదిపింజలా గాల్లో తేలింది.

ప్రత్యర్థి అనుకున్న వాళ్ళని ఎదుటి వరుసలో చూస్తూ బాధపడడం కన్నా... మన వరుసలోకి తెచ్చుకోవడమే మంచిది.

చెప్పాను..'రిటైరుమెంటు దగ్గరలో ఉంది, లోకల్లో వెయ్యమని అడిగితే, ఇక్కడ వేసారు" అని.

తనకి 'ఇంకా ఎనిమిదేళ్ళ సర్వీసు ఉందని, మరో ప్రమోషను కూడా చూస్తానని' చెప్పుకొచ్చాడు. పాత కెరటాలు వెళ్ళిపోతేనే... కొత్త వాటికి స్థానం.

అలా మాట్లాడుతూనే ... చుట్టుప్రక్కల వాళ్ళు అందర్నీ కలుపుకుపోతున్నాడు.

"ఏమోయ్! సుబ్బారావు... ఎక్కడిప్పుడు?"

"నీ లాంటి అదృష్టం మాకెక్కడ వస్తుంది బాబూ! ఎసోసిఏషనులో మెంబరువి, మీ స్వంత ఊరిలో వేయించుకున్నావ్! మా కంత కెపాసిటీ లేదు. ఇంటికి దూరంగా... రంపచోడవరంలో".

"ఒకప్పుడు నేనూ చేసిందేలే" ఓదార్చాడు.

ఎప్పటిలానే... మళ్ళీ సందడి. నవ్వులు.. కాలక్షేపం మాటలు.

రఘునందన ఎక్కడో సందడి అక్కడే అన్నట్లు..

'నీ వల్ల ఎక్కడో ఏజన్సీలో ఉన్న.. చాపరాయి వాటర్ ఫాల్స్ చూడగలిగాం' చెప్పాడు వరదరాజులు... అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.

'మళ్ళీ ప్రోగ్రాం వేస్తాను. మరో చోటుకి. ఈ సారి ఫ్లైటే ఎక్కిస్తాను. రడీగా ఉండండి' చెప్పాడు రెట్టించిన ఉత్సాహంతో.

ఇప్పుడతనికి అందరూ మిత్రులే.. నాతో సహా.

చివరిగా 'వస్తాను మేడం. కలుస్తాను' వీడ్కోలు తీసుకుంటూ చెప్పాడు. అతని ముఖంలో పెల్లుబికిన ఆనందం.

రాజకీయాల్లో ఎవరూ నిజమైన మిత్రులు గానీ, నిజమైన శత్రువులు గానీ ఉండనట్లే.. జీవితంలోనూ అంతే.

అతనేమీ నాకు ఆగర్భశత్రువు కాడు. కాకపోతే, ప్రమోషను అనే పరుగు పందెంలో.. అతను ముందుకు వెళ్ళే ప్రయత్నంలో.. నా 'ఇన్ ఎలిజిబులిటీ'ని ఆసరాగా తీసుకుని దెబ్బ కొట్టాడు.

'ఆ పని' అతను కాకపోయినా.. అవకాశం ఉన్న మరొకళ్ళు ఎవరైనా చేసేవాళ్ళే.

రాయి చేతిలో ఉన్నప్పుడు విసరడానికి బాధేమిటి?

తగిలితే పండు పడవచ్చు!

# కార్యశూరుడు

జంధ్యాల రఘుబాబు
9849753298

కార్యశూరుడు వీరేశలింగం
కావ్యకారకుడు వీరేశలింగం
కనులు తెరవమనె వీరేశలింగం
కలిసిసాగమనె వీరేశలింగం //కార్య//



బాల్యవివాహం బహునష్టమని
ముసలోడితో పెళ్ళి మానమంటూ
మహిళలొ అమ్మను చూశాడు
మహిలో తారగ నిలిచాడు
మనకే మార్గం చూపాడు //కార్య//

వితంతువులనే చేరదీసి
వివాహాలు జరిపించాడు
విధిరాతలను తానే మార్చి
విప్లవాలనే తెచ్చాడు
విలువలు మనకే నేర్పాడు //కార్య//

కులవిభజనలు వద్దంటూనే
జనులందరిని ఒకటిగ చేసి
పంక్తిభోజనం చేయించాడు
ప్రజలమనసుల్లొ నిలిచాడు
ప్రగతిబాట మనకిచ్చాడు //కార్య//

మూఢ నమ్మకం వదలమని
మూర్తిమంతమై నిలిచాడు
అభ్యుదయానికి మూలపురుషుడై
నిత్యదర్శనం అయ్యాడు
సదా మనకు తోడుంటాడు //కార్య//

పాత శాస్త్రాలు పక్కన పెట్టి
కొత్త చదువులు చదవమని
ఆలోచనలు మార్చమని
ఆశలనే రేకెత్తించాడు
ఆశయపథమై వెలిగాడు //కార్య//

తాను దూరమై వందయేళ్ళు
మనకు దగ్గరై తెరిచె మన కళ్ళు
ఉంది చూడమనె చుట్టూ కుళ్ళు
శుభ్రపరిచెను అందరి మెదళ్ళు
జీవిస్తాడులె వేల ఏళ్ళు ....
జీవిస్తాడులె వేల ఏళ్ళు ....
జీవిస్తాడులె వేల ఏళ్ళు ....

♦

కొండకి వెంట్రుక వేసి లాగితే, వస్తే కొండ వస్తుంది. లేకపోతే, వెంట్రుకే పోతుంది. అంతకుమించి పెద్ద నష్టం లేదు. అదీ అతని పాలసీ.

గడిచిపోయిన దానికి బాధపడి ప్రయోజనం లేదు. ఎలా జరగాల్సింది అలాగే, జరుగుతుంది అంటారు కదా! గతం... గతహ!

"సరే. మంచిది" అన్నా.

నేనూ తెలియకుండా రిలీఫ్ ఫీల్ అయ్యాను. గుండెల నిండా గాలి పీల్చుకుని. తేలికపడ్డాను. అప్పటి వరకూ.. మూసి ఉన్న గుప్పెడ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మనసుకి వేసుకున్న ముసుగు తొలగి, ఆకాశం వైపు తలెత్తి చూడగలిగాను.

ఇక శత్రువర్గపు మనుషులు లేరు నా జీవితంలో. గుండెల్లో అవమానం అనే' చిన్న ముల్లు' తప్ప.

ఆ రోజు "ఇంటి దొంగను ఈశ్వరుడు పట్టలేనట్లు.. చేసారు కదా!" అంటూ కోపం తెచ్చుకున్నాను. తిట్టాను.

"ఇంటి దొంగ ఎవరూ? ఈశ్వరుడు ఎవరూ?" అంటూ తప్పించుకున్నాడు.

ఇప్పుడు ఈ క్షణంలో అలాంటి కోపం లేదు నాలో. కాలం అన్నిటినీ మరపుకు తెస్తుంది. ఇదీ అంతే.

జీవితం అనే రంగులరాట్నంలో ఎవరు ఏ క్షణాన్న పైకి వెళతారో... ఎవరు క్రిందకి దిగుతారో ఎవరికి తెలుసు. ఓ ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్లు... అతని పలకరింపు మనసు తాళాన్ని తెరిచింది.

♦

## కవిత

# అరణ్యం ప్రవేశించే సమయం

- పాయల మురళీకృష్ణ
8309468318

అర్ధరాత్రి
కిటికీ వెనుక
అకస్మాత్తుగా తెరుచుకున్న
రెండు చూపుల గదులు

బయట
ఎంత ధారాపాతంగా కురిసినా
చీకటి రహస్యం
తెలుసుకోలేనట్టుగా వాన

మంచం మీద రెండు హద్దులూ
ఏమయ్యేంటాయి
బయటెవరిదో కదలిక
మసక మసకగా అలికిడి

అప్పుడప్పుడూ పులిని లేళ్ళు వేటాడుతాయి
భయంతో జరిగిన వేట
అపనమ్మకం ఆర్తనాదం తిరగబడిన వేట
ఆ ఒక్క క్షణం చాలు
జీవితం నడి సముద్రం లాంటి
సమయంలోకి నెట్టివేయబడటానికి

అన్యాయాన్ని మట్టుబెట్టిన తెగింపుకి కూడా
బోర విరుచుకొని తిరిగే ధైర్యముండదు
మబ్బు కమ్మిన మౌనం
చీకటి గదిలో ఓ మూలకి చేరుతుంది



కన్నీళ్ళ బదిలీ ఎడతెగక జరుగుతుంది

రహస్యం
అంతా రహస్యం
రహస్యం రంగ ప్రవేశం చేసినపుడు
కాలం వెనక్కి వెనక్కి వెళ్తున్నట్లు ముందుకెళ్తుంది

రహస్యమెంత మెలకువగా వున్నా
తెరవబడ్డ కళ్ళను
తూటాల చప్పుడు బెదరగొడుతుంది
భయంతో వణికిపోయే నయనాలు
మాట్లాడుతాయి

మాటల్ని తప్పించుకుంటూ
బహిర్గతం కాని రహస్యమొక్కటే
సూర్యోదయాన్ని ముద్దాడుతుంది

ఒకవేళ అనివార్య జనవాసంలో
రహస్యం బట్టబయలైతే
ప్రశాంత ప్రదేశంలోకి
అరణ్యం ప్రవేశిస్తుంది.... ♦

## నానీలు

- సాంబశివరావు తోపుల
9908465631

మతం మత్తు తుంచి
మానవత్వాన్ని ఎంచిన
కవితా జాడ
గురజాడ!

ఎన్నికల కోసం
ఎన్ని 'కల'లో
గెలుపు చేపకోసం
ఎన్ని 'వల'లో!

ఆధునిక యుగంలో
అభివృద్ధి చిహ్నం?
'పొలాలు' ప్లాట్లుగా
రూపాంతరం!

దేశంలో ఉన్న
నాయకులంతా
రైతు బాంధవులే!
రైతే అనాథ!




దురలవాట్లనేవి
దొంగల ముఠా!
లొంగామా
ఆరోగ్యం, ఆర్థికం,
సర్వం రా!?

స్వాతంత్ర్యం నాటి
పల్లె – తల్లి
ప్రపంచీకరణతో
నేడు, ఆమె బ్రతుకు
లొల్లి!

నేటి జాతి అజెండా
విదేశీ సొమ్ముల
కోసం
ఎదురు చూస్తున్న
ఖాళీకుండ!

తెలంగాణా కవిత
వేగుచుక్క 'కాళోజీ'
నమ్మిన రాస్తానే
రణం, ప్రయాణం! ♦

# కవిత్వపు "అగ్ని శిఖ" కకోర




- రాచమళ్ళ ఉపేందర్
9849277968

కష్టపడడం తెలిసినవారు ఉన్నత శిఖరాలపై నిలుస్తారు. ఉత్తమ వ్యక్తిత్వంతో జీవిస్తారు. 'కకోర'గా ప్రసిద్ధులైన కటుకోఝ్వల రమేష్ కష్టజీవి. బాల్యం నుండే కష్టాలను అమితంగా ఆరాధించారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎదిగారు. ఆహార్యం గంభీరంగా ఉన్నా.... అంతరంగం మాత్రం సుతిమెత్తన. చిన్నా, పెద్దా అరమరికలు లేకుండా ఆప్యాయంగా పలకరించటం అతని సహజ లక్షణం. చిన్ననాటి నుండే అనేక సంఘటనలు, అంతఃసంఘర్షణలతో మానసిక వేదన చెందాడు. 'ఉద్విగ్న మానస సాధారణ సంభాషణే కవిత్వం' అన్న క్రిష్టోఫర్ కార్డ్వెల్ మాటలు నిజం చేస్తూ కలం చేత పట్టాడు. కవిగా మారాడు. దాశరథి రంగాచార్య నుండి రావెళ్ల వేంకట రామారావు వరకు అనేకమంది లబ్ద ప్రతిష్టులైన రచయితలతో స్నేహం చేయటం, గంటల తరబడి సంభాషించటం ద్వారా సరికొత్త మెళకువలను నేర్చుకున్నాడు. సమాజాన్ని సవ్యమైన దిశలో నడిపించటానికి తన వంతుగా సాహిత్య కృషి చేస్తున్నాడు.

25 సంవత్సరాలుగా కవిత్వం రాస్తూ ఇప్పటి వరకు సుమారు 500 పైగానే కవితలను రాసి, అందరిని అబ్బురపరిచాడు. అభినందనలు అందుకున్నాడు. అందుకుంటూనే వున్నాడు. పలు కవితలకు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు సైతం సాధించాడు. ఇతని కవిత్వం నిండా భగభగమండే భావాలకు అగ్నిశిఖలాంటి అక్షరాలను జోడించడం కన్పిస్తుంది. తద్వారా కవితను చదివే పాఠకుడికి రససిద్ధి కలిగేలా కృషి చేస్తాడు. అలాంటి కవితల్లోంచి 101 కవితలను ఏరి తొలి కవితా సంపుటిగా "అగ్నిశిఖ" పేరుతో వెలువరించారు. ఈ ప్రయత్నానికి సహస్ర అభినందనలు. 'అగ్నిశిఖ' పుస్తకంలోని కొన్ని కవితలను పరిశీలిస్తే కవి అసాధారణమైన ప్రతిభా పాటవాలు పాఠకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి.

"అగ్నిశిఖపై...!" కవితలో కవి భావావేశపు పాళ్ళు ఏ స్థాయిలో ఉన్నాయో చూడొచ్చు. ***"నన్ను నేను ఉన్నపళంగా వెతుక్కున్నప్పుడు / తారాస్థాయిలో తాండవం చేస్తుంటాను / మహోజ్వలమైన 'అగ్నిశిఖ'పై..!"*** ఈ కవిత ఆసాంతం చదివిన తర్వాత పాఠకుడు ఉద్విగ్నభరితమైన వాతావరణంలో చిక్కుకుంటాడు.

గతం తాలూకూ మధుర స్మృతులు మననం చేసుకున్నప్పుడల్లా మనసు ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతుంది. ఆనాటి సంస్కృతినీ, పద్ధతులను జ్ఞప్తికి తెస్తాయి. దీంతో ప్రస్తుతం కోల్పోతున్నదేమిటో స్పష్టమౌతుంది. అలాంటి ఓ సుమధుర స్మృతి "బొట్టు పెట్టి" కవిత ద్వారా ప్రతి

ఒక్కరికి కలుగుతుంది. ***"పాత సామానున్న గదిలో / తలకిందులైన బొట్టుపెట్టెను / ఇప్పుడు ఓ అనాథలా చూస్తున్నప్పుడు / మనసంతా / పగిలిన అద్దమవుతుంది"*** అంటూ అమ్మకు, బొట్టుపెట్టెకు, ఆ రెండింటితో తనకున్న అనుబంధాన్ని తలచుకుంటూ మథనపడతాడు. కాదు... కాదు... పఠితుల్లో ఆర్ద్రతను కలిగిస్తాడు. ఇది రసవిద్య తెలిసిన కవికి మాత్రమే సాధ్యం. ఈ కవిత ఇంగ్లీషు భాషలోకి కూడా అనువాదం కావటం అభినందనీయం.

***'బాస నీకు దండమే...'*** కవితలో ***"పలక మీద గీసిన పదం లెక్క / పలుకుల మీద వాలిన పాలపిట్ట లెక్క / ఎంత సక్కంగుంటవే / నా బాసమ్మ.... ఓ యాసమ్మ..."*** భాస... యాసను... వర్ణించిన తీరు ముచ్చటగా వుంది.

కవిలోని చైతన్యం శిఖరాగ్రంలో ఉందనడానికి మచ్చుతునక "మొలకెత్తుదాం రండీ..!" కవిత. ***"ఒకరిపై ఒకరం రంధ్రాన్వేషణలు మాని / రంధ్రాలు పడుతున్న ఓజోన్ పొరకు / వెచ్చని గుండె చప్పుడుతో పచ్చని తెరల్ని కుట్టేద్దాం../ పర్యావరణ సంక్షోభాల ఒత్తిళ్లను / చెట్టుతల్లి పొత్తిళ్లలో వదిలేసి / వసుధ గుమ్మానికి పచ్చని తోరణాలు కట్టేద్దాం.."*** చక్కటి అభివ్యక్తిని ప్రోది చేశాడు.

***"ఏలికతనం నియంత పోకడై / చీకటి దాడికి పూనుకుంటే / అక్షరం క్షమించదు / అగ్నిస్నానం చేయిస్తుంది / తస్మాత్ జాగ్రత్త!"*** కుటిల రాజకీయాలపై, కుహనా కుతంత్రాలను వల్లెవేస్తున్న స్వార్థపరులైన నాయకులపై ఉవ్వెత్తున ఎగిసిపడతాడు.

***"వికృతమో... వికారమో.../సుందరమో.. సుకుమారమో../ మన మొఖాన్ని చూసి మనమే మురిసినట్లు / మనసుని చూసి మురిసే అద్దముంటే బాగుండేది / మనసుని నిలువెల్లా చూసే కళ్లుంటే బాగుండేది / ఇంతెందుకు మనసుకే కళ్లుంటే బాగుండేది"*** నిజంగా మనసుకే కళ్లుంటే బాగుండేది అంటూ మంచి భావుకతతో కవిత్వీకరణ చేశాడు.

నాయనను తలచుకుంటూ... రాసిన "మండుతున్న కుంపటిలా" కవిత ఈ సంపుటికే వన్నె తెచ్చింది అనటం అతిశయోక్తి కాదు. ***"ఊపిర్ని గొట్టంతో ఊదీ ఊదీ / నాయన కళ్లు రెండూ.../ కొలిమిలోని నిప్పురవ్వలయ్యేవి / కడుపులో ఆకళ్లు/సెగలు సెగలుగా రగిలినా / నాయన పనిలోనే మునిగిపోయేవాడు"*** నాన్నతో ఉన్న అనుబంధాన్ని గొప్పగా ఆవిష్కరించాడు.

ఈ కవితా సంపుటిని పై మెట్టుకు చేర్చే మరో ఆణిముత్యంలాంటి కవిత "గులేరు ఓ జ్ఞాపకం". నన్నెంతగానో కదిలించిన కవిత. నాతో మాట్లాడిన కవిత. ఈ కవితలో వాడిన పదచిత్రాలు చాలా బాగున్నాయి. జంతువులైనా, మనుషులైనా ఎదుటివారిని హింసిస్తే మిగిలేది మానసిక క్షోభ మాత్రమే. అంతేకాదు మనిషిగా మృతమైనట్లే. దీనికి విరుద్ధంగా అంటే హింసకు బదులు ప్రేమించటం మొదలెడితే ప్రపంచమంతా ఆనందంతో, సుఖశాంతులతో విలసిల్లుతుందనే ఆకాంక్షను వ్యక్తపరిచాడు. ***"జేబులో గులకరాళ్లు / చేతిలో గులేరు / కొమ్మమీది గువ్వను / గురి చూసి కొట్టాను / వేల వేల వేటగాడి / చూపులు నాలో.../ గాయంతో విలవిల్లాడిన పక్షి దృశ్యం / గులేరును పది కాలాలు / గోడకు వేళ్లాడదీసింది / ఇప్పుడు నా చేతిలో / కాసిన్ని ధాన్యపు గింజలు / కోటానుకోట్ల ప్రేమికుడి / రూపులు నాలో..."*** అంటూ కవిత ముగుస్తుంది. ప్రతి మనిషి ప్రేమ స్వరూపుడు కావాలనే తృష్ణ అంతర్లీనంగా కనబడుతుంది కవితలో.

ఇలా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిత్యం అధ్యయనం చేస్తూ... తన జీవిత అనుభవాన్ని రంగరించి పదునైన, ఆలోచనాత్మకమైన కవిత్వాన్ని సృష్టిస్తున్నాడు. తల నేనే... తలార్ని నేనే... అని అనగలిగిన గట్సున్న ఈ కవికి సమాజం పట్ల మంచి ఎరుక ఉంది. అగ్నిశిఖల్లాంటి ఈ పుస్తకంలోని కవితాక్షరాలు సమాజంలోని చెడును కరిగించి మంచిని పుష్కలంగా ఉత్పత్తి చేస్తాయనడంలో సందేహం లేదు. నగకు నగిషీలు దిద్దినంత ఓర్పుగా, నేర్పుగా అక్షరాలతో సరికొత్త పదబంధాలను, పద చిత్రాలను కలం నుండి కురిపిస్తున్నాడు కటుకోఝ్వల రమేష్.

ఇక ముద్రణ విషయానికొస్తే.... 264 పేజీలతో.... నాణ్యత కలిగిన పేపర్‌తో.... సర్వాంగ సుందరంగా ముస్తాబైన కవర్‌పేజి పుస్తకానికి అదనపు ఆకర్షణ అని చెప్పక తప్పదు. ఈ సంపుటికి అందించిన ముందుమాటలన్నీ కూడా చాలా ప్రాధాన్యత కలిగినవే. కవిత్వమే కాదు... పుస్తకాన్ని ముద్రించటంలో కూడా కవి చూపించిన ప్రతిభను, తపనను మెచ్చుకోకుండా ఉండలేము. కకోర కలం నుండి మరెన్నో ఆణిముత్యాల్లాంటి కవితలు వెలువడి, సమాజాభ్యున్నతికి మరెంతో పాటుపడాలని మనమంతా కోరుకుందాం. ♦

# ప్రజాస్వామ్యం

- డా.యస్.సత్యప్రసాద్
94405 44675



ఎన్నికల కార్యం
ఓ రాజకీయ ప్రహసనం
ప్రజాస్వామ్యం
ఓ నేతిబీర సమానం

ఐదేళ్ళకు ఓసారి
ప్రజాస్వామ్యం జాతర
మైకుల్లో నోళ్ళు దూరి
ప్రజలే దేవుళ్ళంటూ ఊదర

బ్యాలెట్లో కానరాదు
నిఖార్సైన ఏపేరు
ఓటరుకి ఏదారిలేదు
'నోటా'ది కంటితుడుపు తీరు

ఎన్నికలొచ్చిన వేళ
సమాజంలో చీలికలు
ఫలితాలొచ్చిన వేళ
ప్రజల నెత్తిమీద ఏలికలు

పంచవర్ష క్రతువుకోసం
జనుల నోటికి తాళం
గద్దె నెక్కినోడి గాదెకోసం
ప్రజాధనం భూరివిరాళం

రాచరికపు అధికారం
కోట శిధిలాల్లో భూస్థాపితం
నయానేతల వారసత్వ
మమకారం
ప్రజాస్వామ్య ముసుగులో
ప్రతిష్ఠితం

భ్రమలు వీడి పీడితులు
సత్యాన్వేషణ చేస్తే
ప్రజాస్వామ్య శాసనాలు
జాడ వెదికి చూస్తే

పదిలంగా ప్రజాస్వామ్యం
రాజ్యాంగపుటల్లో ముద్రించిన
అక్షరం
వాస్తవంగా ప్రజల స్వామ్యం
ప్రదర్శనశాల అరల్లో దాచిన శిలాక్షరం

అందుకే..

కలం గళం ఎలుగెత్తితే
అక్షరాల దుమ్ము దులిపితే
ఓటు బలం ప్రజకు తెలిపితే
ఆయుధంగ మలిచితే

చైతన్యపు భావాల్లోంచి
ప్రజలపాలన మొలకెత్తుతుంది
సమసమాజపు పొత్తిళ్ళలోంచి
మరో ప్రపంచం ప్రభవిస్తుంది ♦

# రెండో పార్శ్వం...

- ఉండవిల్లి.ఎమ్
9441347679



*ముసుగులు మారుస్తూ*
*విశ్వజనీనం కాని భావాల్తో*
*ఏకం కాలేకపోతున్న జనారణ్యం*
*విరుద్ధ కోణాల్ని లోలోన దాచేసి*
*ఇరుకు మనసుతో*
*అందర్నీ ఆకర్షిస్తున్న వైనం*
*అంత్యజుడు అగ్రజుడు అందరం -*
*ఇంకా విశాలం కాని వాళ్ళమే*
*విష సంస్కృతి వలయంలో*
*విస్తృతమవ్వని అంకురాలం*
*మాటల నేర్పరులం*
*ఉట్టిపడే అభినయంతో*
*ఊరేగుతున్నోళ్ళం!!!*

*విడవని జాడ్యాన్ని*
*రహస్యంగా ప్రేమిస్తూ*
*వినాశన సామ్రాజ్యానికి*
*సమిధ పాత్ర పోషిస్తూ*
*తేనె పూసిన కత్తిలా*
*మానవ నిర్మాణాన్ని విభజిస్తూ*
*మనసుకు సమాధి కడుతున్నాం*
*వాసనలు మాత్రం-*
*రేపటి ప్రపంచ పతనానికి*
*మనిషిలోని అంతర్గత భావాల్ని*
*రెండో పార్శ్వంలో ప్రదర్శిస్తూనే ఉంటాయి* ♦

# చలివేంద్రం

*✸ జాతశ్రీకి నివాళిగా సాహిత్య ప్రస్థానం 2003 ఏప్రిల్ – జూన్ సంచికలో ప్రచురించిన ఈ కథను పునర్ముద్రిస్తున్నాం. ఈ కథ పేరుతో జాతశ్రీ కథా సంపుటి వెలువరించారు.*



**జాతశ్రీ**
**(04.08.1943–04.11.2018)**




పొదుపుచుక్క ఇంకా పొడవనే లేదు

చీకటి దట్టంగా, ముదరకాలిన కుండ తీరునున్నది

ఊరు – ఊరంతా పోలీసోళ్ళకు భయపడి నక్కిన బుడతల తీరున – గుట్టుచప్పుడు కాకుండా ఉంది.

వసారాలో కునుకేసిన కుమ్మరెంకన్న ఉలికిపాటుతో ముసుగు తంతూ దిగ్గున లేచాడు. కళ్ళు చిట్లిస్తూ బయటకు చూశాడు. వాకిలిలో సారెకు కట్టేసి వున్న మేకపిల్ల కళ్ళు పసుపురంగు రేడియంలా మెరుస్తున్నాయి.

అతను వాకిలిలో కొచ్చి మబ్బుకేసి చూశాడు. "గురకోళు ్ళ సుత కనబడ్డంలే… శాన పొద్దున్నట్టుంది" అనుకొంటూ చుట్టూ పారజూశాడు. కొద్ది దూరంలో కుండలబట్టీ నుంచి పచ్చని మంట తన్నుకొస్తూంది. "కుండ కాలినట్టుంది. రేపన్నా బట్టీ దియ్యాల… దీని సిగదరగ, ఎంత జేసినా తరగదీ కుమ్మరిపని" లోలో గొణుక్కొన్నాడు.

చీకటిలో తచ్చాడుతూ, చుట్టు గుడిసె మొగదలలో ఉన్న గోడగూటిని తాకి, అందులో సగం తాగి దాచుకొన్న మోదుగాకు చుట్ట అందుకొని పెదాలపై ఉంచుకొన్నాడు. ఆ పక్కనే దీపం దగ్గరున్న అగ్గిపెట్టెతో దీపాన్ని వెలిగించి, అదే పుల్లతో చుట్ట కాల్చుకొన్నాడు. నాలుగయిదు దమ్ములు లాగి, నోటిలో ఊరిన ఉమ్మిని దడికేసి ఉమ్మేసి, గుడిసెలోకి చూశాడు. నిట్టాడు దాపులో చాపమీద పడుకొన్న పిల్లల మొహాల మీద దీపం నీడ తారాడుతోంది.

నలుగురు పిల్లలు, తిండికే తప్ప పనికి లెక్క కొచ్చే వయస్సు కాదు. జంగిలి గొడ్లోళ్లతో జత కలిసి పెద్దోడు యిప్పుడిప్పుడే పనికి అలవాటు పడుతున్నాడు. నడిపి పిల్లలిద్దర్నీ 'సార్లు' బళ్లోకి లాక్కుపోతున్నారు. చంటి దాని వల్ల భార్య యిల్లు కదల్లేకపోవడం అతనికి ఓ చెయ్యి విరిగినట్టుగా ఉంది. 'యింటిది కూడా ఏ కూలినాలికో పోకపోతే బతుకు సాగేట్టు లేదు' అనుకొన్నాడు కుమ్మరెంకన్న.

"ఏమేవ్…"

చాప మీద నలుగురు పిల్లల మధ్య తానూ ఓ పిల్లదానిలా ముడుచుకొన్న ముత్తమ్మకు భర్త పిలుపుతో తెలివొచ్చిందిగాని, కన్ను విప్పలేకపోయింది.

రాత్రి – సందేళ చంటిది జ్వరంతో చేసిన తొందర వల్ల ఆమెకు నడిఝాము దాకా కన్ను మలగలేదు. మాతర్లిచ్చే ఖాదర్సాయిబు ఇంటి పట్టున లేకపోవడంతో, బిడ్డ కేమయిందో తెలియక కాలుగాలిన పిల్లిలా తిరిగింది. అప్పటికీ వాముసూరి తులిసాకు రసంతో కలిపి తాపించినా పిల్లది ఏడుపు గోస తగ్గలె. ఏం చెయ్యాలో తోచక పిల్దాన్ని బుజానేసుకొని ఇంటి వాకిట్లో నిల్చుంటే, ఎదురింటి సాముల కోటమ్మత్త కస్తూరి

మాత్ర తెచ్చిచ్చి చనుబాలతో రంగరంచి తాపించమంది.

మాత్రబడిన కూసేపటికే పిల్లది కునుకు తీసింది. ముత్తమ్మకు కూడా అలసటనిపించింది. ఆకలేసినా పెట్టుక తినేంత ఓపిక లేక, ముంతెడు నీళ్లు తెగి, పిల్ల పక్కనే వొరిగింది.

"కోడి సుతకూయలె.. ఏందా తొందర, యీ సీకట్లబడి యాడబోతవ్?" కళ్లు తెరవకుండానే అన్నది ముత్తెమ్మ.

"ఆరు కోసు నడవొద్దానె? పొద్దెక్కితే సంతల సోటు సుత దొరకదు. జెనానికి పనుల్లేక అడివిన దిరిగి దొరికిందేదో తేవటం, అమ్ముకోవటం... ఎపుడు జూడు, ఏదో ఒక బేరం" అన్నాడు కుమ్మరెంకన్న.

ముత్తమ్మ మారు మాటెత్తలె.

అతను తడిక మీదున్న కావిడితీసి, తాళ్లు లాగి చూసుకొన్నాడు. గట్టిగానే ఉన్నాయి. దాన్నో పక్క నుంచి, పొయ్యిలో కెలికి ఓ బొగ్గు ముక్కందుకుని, నోట్లో వేసుకొని నములుతూ గాబు దగ్గరికెళ్ళాడు.

ఎదురింటి ముక్కయ్య తాత – ముదిరిన దగ్గురోగపు బాధతో పేగులు కదిలేలా దగ్గుతున్నాడు. కూతవేటు దూరంలో కుంట పొంటె కోయోళ్ల గుంపులోంచి సినిమా పాట వినిపిస్తూంది. "కోయోళ్ల – రేలపాట లేమాయెనో.... ఆ కోలాటా లెటు బోయినయో... యిట్టయి పోయినయేంది రోజులు?" అనుకుంటూ, నోరు కడుక్కొని, తలగుడ్డతో మోహం తుడుచుకుంటూ వసారాలో కొచ్చాడు.

అప్పటికే నిద్రలేచిన ముత్తమ్మ దీపం వెలుగులో గుడిసెలో ఉన్న కుండలు ఒక్కొక్కటే తెచ్చి వసారాలో వరుసగా పెడుతోంది.

"అవ్. పచ్చికుండ సరవడమయిందానె?" అన్నాడు కుమ్మరెంకన్న.

"ఇంకా నగం దాకున్నాయి. యాడ... పిల్లది సంకొదిలితేనా?"

"కానియ్, ఎండలు ముదురుతున్నాయి."

"ఊకున్ననా...కుండని ఎండకీ నీడకీ తిప్పటం, మద్దెమద్దెన సరవడం... ఇటు పిల్దాన్ని ఆర్సుకోటం. నాకు తెల్వదా?" ముత్తమ్మ నీళ్లకుండను వరసలో ఉంచుతూ అన్నది.

"అగ్గో, అన్నీ నీళ్లకుండలేనా, బువ్వకుండలూ, కూరపిడతలూ ముంతలూ, మూకుళ్లు సుత బయటపెట్టు" అన్నాడు.

"ఎండాకాలవాయె! నీళ్ల బానలు నాలుగెక్కువ కొంచక పోరాదూ?" అంది ముత్తమ్మ.

"నేనేం లంబాడోళ్ల తండక్కాదు పోయేది. కొత్తగూడెం సంతకి" చిరుకోపంతో అన్నాడు కుమ్మరెంకన్న

"ఏం, కొత్తగూడెపోళ్లు నీల్తాగర?" అంది ముత్తమ్మ.

"నీకు తిరగజెప్పటం నా వల్లగాదె తల్లా... ఇయ్యాల్రేపు బస్తీలోళ్లు కుండల నీళ్లేడ తాగుతున్రు?... మిషన్నీళ్లే... నేనోపాలి తాగిన, నీత్తల్లి నరాలు జివ్వుమన్నయనుకో... మంచుతీర్న ఉన్నయ్" అన్నాడు.

"ఇగాగు... అందరయ్యే తాగుతరాయేంది?.. కుండ గిరాకీ కుండకుంటది". అని, వరసలో ఉంచిన కుండల్ని లెక్కేసి, "యిగ చాల్లే.... " అంది ముత్తమ్మ.

కుమ్మరెంకన్న కావిడిని భూమి కుదురుగా ఉన్నచోట ఉంచి, చిలక్కొయ్య కున్న పగ్గాన్ని అందుకొన్నాడు. భార్య ఒక్కొక్కకుండనీ అందిస్తుంటే, కుండ మూతికి పగ్గంతో ఉచ్చేసి బిగిస్తూ కావిడి రెండు ప్రక్కలా బరువు సరిపోను కట్టుకొన్నాడు.

"పాయే... పొద్దు సుక్క సుత పొడిసె! ఆరుకోసులు...... నా దుంపదెగుద్ది."లోలో అనుకొని, భార్యకేసి చూస్తూ, "సద్దిబువ్వేం లేదా? ఎండలాయె... ఓ ముద్ద తింటె గాబరెత్తదు" అన్నాడు నెమ్మదిగా.

రాత్రి తను అన్నం తినకపోవడమే మేలయిందనిపించిందామెకు. "ఉంది... చెయి కడుక్కో పెడత." అంటూ ఉట్టి మీద నుంచి అన్నంకుండ దింపి, ఓ పట్టెడన్నం కంచంలో ఉంచింది. మిగతాది పిల్లల కోసమని, మళ్లీ కుండను ఉట్టిమీదుంచింది. పిడతలో అడుగంటిన గోంగూర పచ్చడిని వ్రేలితో తుడిచి, పళ్ళెంలో వేసి, అందించి, ముంతతో నీళ్లు పట్టుకొని దగ్గరగా కూచుంది.

"రేత్రి నువ్ తిననట్టుకుంది" ముద్ద కలుపుతూ అన్నాడు కుమ్మరెంకన్న.

"మా తిన్నలే... నువ్ కానియ్" అంటి ముత్తమ్మ.

"అవ్, పెద్దోడ్ని బోడగుట్టకెళ్లి పోనియ్యమాక. యిటు కుంట పొంటె పొమ్మను. పోలీసోళ్లు గుట్ట సుట్టుముట్టిన్రంట" అన్నాడు.

"ఏమయింది?"

"ఏవయితే మనకెందుకే?.... నువ్వాడ్ని పోనియ్యమాక.... నిన్నంత తుపాకుల మోతేనాయె! నువ్ సుత యింటివిగదా!...

యింగా అడుగుడేంది?" అన్నాడు.

"అట్టనే, పెద్దోడ్ని నే నర్సుకుంటాలేగాని, కస్తూరి మాత్రలు మరవబాక" అంది ముత్తమ్మ.

''ఊ... నువ్వట్ట పిల్దాన్ని సంకనేసుకొని, మిల్లుకెళ్లిపోరాదూ?... నీడ పట్టున పని, మానెడు నూకలు దొరికినా మా బాగె" అన్నాడు.

''యాడ?... మిల్లేడ నడుస్తంది. యీ యేడు కాలవేడయింది? పొలాలున్నోళ్లే ఊర్లపొంటె పనులకి పోతన్రు గాదూ..నీకు తెల్వదా?"

"ప్చ్.. జెనవెట్టనో, ఏవో.... పంటల్లేక, పనుల్లేక, తిండి కరువై తల్లడిల్లుతున్రు. మనకి నల్లమట్టి తోలే కాపోళ్ల బసవయ్య లేడూ. బండెద్దులకి మేతలేక, పోయిన సంతల ఎద్దుల్ని బేరానికి బెట్టిండు. సంతల నను వాటేసుకొని, బోరునేడ్సిండు. నా సిన్నప్పటి నుంచి మనకి మట్టి తోలిండాయె? 'యింకెవుర్నన్నా సూసుకోరా ఎంకన్నా..." అనే సరికి నాకు సుత కళ్ల నీళ్లాగాలె" కుమ్మరెంకన్న బాధగా అన్నాడు.

''కాలమిట్టనే వుంటె... రాన్రాను డొక్కల కరువొస్తదేవో...." ముత్తమ్మ.

"అట్ట సచ్చినా మా బాగె. ఈ శెరలు పడలేక దినాం సస్తన్నం." అంటూ భార్య చేతిలోని ముంతందుకొని నీళ్లు తాగి, "సర్లే' యింటి పట్టునుండి కుండల పని గానియ్" అంటూ కంచాన్ని భార్య కందించి లేచి, కావిడిబద్ద భుజానేసుకొంటూ' "పొయ్యొస్త... పిలగాళ్లు భద్రం" అని వీధిలో కొచ్చాడు.

కోళ్లు కూస్తున్నాయి. నిన్నటి శ్రమను మర్చిపోయిన పల్లె కొత్త ఆశల ఆరాటంతో మేల్కొంటూంది. ఎవరైనా తోడు దొరుకుతారేమోనని, కొద్దిసేపు అటూ, ఇటూ చూశాడు. ఎవరూ కనపడలేదు. ఆలస్యమయితే సంతలో చోటు దొరకదనే తలంపుతో పరుగులాటి నడకందుకున్నాడు కుమ్మరెంకన్న.

ఇలా వెళ్లడం అతనికి కొత్తేం కాదు. వారానికోసారి ఆదివారం కొత్తగూడెం సంతలో అయినకాడికి కుండలమ్ముకొని, వారానికి సరిపడా సరుకులు తెచ్చుకోవడం అలవాటే! అదీ... నిన్నామొన్నటి అలవాటేం కాదు. తాతల కాలం నుంచీ ఉన్నదే! ఇప్పటిలా – ఆ రోజుల్లో బొగ్గుబావి కార్మికులకు నెలవారీ జీతాలుండేవి కాదు. వారానికోసారి – శనివారం బట్వాడా. ఆదివారం బావికి సెలవు. అదే రోజు సంత. కార్మికులు వారానికి సరిపడా సరుకులు సంతలోనే కొనేవారు. నగదు బేరం, సరుకు నాణ్యత తప్ప మరొకటి చూసేవాళ్ళు కాదు. చదువు రాకపోయినా లెక్కల్లో తేడాలుండేవి కావు. కూలీనాలీలంటే జాలుండేది. మాట మీద బతికిన రోజులవి. కుండ ధర చెపితే 'బతకనీ... పనోడు' అని దయచూపారే తప్ప, ఇప్పటిలా గీసి గీసి కొసరిన వాళ్లు కాదు. మాయదారి కాలమయింది. మనిషి కంటే పైసాకే గిరాకెక్కువయింది.

తమ చిన్నతనం రోజుల్లో కుంటకెళ్లి ఎంత మట్టి తెచ్చుకున్నా ఎవరూ కాదనే వాళ్లు కాదు... ఇప్పుడు!... మట్టి క్కూడా మండిపోయే రేటు. అప్పట్లో బోడగుట్టకు పోతే కావల్సినన్ని కట్టెలు! ఇప్పుడవీ కొనటమే! కాదనుకోలేక చెయ్యడవే తప్ప కులంపనికి రోజులు కావివి! ధరలెంత పెరుగుతున్నా కుండ కాడికొచ్చేసరికి 'స్టీలుదా?.. యిత్తడిదా'? అంటూ వెక్కిరిస్తారు. 'పావలాకిస్తవా? పరక్కిస్తవా? అంటారే తప్ప, కుండ జెయ్యడానికి కుమ్మరోడి కాల్చేతులెంత శెరబడతయో ఎవరూ చూడరు. మనిషి పనితనానికి నూకలు పుట్టని రోజులయినై.

కావిడి భుజం మార్చుకుంటూ కుమ్మరెంకన్న అటూ, ఇటూ చూశాడు. అటు తార్రోడ్డు, ఇటు బండ్లబాట. తార్రోడ్డున పోతే దూరమెక్కువయ్యినా కాలు బాగాసాగుద్ది. తేలికగా నడవొచ్చు. బండ్ల బాటయితే ముర్రెడు వాగు లోంచి పోవాల. యిసుక కోసం లారీలూ, ట్రాక్టర్లూ తిరగడం వల్ల బాట బాగా నలిగింది. రోడ్డుకంటే ఓ కోసెడు దూరం తక్కువేగాని, యిసుకలో కాలుసాగదు. పైగా కావిడి బరువు. అయినా అతను బండ్ల బాటకే తిరిగాడు. రోడ్డున పోతే పాల్వంచ – కోయగూడెం తిరిగే బొగ్గు లారీలు గుద్దితే... కుండే పగులుద్దో, గుండే పగులుద్దో ఎవడి కెరక?

ఇసుకలో కాళ్లు దిగబడి పోతున్నాయి. బాట కిరుప్రక్కలా ఉన్న ముళ్లపొదల్లోంచి కీచురాళ్లు 'ఖీ'... పెడుతున్నాయి.

"కూటికి రానిదీ కుమ్మరోడి బతుకని పెద్దలు ఊరికే అనలె ! కుంట నుంచి మట్టి కొనక్కొచ్చిన లగాయితు యింటిల్లాదులు చెమటోడ్చితే.. యిరవైదినాల పైగా శెరబడితే కుండ చేతికొస్తది. ఇంతాజేసి అమ్మకానికి కొంచకపోతే, ఖర్సట్టబోనీ... దినం కూలన్నా పడదు. దీని సిగదరగ... కుమ్మరోడి పనికంటే కూలోడి పనే సుకం. పొద్దుగూకితే

అంతో, ఇంతో చేతిల పడుద్ది, ఆ పూటకి బెంగుండదు" అనుకున్నాడు కుమ్మరెంకన్న.

ముగ్రెడు వాగొడ్డుకొచ్చి, కావిడి భుజం మార్చుకుంటూ ఆగి, వాగుకేసి చూశాడు. వాగు చాలా వెడల్పుగా ఉంది. ఓ ప్రక్క నుంచి లారీ లోతున యిసుక తోడుకుంటూ వస్తున్నారు. "ఇసుక తోడకండిరా.. జెనానికి నీళ్లకరువొస్తంది. అసలే బొగ్గుబాయిల దొరక్కుంటే... ఎండాకాలం – జెనం, అంతకు ముందు నోరులేని జీవాలు సస్తయిరా..." అని ఊరి జనం ఎంత మొత్తుకున్నా పంచాయితీ వాళ్లు యిసుక వేలంపాట ఆపలేదు. గవర్నమెంటు ఆర్డరిచ్చిందంట!.. పంచాయితీకి డబ్బు కావాలట! చుట్టుపక్కల కట్టుబడులన్నిటికీ యిక్కడిదే ఇసుక! తెల్లవారితే లారీలూ, ట్రాక్టర్లూ... యిసుక ఎత్తే కూలీలతో సందడిగా ఉంటుంది. ఆ సందడిని చూసే కులవృత్తి మానేసిన కంసాలి వీరాచారి వాగొడ్డున కానుగ చెట్టునీడలో పందిరేసి టీకొట్టు పెట్టుకొన్నాడు. ఆ సందడి మీద నమ్మకంతోనే ఎకరం పొలముండీ ఎందుకూ కొరగాక, వాంక్‌డోత్ భీమ కొంచెం దూరంలో పొదలమాటున 'దొంగ గుడంబా' అమ్ముకుంటున్నాడు.

కుమ్మరెంకన్న వాగు మధ్యలో కొచ్చాడు. పగలంతా రొదతో దద్దరిల్లే వాగు – అలసటతో కన్ను మలిగినట్టుగా ఉంది. అల్లంత దూరంలో బ్రిడ్జి మీద విద్యుద్దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

'ఠయిరో...."

వాగులో తట్టు నుంచి విన్పించిన స్వరానికి కుమ్మరెంకన్న ఉలికిపాటుతో అటు చూశాడు. రెండు నల్లని ఆకారాలు !... పోల్చుకునేలా లేవు. తనకేసి వస్తూ కనిపించాయి. అతని గుండె దడదడలాడింది. కాళ్లలో వణుకు ఆరంభమయింది.

ఆకారాలు దగ్గరగా వచ్చాయి. పోలీసులు. !!! యిద్దరి చేతుల్లోనూ తుపాకులున్నాయి. తలకు యినుప టోపీలున్నాయి.

"ఏ ఊర్రా?" అన్నాడో పోలీస్.

కుమ్మరెంకన్నకు వెంటనే గొంతు పెగిలింది కాదు. భయంగా చూస్తుంటే దూరాన్నుంచి "చల్నేదో..." అంటూ ఓ కంచుకంఠం విన్పించింది.

కుమ్మరెంకన్న అయోమయంగా కంచుకంఠం విన్పించిన వైపు చూశాడు. చాలా మంది యిసుకలో కూర్చొని ఉన్నారు. "పోరా... పో... అంటూ పోలీసులిద్దరూ వెనుదిరిగారు. అతను వణుకుతున్న కాళ్లను అదుపులోకి తెచ్చుకుంటూ, "బతికేన్రా భగవంతుడా..." లో లో అనుకొని, సత్తువ కొద్దీ కాలాడించి వాగు దాటాడు. కొత్తగూడెం చేరేంత వరకు అతని గుండె వేగంతో .... నడక వేగమూ, పోటీ పడింది.

"వామ్మో.... పొద్దెక్కిపాయె... సంతల సోటుంటదో, లేదో..." అంటూ యింకా నడక వేగం పెంచాడు.

చిన్న బజారు దాటి మెయిన్ రోడ్ దాపుకొచ్చేసరికి పోలీస్ స్టేషన్ ముందు స్తంభానికి కట్టిన మైక్ నుండి పాటలు విన్పిస్తున్నాయి. టీ స్టాల్ ముందు సందడిగా వుంది. జనాన్ని తప్పించుకొంటూ ఎదురొచ్చే ఆటోలను గమనిస్తూ, అతను సూపర్ బజార్ దాకా వచ్చాడు.

"ఏయ్, కుమ్మరోడా..."

కుమ్మరెంకన్న ఆగి వెనుదిగిరి చూశాడు. ఓ పోలీసతను ఆగమంటూ చేతినాడిస్తూ, దగ్గరగా వచ్చాడు? "ఆగవేంద్రా... చెవుడా?" అన్నాడు.

"ఇనపల్లేదు బాంచన్..."

"సర్‌సర్లే... స్టేషన్‌కి పద." అన్నాడు పోలీసతను. కుమ్మరెంకన్న ఉలికిపాటుతో భయంగా చూశాడు. "టేసన్‌కా, నేనెందుకు బాంచన్?..." ఎద కదిలించే దైన్యం అతని స్వరంలో కదిలాడింది.

కుమ్మరెంకన్న మొహంలోని దైన్యాన్ని చూస్తూ, పోలీసతను గర్వంగా గలగల నవ్వి, "చలివేంద్రానికి కుండలు కావాలి. పద, యస్సయిగారు పిలుస్తున్రు" అన్నాడు.

కుమ్మరెంకన్న నరాలన్నీ చచ్చుబడిన వానిలా, బేలగా చూస్తూ కావిడినో పక్కగా దించి, "గరీబోన్ని, పిల్లలు గలోన్ని, నన్నొదిలేయ్... బాంచన్, మీ కాళ్ళు మొక్కుత" అంటూ పోలీసతని పాదాలు తాకాడు.

"రేయ్... దిమాకేవన్నా చెడిందా !... కుండలు అమ్మేటందుకు కాదా? యస్సయి సాబ్ పైసలిస్తడురా..." అన్నాడు పోలీసతను కాళ్ళు వెనక్కి తీసుకుంటూ.

కుమ్మరెంకన్న నమ్మనట్టుగా చూశాడు. అతని మనసేదో అపశకునాన్ని సూచించింది. "వద్దులే, బాంచన్... నన్ను పోనియ్యండి" వంగి, కాళ్లు మొకుతూ అన్నాడు.

''దెహె.. వొల్లేవన్న బలిసిందార..... అరె, డబ్బులిస్తమంటుంటే వినవేం, పేదోడివి, పొద్దునే నీ నోరు కొడ్తాంరా... పద, పద..." అంటూ స్టేషన్ కేసి దారి తీశాడు పోలీసతను.

"ఇదెక్కడి పితలాటకంరా బగమంతుడా..." అనుకొంటూ

కావిడెత్తుకొని పోలీసతన్ని అనుసరించాడతను.

ఈ మధ్య మారిన భద్రతా పరిస్థితులను బట్టి మూడు అంచెలుగా పటిష్టంగా నిర్మించిన భవనమది. ముందు పెద్ద యినుపగేటు. గేటు కీవల రోడ్డున సగం ఆక్రమిస్తూ టెంట్ వేసి ఉంది. టెంట్‌లో కుర్చీలు బారులు తీర్చి ఉన్నాయి. టెంట్‌కు కుడి పక్కన గాంధీజీ విగ్రహముంది. విగ్రహం కిందుగా, విగ్రహం ఉన్న పాలరాతిపై ఆ విగ్రహస్థాపన సభ్యుల పేర్లు ఉన్నాయి. దాని పక్కగా వెదురు తడికలతో కట్టిన పందిరి ఉంది. పందిరి ముందు 'చలివేంద్రం-నిర్వహణ... మైత్రీ సంఘం' అని రాసిన బేనర్ కట్టబడి ఉంది. దాని ముందు రంగు కాగితాలంటిస్తూ యిద్దరు పోలీసులున్నారు.

కుమ్మరెంకన్న గేటు దాపుకొస్తూనే, లోని కెళ్ళమనట్టు సైగ చేస్తూ సెంట్రీ గేటు తెరిచాడు.

సింహాల బోనులోకి బలవంతంగా నెట్టబడే గొర్రెపిల్లలా, బితుకుబితుకుమంటూ అతను లోనికి అడుగు పెట్టాడు.

స్టేషన్ ఆవరణలో పోలీసులతో పాటు పెద్దలు కూడా కొందరున్నారు. అందరి మొహాల్లోనూ ఆనందమూ, దాంతో పాటు హడావుడీ ఉంది.

"అటు నిల్చో..." లోనికొచ్చిన కుమ్మరెంకన్నతో మొరటుగా అన్నాడో పోలీస్.

కుమ్మరెంకన్న ప్రహరీ ప్రక్కన కావిడి దించి, చేతులు కట్టుక నిలుచున్నాడు.

"క్యా సాబ్... ఎనిమిద్దాటింది. ఎస్.పి. గారొస్తరా, లేదా?... నాకు పనులున్నాయి. ఖమ్మం పోవాల" ఖద్దరు కండువా మెడచుట్టూ తిప్పుకున్నతను యస్సయి దగ్గరగా వస్తూ అన్నాడు.

ఆ పక్కనే ఉన్న ఓ రంగు చొక్కా మనిషి, "సెల్ కొట్టండి సార్... అవతల పార్టీ మీటింగుంది. టయిమయితంది, ఎల్లాల" అన్నాడు.

"వస్తున్నారండీ... తల్లాడ దాటారు. ప్రజలకోసం పోలీస్ స్టేషన్‌ల ముందు చలివేంద్రాలు పెట్టాలని ఆర్డర్స్ వచ్చాయి. ప్రారంభోత్సవాలన్నీ యీ రోజే..... కాస్త వోపిక... ఏయ్, సెవెన్ జీరో... సార్లకి మరోసారి స్ట్రాంగ్ టీ చెప్పు" అన్నాడు యస్సయి.

"మీ రూల్స్ బాగా మారినయ్ సాబ్, మైత్రీ సంఘాలు బెట్టిన్రు... వైద్య శిబిరాలు బెడుతున్రు... కేసు పెడితే రశీదిస్తున్రు.. స్టేషన్ కొస్తే కుర్చీ చూపిస్తున్రు." అన్నాడో రకరకాల రంగుటద్దాలు వాడే మనిషి.

"అయినా జనానికి భయం పోలె" మరొకతను నెమ్మదిగా అన్నాడు.

ఆ మాటలేవీ కుమ్మరెంకన్నకు పట్టడం లేదు. వాళ్ల హడావుడీ నచ్చడం లేదు." ఇక్కడికొచ్చి యిరుక్కున్నేంద్రా... బగమంతుడా... " అనుకుంటూ తలపట్టుకొని ముంగాళ్ల మీద కూచోబోతుంటే....

"రేయ్, పదికుండలు తియ్‌రా..." అన్నాడు యస్సయి. అతని స్వరం సాఫీగా కాకుండా బొంగురు పోయినట్టుగా ఉంది. అతని మొహం సాదాగా కాకుండా చెదలు పట్టినట్టుగా ఉంది. అతని చూపు సీదాగా కాకుండా దొంగదెబ్బ తీసే 'వాడి - చూపు'లా ఉంది. అతని నడుమున వ్రేలాడే పిస్తోలు పుట్టలోంచి తల బయటపెట్టిన నల్లత్రాచులా ఉంది.

'సిత్తం బాంచను" అని టక్కున పగ్గాన్ని విప్పి, చిన్న చిన్న కుండల్ని పక్క నుంచి, పది పెద్ద కుండలు ఎదురుగా ఉంచి, చేతులు కట్టుక నిలుచున్నాడు కుమ్మరెంకన్న.

"ఏయ్.. ట్వంటీ సెవన్', యివి లోనపెట్టు" కుండల్ని చూస్తూ అన్నాడు యస్సయి.

'ట్వంటీ సెవన్' కుండల్ని లోనికి తీసుకవెళుతుంటే, తనకే వినపడనంత చిన్నగా 'పైసలిస్తూ, బాంచన్" అన్నాడు. అదీ భయం భయంగా కుమ్మరెంకన్న.

కుండలు తీయమన్న యస్సయిగానీ, తీసి లోనపెట్టుకొన్నతను గానీ, తనకేసి చూడటం లేదు. అతనికేం చెయ్యాలో తోచక తలగొక్కున్నాడు. అందర్నీ మార్చి మార్చి చూడసాగేడు.

యస్సయి గారి చేతిలో ఉన్న సెల్ మ్రోగింది. చెవి దగ్గరుంచుకొని, అవతలి నుంచి చెప్పేదంతా విని, 'యస్సర్...' అంటూ సెల్ 'ఆఫ్' చేశాడు. కంగారుతో "సాబ్ అయిదు నిమిషాల్లో వస్తారు. పదండి, కూర్చోండి..." అంటూ అటు ఇటూ తిరగసాగాడు.

"కుండల పైసలు బాంచన్"

యస్సయి తలతిప్పి చూశాడు... "ఊ... మీటింగయినంక యిస్తరులే, నోర్ముయ్" అన్నాడు యస్సయి.

'సంతకు బోవాల, పొద్దెక్కింది బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న.

యస్సయి వినలేదు. అతని వెనుక నున్న పోలీసతను విన్నాడు.

"రేయ్, కుమ్మరోడా... నీ పైసలెటూ పోవుగాని, యిప్పుడు పెద్దొరొస్తుండు. చలివేంద్రం మీటింగుంది. నువ్ సంతల కుండలమ్ముకొని గమ్మునొచ్చెయ్, ఎంతన్నవ్?" అన్నాడు.

"పది కుండలు, తమరి దయ... గరోబోన్ని బాంచన్"

"సర్లే, నువ్ గమ్మునొచ్చెయ్, పో... పో..." అన్నాడో పోలీస్.

కుమ్మరెంకన్నకు కూడా కుండలమ్ముకొని వస్తే మంచిదనిపించింది. మిగిలిన కుండలన్నీ పగ్గంతో బిగించి, కావిడి నెత్తుకొని బయటపడ్డాడు.

ఎండచుర్రుమంటూంది. తార్రోడ్డు అప్పటికే కాకెక్కింది 'సోటుందో, ఎవురన్నా కొట్టేసిర్రో...' అనుకుంటూ పరుగులా నడక సాగించాడు.

సంత దగ్గరకొచ్చేసరికి దమ్మొచ్చింది. చెమట పట్టింది. తను కుండలు పెట్టుకునే చోట ఖాళీగా కన్పించడంతో కొండెక్కినంత సంబరమేసింది. కావిడి దించి కండువాతో మొహం తుడుచుకుంటుంటే "ఆలిసెవయిందేరా తమ్మి...." కుడిపక్కన అడవి ఉసిరికాయలు అమ్ముకుంటున్న పడిగె సమ్మక్క అంది.

"టేసన్ల బేరవయిందక్కా..' అని, పగ్గం విప్పి కుండలన్నీ వరుసన పేర్చి చుట్టూ చూశాడు.

జనం అప్పటికే కిక్కిరిసి ఉన్నారు. ఎండాకాలం అయినందున పొద్దుటి పూటే ఎక్కువ సందడి ఉంటుంది. కేకలు, అరుపులు, పరుగులు, పలకరింపులతో... సంత – సంతలా ఉంది.

కుమ్మరెంకన్న. కుండల వెనుక గుండురాయి మీద కూచున్నాడు. తన కుండల కేసి ఎవరన్నా చూస్తుంటే అతనిలో ఆశ మిణుక్కుమంటూంది. కాని కుండకొనమని ఎవర్నీ అడగడు. మొదట్లో అడిగేవాడే!" కుండలోయ్ కుండలు.. కుండలు కొనండయ్యా.. అయ్యా కొనండి....." అంటూ గొంతు చించుకునేవాడు. ఒకరిద్దరు అడ్డం తిరిగేసరికి చెంపలేసుకొన్నాడు.

''కుండలు కనవడతన్నయిగా... మళ్ళీ, నీ అడుగుడేంది?... అడిగినంతలో కొంటారా?.... కావాల్సొస్తే ఊకుంటరా?... నువ్వేం అడగమాక." అన్నది పడిగె సమ్మక్క. అప్పట్నుంచీ గమ్మునుంటూ వచ్చే పోయ్యే వాళ్ళను ఆశగా చూడటం అలవాటు చేసుకొన్నాడు.

''నీళ్ళకుండలున్నయా?'' కూరగాయల సంచితో వచ్చినతను కుండల్ని చూస్తూ అన్నాడు.

"ఆ.. ఉన్నయి సారూ..." అంటూ గుండురాయి మీంచి లేచి ముందుకొచ్చి ఓ కుండనందుకొని, మరో చేత్తో కొట్టి చూయించాడు. కుండ పగులుడుంటే వచ్చే శబ్దానికీ, లేకుంటే వచ్చే శబ్దానికి గల భేదం అతనికి తెలుసు!

"మీకు ఫ్రిజ్ ఉందిగా'' కూరగాయలతని పక్కగా నున్నతను అన్నాడు.

"ఆ.. ఉంది.. దాంతో పాటు తొమ్మిది గంటల 'కరెంట్ కట్' కూడా ఉంది." తేలికగా నవ్వేస్తూ, "జనానికి ఈ ఎండాకాలం కుండలేగతి" అన్నాడు.

''ఆ నీళ్లయినా మూడ్రోజులకోసారి వస్తున్నాయి.'' ప్రక్కనున్నతను.

కూరగాయల సంచీ అతను తలూపుతూ, కుమ్మరెంకన్న చేతిలోని కుండనందుకొని 'ఎంత?" అన్నాడు.

"ముప్పయి..."

"మట్టికుండరా... మైనంతో చేసిందేం కాదు, ఏందా రేటు? '' వెక్కిరింతగానూ, కోపంగానూ అన్నాడు పక్కనున్నతను.

"కాదన్నానా బాంచన్.. ధరలెట్లా మండుతున్నయో.... చదువుకొన్న సాములు.. తవరికి తెల్వదా... పోనీ పాతికియ్యండి." అన్నాడు కుమ్మరెంకన్న.

"పదిహేను చేసుకో...."

"ఇంకో అయిదు... ఇరవయ్యన్నా యియ్యండి.... మట్టి రేటు మా మండి పోతాంది, బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న.

"నీళ్ళు కారితే వాపసిస్త" అని ఇరవై రూపాయలిచ్చాడు కూరగాయలతను. ఆ పక్కనున్నతను అదే ధరకు మరొకటి తీసుకున్నాడు.

పొద్దు తిరిగింది. ఎండమోహం మీద పడుతోంది. కుండలు చాలా వరకు అమ్ముడుపోయాయి. బేరం బాగా సాగినందుకు అతనికి సంతోషంగా ఉంది. గుండురాయి మీద కూచొని బోడ్లో దోపుకున్న గుడ్డసంచీలోని డబ్బులన్నీ కండువాలో పోసి, నెమ్మదిగా లెక్కపెట్టుకొన్నాడు. మళ్లీసంచిలో ఉంచి, జాగర్తగా బోడ్లో దోపుకున్నాడు. పై నుంచి పంచె బిగించాడు.

"బోని బేరం మంచిదే రబ్బీ..." తన యింటి పెరటిలో

కాసిన బొప్పాయి కాయల్ని, తన పిల్లలు తినేందుకు ఒకటి అడిగినా, యివ్వకుండా సంతకు తెచ్చి అమ్ముకుంటున్న దూదేకుల హుస్సేన్ నవ్వుతూ అన్నాడు. సమ్మక్క సుత నవ్వింది. కుమ్మరెంకన్న గుండెల్లోనూ నవ్వుంది. కాని నవ్వలేదు.

"పోలీసాయన బోణీ... మా రాజు సల్లగుండాల... ఇకబోత నక్కా.. టేసన్ల పైసలదుక్కొనేసరికి ఏ యాళయిద్దో... పిల్దానికి మాతర్లు సుత కొంచకపోవాల... మీ మర్దలసలే కంగారు మన్సి...." అంటూ లేచి మిగిలిన కుండల్ని పగ్గంతో కావిడికి కట్టుకొని వెనుదిరిగి రోడ్డెక్కెడు కుమ్మరెంకన్న.

పోలీస్ స్టేషన్ దాపుకొచ్చేసరికి పొద్దు పూర్తిగా వాలిపోయింది. పొద్దున వేసి ఉన్న టెంట్ తీసేశారు. చలివేంద్రంలో ఒకతను నీళ్లుపోస్తూ కనిపించాడు. తానిచ్చిన కుండలు వరసలో నిలుచున్న పెద్దమ్మ తల్లుల్లా కనిపించాయి. దగ్గరగా వెళ్లి గ్లాసందుకొని నీళ్లుపడుతూ, "నీళ్లు సల్లగుండయి గదూ?... కుండలు నేనే యిచ్చిన..." అంటూ నీళ్లు తాగి స్టేషన్‌లోకి నడిచాడు.

ఆవరణలో నలుగురైదుగురు పోలీసులు మాట్లాడుకొంటున్నారు. లోపల ఎవరో పెడబొబ్బలు పెడుతూ ఏడుస్తున్నారు. ఎవర్నో కొడుతున్నట్టుగా ఉంది.

"కాల్మొక్త బాంచన్" అంటూ కావిడినో పక్కగా ఉంచి, తలగుడ్డ తీసి నడుముకు బిగించి చేతులు కట్టుక నిలుచున్నాడు కుమ్మరెంకన్న.

"ఏంట్రా... ఎందుకొచ్చినవ్?" ఓ పోలీసతను పోతూ అడిగాడు.

"పొద్గాల కుండలిచ్చిన బాంచన్."

స్టేషన్ ముందు గదిలో పొడవాటి బల్లముందు కూచొని, రాసుకునే రైటర్ తలెత్తి చూశాడు. "రేయ్ కుమ్మరోడా.. యిటు రా..." అంటూ సైగ చేశాడు.

కుమ్మరెంకన్న ఆశగా లోనికెళ్ళి బల్లపక్కగా నిలుచున్నాడు. రైటర్ కుర్చీకి ఎదురుగా ఉన్న పొడవాటి బెంచీ మీద కూచున్న నలుగురు పోలీసులు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. బల్లమీదున్న టేప్ రికార్డర్‌లోంచి ఉదయం చలివేంద్రం ప్రారంభోత్సవ సభలో ఎస్.పి. గారిచ్చిన ఉపన్యాసం వినిపిస్తూంది.

".....పోలీస్ ఒక చలివేంద్రం లాటివాడు. దాహం తీర్చే నీటి చెలమ. ప్రజా క్షేమమే అతని ఉద్యోగధర్మం. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాల్ని ఫణంగా పెడుతున్న వాడు. న్యాయాన్ని తన రెక్కల నీడలో.... "రైటర్ టక్కున టేప్ రికార్డర్ నాపుచేసి, కుమ్మరెంకన్న కేసి చూస్తూ కనుబొమ్మలెగరేశాడు.

"కుమ్మరోణ్ణి బాంచన్.... పొద్గాల కుండలిచ్చిన...."

"ఎంతరా...."

"పెద్ద కుండలు పది సారూ... బయటయితే మూడొందలు ఎటూ బోవు.. యిగ తమరి దయ బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న.

రైటర్ బల్ల సొరుగులాగి, తెల్లకాగితం తీసి రశీదు రాసి, "పైసలు ముట్టినట్టు ముద్రేయరా..." అన్నాడు.

"నా పేర్రాస్త, బాంచన్... రేత్రి బడిల నేర్సుకున్న." అన్నాడు కుమ్మరెంకన్న.

"దెహె...చెప్పింది చెయ్, ఏలు ముద్రేయ్" అంటూ తానే కుమ్మరెంకన్న బొటన వేలందుకొని ముద్రేయించాడు రైటర్.

"పేరేందిరా?"

"కుమ్మరెంకన్న అంటరు బాంచన్"

రైటర్ రశీదు మీద పేరు రాసి "ఏ ఊరు?" అన్నాడు.

కుమ్మరెంకన్న చెప్పాడు.

ఆ ఊరి పేరు వింటూనే అక్కడున్న పోలీసులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైటర్ చేతిలోని కలం ఆగిపోయింది. అనుమానంగా, బెదురుగా కుమ్మరెంకన్న కేసి దొంగచూపులు చూశాడు. వేలికంటిన సిరా మరకను తలవెంట్రుకలకు తుడుచుకుంటూ కుమ్మరెంకన్న అదేమీ గమనించలేదు.

"బయట కూచో, పిలుస్తా" అన్నాడు రైటర్.

"సిత్తం, బాంచను, సీకటి పడతాంది.. ఆరుకోసులు బోవాల" అన్నాడు కుమ్మరెంకన్న.

"దెహె పో... బయటుండు పో... యస్సయి సాబొచ్చినంక పైసలిస్తడు పో..." కోపంగా చూస్తూ కసిరాడు రైటర్.

కుమ్మరెంకన్న అమాయకంగానూ, భయంగానూ చూశాడందరికేసి, ఇప్పటిదాకా చల్లగా మాట్లాడినతను యిప్పటికిప్పుడే ఎందుకు కోపగించుకుంటున్నాడో తెలీక, దీనంగా చూస్తూ..." అట్టనే బాంచన్" అంటూ బయటికొచ్చి, ప్రహరీగోడ పక్క తన కావిడి దగ్గరగా నిలుచున్నాడు.

పొద్దున తిన్న పట్టెడు మెతుకులు.. అతనికి నీరసంగా ఉంది. ఖాళీ కడుపున నాలుగయిదుసార్లు నీళ్లు తాగడం వల్ల కడుపులో తెములుతోంది. డోకోచ్చినట్టుగా ఉంది. ఎంత త్వరగా డబ్బులిస్తే, అంత త్వరగా ఆ చోటు నుంచి దాటుకోవాలని తప్ప మరో ఆలోచన అతనిలో లేదు. కొద్దిసేపు అటూ, ఇటూ చూసి, మనసాగక, దాపులో నిలుచున్న పోలీసతని కేసి చూస్తూ, చేతులు జోడించి, "దొరెప్పుడస్తడు, బాంచన్" అన్నాడు.

పోలీసతను ఆదోలా, కాటేసేలా చూసి "నీకూ, నాకూ చెప్పొస్తాడ్రా సాబ్... ఆగమంటే మా గీర్మానం పోతన్నవేంది?... ఆ, అసలేంది?" కరిచేలా అన్నాడు.

కుమ్మరెంకన్నకు వెన్నులో వణుకొచ్చింది "ఎవర్ని మెదిపినా కరుస్తున్రేంది?.. లోలోనే గొణుక్కొని, గేటు కేసి చూస్తుంటే జీప్ వచ్చి గేటు ముందాగింది.

జీప్‌లోంచి దిగిన యస్సయని చూసే సరికి, కుమ్మరెంకన్నకు మనసు తేలికయినట్టనిపించింది. పైసలు చేతిలో పడినంత సంబరమేసింది.

యస్సయి సెంట్రీ సెల్యూట్ అందుకొని, గదిలోకి నడిచాడు. ఆ వెంట యిద్దరు పోలీసులూ లోనికెళ్ళారు. కొద్ది సేపటికే వారిద్దరితోపాటు యస్సయి బయటికొచ్చాడు.

''దొర... బాంచను,'' కుమ్మరెంకన్న ఓ అడుగు ముందుకేసి, వంగి చేతులు జోడిస్తూ అన్నాడు.

''ఎవడ్రా...'' అంటూ కుమ్మరెంకన్నను చూస్తూ, "ఆ...ఏంటి బే..." అన్నాడు యస్సయి

"కుమ్మరోడ్ని బాంచన్... కుండల..."

పైసలివ్వలేదా?... ఏయ్, ఖాసిం.... వీడి పైసలివ్వలేదా?.. యిచ్చేయ్" అని యస్సయి అంటుంటే, ఖాసిం అనబడే రైటర్, పరుగులా వచ్చి యస్సయి చెవిలో ఏదో చెప్పాడు.

ఆ మరుక్షణమే... యస్సయి మొహంలో రంగులు మారాయి. ఓ మాదిరిగా వున్న అతని కళ్ళలోకి రక్తపు జీరలొచ్చాయి.

"రేయ్, కుమ్మరోడా... ఏ ఊర్రా నీది?" అన్నాడు.

చెప్పాడు కుమ్మరెంకన్న.

"ఏయ్ 'ఒన్ ఫోర్ టూ' వీడ్ని లోపల పడేయ్" అన్నాడు యస్సయి.

కుమ్మరెంకన్న ఉలిక్కిపడ్డాడు. బెదురుగొడ్డులా చూశాడు. కాళ్లకింద నేల కదులుతున్న రీతి... దడ... వణుకు...." బాంచ.. న్నేను, నేను... పొద్గాల ... కుండ... కుండలిచ్చిన కుమ్మరోన్ని.... కాల్మొక్త బాంచన్" తడారిపోతున్న గొంతుతో, వణుకుతూ అన్నాడు.

"ఏయ్ చుప్" అని కసురుతూ లోనికెళ్ళాడు యస్సయి.

ఆ కసిరింపుకు కుమ్మరెంకన్న ఒల్లు ఝల్లుమంది. రాయిలా, చలన రహితంగా, నిలుచుండిపోయాడు. చూపులు ఎక్కడో... శూన్యంలో... శూన్యంగా.....

అతన్ని చూసే సరికి 'ఒన్ ఫోర్ టూ' కి జాలేసింది. దగ్గరకొచ్చి, "రేయ్, కుమ్మరోడా..." అంటూ రెక్కపట్టుక లాగాడు. అయినా కుమ్మరెంకన్న శూన్యావస్థలోంచి బయటకు రాలేదు. 'ఒన్ ఫోర్ టూ మరోసారి లాగి, పిల్చి, కదల్చి, చిరాకేసి, చెంప 'చెళ్' మనిపించాడు.

కుమ్మరెంకన్న ఉలిక్కిపడి తెలివినపడ్డాడు.

''ఏంద్రా, ఏందట్టయినవ్?.. పానం బాగలేదా, భయమేసిందా? అంటూ భూమ్మీద నున్న కావిడిని తీసి, కుమ్మరెంకన్న చేతి కందిస్తూ, "ఇగ్గో... పొద్దున మీ ఊరి బోడగుట్టన కాల్పులైనయి మీ ఊర్లె అన్నలకి బువ్వలు పెడ్తరటగా... సాబ్ కోపం మీదున్నడు. మీ ఊరోళ్లు దొరికితే బొక్కలేసి కుళ్లబొడవమని ఆర్డరొచ్చింది. పో.... పో... బలుసాకు తినైన బతకొచ్చు. పిల్లలు గల్లోడివి... పో... సి.ఐ. సాబొస్తే చావగొడతాడు. నే సర్దిజెపుతగాని, నువ్ జల్దెల్లు.... ఈ సుట్టుపక్కల కనపడబాక... పో... ఉరుకు..." అంటూ గేటుకేసి నెట్టేశాడు. అలా నెట్టేస్తూనే కుమ్మరెంకన్న బోడ్లో జాగర్తగా దోపుకున్న గుడ్డసంచీ వడుపుగా లాగేశాడు 'ఒన్ ఫోర్ టూ' అనబడే పోలీస్.

ఆ నెట్టుడుకు తూలిపడే వాడల్లా... గేటు పట్టుక నిల్చొని, కుమ్మరెంకన్న బోడ్లో తడుముకొంటూ, మిడిగుడ్లేసుకొని, పోలీసతని కేసి చూస్తూ, "నా పైసలు... పైసలు బాంచను, మీ కాళ్లమొక్కుత. నా పైసలు..." అంటుంటే...

గేటులో ఉన్న సెంట్రీకి లోనుంచి ఓ కనుసైగ అందింది.

అంతే !

గేటు పట్టుక నిల్చొన్న కుమ్మరెంకన్న రెక్కపట్టుక లాగి, రోడ్‌కేసి ఈడ్చి గిరాటేశాడు సెంట్రీ ! ♦

## కవిత

# మొలకెత్తని విత్తనం

- దాముగట్ల హిదయతుల్లా
9652751280



నీళ్లు లేక పొలమారిన  మా పొలం
నా కన్నీటితో  దాహం తీర్చుకుంటోంది
రాయలసీమలో నీళ్ళంటే
మా రైతుల కన్నీళ్లేనని
మా నేలతల్లికిఅప్పుడే తెలిసిపోయినట్లుంది
నీళ్లు లేకుండానే ఏళ్లకు ఏళ్ళుగడిచిపోతున్నాయి
పంటలు పండని మా నేలలో
మా బతుకులు మాత్రం పండిపోతున్నాయి
పండి రాలిపడిన మా శవాలతో
వర్మీ కంపోస్ట్  సేంద్రియ  ఎరువుల కంపెనీలు ఎరువులు
తయారు చేయడానికి
ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయ్
ఎల్లకాలం పంట కంకులతో కలకళలాడాల్సిన
కల్లం గల్లంతై కొల్లబోయిన రియల్ ఎస్టేట్ కి
ఆధారభూతమై నిలుస్తోంది
మా  పొలాలను సోలార్ నాలికలు
ఏలిక పాములై నేలంతా పరచుకున్నాయి
మా రైతులను మా  పొలాలలోనే
వాచ్ మెన్ లుగా కుక్కి పడేశారు
కార్పొ'రేటు' డైనో'సార్లు'
కొద్దోగొప్పో మేం పండించిన విత్తనాలే
కోమటి సత్యమయ్య కొట్టులో
మా చేతికి అందని ధరలతో
మమ్మల్ని వెక్కిరిస్తూ కనపడతాయి
మా  పొలాల్లో చల్లినా మొలకెత్తని విత్త నాలు
ఎన్నో ప్రశ్నార్థకాల మొలకలెత్తి వేటకొడవల్లై
మా కుత్తుకలు కోసేస్తాయి
అపుడు చేసేదిలేక
మాకు మేము భూమిలో పాతుకుపోతాం
అచ్చంగా మొలకెత్తని విత్తనంలా ♦

---

# చిందేద్దాం

- చిరుమామిళ్ళ. ఆంథోని
9866754827



దేశఆర్థిక వ్యవస్థ ఎదమీద పడి
రొమ్ములు చీల్చుకుని పిండుకున్నా
ఆర్థికవేత్తల ఆకలితీర్చే అవార్డులొస్తాయి గానీ,
అభాగ్యుల ఆకలి తీరదు
రైతుల ఆత్మహత్యలు ఆగవు.
ఎన్ని తలకాయలు అవమానంతో నేలకొరిగితే
అభివృద్ధి రేఖ తల ఎత్తుకుంటుంది!?
నిరుద్యోగుల కడుపుమంటతో చలికాచుకునే  పాలకులు,
క్రుళ్ళిన శరీరరాన్ని
గంధం చెక్కతో కాల్చి మోక్షానికి మార్గాలు వెతికే
మనువాదులు,
అధికారుల అవినీతి,
పాలకుల ధనదాహం,
ప్రజల నిర్లక్ష్యం
ఆకాశమంత కోడెనాగై
వేయిపడగల నుంచి
విషవాయువులు కక్కుతుంటే
క్యాన్సర్ కోరలనుండి కాపాడేందుకు
మన పిల్లలను శవపేటికల్లో భద్రపరుద్దాం.
చచ్చిన పిల్లలు ఉలిక్కిపడి లేచేలా,
గుండెలవిసేలా పాడే తల్లి గొంతును
తీన్మార్ డప్పు లో ముంచేద్దాం.
చీప్ లిక్కర్ తో నరాలకు శక్తి నింపి
దేహం మొద్దుబారేలా
గంగిరెద్దులా నడివీధుల్లో చిందేద్దాం. ♦



# నూతన సంకేతాలు, ముందున్న సమరాలు

- తెలకపల్లి రవి

అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు ఆరు నెలల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికల పోటీ ముందస్తు చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. మోడీ గ్రాఫ్ పడిపోతున్నదనీ, ఆయన విధానాల ఫలితంగా దెబ్బతిన్న విస్తార తరగతుల ప్రజానీకంలో ఆగ్రహం, అసంతృప్తి రగులుతున్నాయని తేలిపోయింది. 2014లో అధికారం చేపట్టిన తర్వాత కొన్ని విజయాలు చవిచూసిన బిజెపి ఢిల్లీలోనూ, బీహార్‌లోనూ దారుణంగా దెబ్బతినకపోలేదు. కాని కాంగ్రెస్‌తో తలపడి ఓడిపోవడం ఇదే ప్రథమం. ఇక అధికారచ్యుతి తర్వాత వరుసగా దెబ్బలు తిన్న కాంగ్రెస్ కోలుకునే క్రమంలోనూ ఇదో పెద్ద సానుకూల పరిణామం. కష్టకాలంలో లభించిన వూరట అని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్వయంగా వ్యాఖ్యానించారు. మరీ ముఖ్యంగా ఆయన అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత అసలే విజయాలు లేవు. గుజరాత్‌తో హోరాహోరీ సవాలు విసిరారు గాని ఓడించలేకపోయారు. కర్ణాటక ఎన్నికల పోరాటంలో విఫలమైన తర్వాత జెడిఎస్‌తో కలసి మిశ్రమ ప్రభుత్వం ఏర్పర్చ గలిగారు. ఇప్పుడు మూడు రాష్ట్రాల్లో బిజెపిపై ముఖాముఖి పోటీలో ఆధిక్యత సంపాదించ గలిగారు. మధ్య ప్రదేశ్‌లో శివాజీ సింగ్ చౌహాన్ నాయకత్వంలో పదిహేనేళ్లుగా బిజెపి పాలన చేస్తున్న చోట్ల వున్న ప్రజాగ్రహాన్ని కూడా కాంగ్రెస్ సంపూర్ణంగా ఉపయోగించు కోలేకపోవడానికి కారణమేమిటన్న ప్రశ్న వుండనే వుంటుంది. ఈశాన్యాన తన చేతుల్లో వున్న ఒకే ఒక్క రాష్ట్రం మిజోరాంను చేజార్చుకుంది. ఇక తెలుగుదేశం టిజెఎస్, సిపిఐలతో కలసి మహా/ ప్రజా కూటమి పేరిట హడావుడి చేసిన తెలంగాణలోనూ ఘోరంగా దెబ్బ తినడమే గాక ఆ పార్టీ హేమాహేమీలంతా మట్టి కరవగా టిఆర్ఎస్ అఖండ విజయంసాధించింది.

**బిజెపి గిజగిజ**

నోట్ల రద్దు, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ దుస్థితి, పట్టణాల్లో జిఎస్‌టి వంటి వాటి కారణంగానే తాము ఓడిపోవలసి వచ్చిందని ఈ రాష్ట్రాలలో బిజెపి నాయకులే చెబుతున్నారు. శివాజీ చౌహాన్ ఎంతగానో పెనుగులాడి ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించినా మోడీ పట్ల వ్యతిరేకత కొంప ముంచిందని వారు వాపోతున్నారు. పైన తీసుకున్న నిర్ణయాల వల్లనే ఆయన ఇబ్బందుల పాలైనారని చెప్పే కార్టూన్లు కూడా ప్రచారంలో వాడారు. చావల్‌బాబాగా ప్రచారంలో పెట్టిన చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ ఘోరపరాజయం పాలవడం కూడా ఈ విధానాల ఫలితమేనని అక్కడి గిరిజనులు పేదలు తమకు వ్యతిరేకంగా ఓటేశారని భావిస్తున్నారు. బిజెపి విధానాల వల్ల అగ్రవర్ణాలలోనూ పై తరగతుల వారిలోనూ కూడా వ్యతిరేకత పెరిగిందని ఓట్ల లెక్కలు చెబుతున్నాయి. చత్తీస్‌ఘడ్‌లో మాజీ ముఖ్యమంత్రి అజిత్‌జోగి కాంగ్రెస్‌నుంచి విడివడి ప్రాంతీయ పార్టీగా పోటీ చేసి ఓట్లు చీల్చినా అంత తేడాతో ఓడిపోవడం బిజెపి జీర్ణించుకోలేకపోతున్నది. ఆ పార్టీ

కేంద్ర కార్యాలయం బోసి పోయిందని మీడియా నివేదించింది. ఈ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని అయోధ్య రామమందిర సమస్య మరో సారి రగిలించినా ఫలితం లేకపోవడం సంఘ పరివార్‌కు ఆందోళన కారణమైంది. ఓటర్లపై దీని ప్రభావం ఏమీ లేకపోగా మైనార్టీలలో ఆందోళన పెరిగి కాంగ్రెస్‌కు మరింతగా ఓటు చేసి వుంటారా అని కూడా ఆలోచనలో పడ్డారు. రాహుల్‌గాంధీ తమకు పోటీగా గుళ్లూ గోపురాల ప్రదక్షిణలు చేయడం ప్రభావం చూపిందా అని ఆరా తీస్తున్నారు. ఎన్నికల సమయంలో రామరాజకీయం మొదలు పెట్టడం వల్ల విశ్వసనీయత లేకుండా పోయిందని కొందరు అంటుంటే ఆ సమయంలో మాత్రమే దాన్ని బయిటకు తీసి మిగిలిన సమయంలో కూడా దాన్ని తీవ్రంగా సాగించాల్సిందేనని మరో వర్గం వాదన చేస్తున్నది.

**లోక్‌సభకు సవాలు**

బిజెపి శిబిరం ఇంతగా అతలాకుతలం కావడానికి కారణముంది. ఈ మూడు రాష్ట్రాలలో మొత్తం 65 లోక్‌సభ స్థానాలుంటే 2014 ఎన్నికల్లో 62 ఆ పార్టీకే దక్కాయి. బిజెపి, కాంగ్రెస్ ప్రధానంగా తలపడే తక్కిన రాష్ట్రాలు గుజరాత్, ఉత్తరాఖండ్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లతో కలిపి మొత్తం 106 స్థానాలుంటే బిజెపి 102 తెచ్చుకోగలిగింది. మరో 413 స్థానాల్లో బహుముఖ పోటీ జరిగింది. వీటిలో కూడా ఇప్పుడు ఏదో ఒక విధమైన ప్రతిపక్షం వచ్చేట్టయితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న బిజెపిని వెంటాడుతున్నది. యుపిలోని 80 స్థానాల్లో 71 తెచ్చుకోవడానికి ఎస్‌పి, బిఎస్‌పి చీలిక కారణమైంది. ఇప్పుడు వారిద్దరూ కలిస్తే ఏమవుతుందో ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. అప్పుడు మిత్ర పక్షాలుగా వున్న తెలుగుదేశం, జనసేన వంటివి దూరమైనాయి. ఆర్‌ఎస్‌ఎల్‌పికి చెందిన కుశ్వానా కేంద్ర మంత్రివర్గం నుంచే రాజీనామా చేశారు. పౌర సత్వ నమోదు (ఎన్‌ఆర్‌సి) తతంగం తర్వాత అస్సాంలో ఎజిపి కూడా అభ్యంతరాలు లేవనెత్తుతున్నది. బిజెపిలోనే యశ్వంతసిన్హా, అరుణ్‌శౌరి వంటివారు దూరమైనారు. సిబిఐ, ఆర్‌బిఐ, సుప్రీం కోర్టు సమస్త వ్యవస్థలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ పరిస్థితులలో 272 సీట్లు తెచ్చుకుని కేంద్రంలో అధికారం నిలబెట్టుకోవడం పెద్ద సవాలేనన్న జంకు పట్టుకుంది. అమిత్‌షా, మోడీ జోడి అజేయమైందంటూ జరిగిన ప్రచారంలో పసలేదని తాజా ఫలితాలతో తేలిపోవడం 2019 ఎన్నికలపైనా ప్రభావం చూపించడం అనివార్యమవుతుంది. తెలంగాణకు వీరిద్దరే గాక అగ్రనాయకులంతా తరలి వచ్చి మకాం చేసినా అయిదు స్థానాల నుంచి ఒక్కస్థానానికి పడిపోవడం అది కూడా మతతత్వ విద్వేషానికి పేరు మోసిన రాజాసింగ్ గెలవడం యాదృచ్చికం కాదు. లోపాయికారి స్నేహితుడుగా చెప్పబడిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఫలితాల తర్వాత రామమందిరం వంటి గొడవలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. మజ్లిస్ నాయకుడు ఒవైసీతో దేశమంతటా వున్న ముస్లిముల పరిస్థితి చర్చించానని అన్నిచోట్ల తిరిగి కాంగ్రెస్ బిజెపియేతర కలయిక కోసం పనిచేస్తానని ప్రకటించారు. ఇది కూడా బిజెపికి మింగుడు పడని పరిణామమే.

**తెలంగాణ ఫలితాలు**


తెలంగాణ ఫలితాలకే పరిమితమైతే ఇక్కడ బిజెపి ఒకటి దగ్గరే ఆగిపోవడం, కాంగ్రెస్ కూటమి కట్టినా గతంలోని స్థానాలు కూడా తెచ్చుకోలేకపోవడం వాటి పరిమితులను వెల్లడించింది. ఎపి ముఖ్యమంత్రి తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కేంద్రంగా కెసిఆర్ దాడి చేయడం వల్ల కాంగ్రెస్ ప్రధాన పాత్ర లేకుండా పోయింది. చంద్రబాబు కూడా దాన్ని ప్రోత్సహించి తనే చక్రం తిప్పుతున్నట్టు వ్యవహరించడం కెసిఆర్ వ్యూహానికి సరిపోయింది. వామపక్షమైన సిపిఐ, ఉద్యమ పార్టీ పేరిట పుట్టిన టిజెఎస్ కూడా కాంగ్రెస్ నాయకత్వంలోనే చేరడంతో అదే ప్రధాన పోటీ దారుగా ప్రచారమైంది. ఆ కూటమి సీట్ల సర్దుబాటులో విపరీత జాప్యం, అనైక్యత, చంద్రబాబు చుట్టే తిరగడం, విధానపరమైన చర్చ లోపించడం కూడా టిఆర్‌ఎస్‌కు కలసి వచ్చింది. అది తన సంక్షేమ పథకాలతో పాటు ఉద్యమ కాలపు వాదనలు సెంటిమెంటును పునరుద్ధరించింది. మరోవైపు తెలుగుదేశం అనుకూల మీడియా వర్గాలుచంద్రబాబు భజన చేయడమే గాక బూటకపు సర్వేలతో హడావుడి చేయడం కూడా ఓటర్లపై ప్రభావం చూపింది. తీరా సీమాంధ్ర ఓట్లపై చాలా తర్జనభర్జనలు జరిగాయి గాని ఆ ఓట్లు ఎక్కువగా కేంద్రీకృతమైన జంట నగరాలలోనూ ఖమ్మం మినహా ఇతర సరిహద్దు జిల్లాల్లోనూ కూడా టిఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు తెచ్చుకుంది. బిఎస్‌ఎఫ్/బిఎస్‌పీతోకలసి పోటీ చేసిన సిపిఎం కూటమి ప్రత్యామ్నాయ విధానాలు సామాజిక న్యాయంపై చర్చ తీసుకొచ్చినా ఓట్లలో అతి పరిమితంగానే ప్రభావం చూపి

# కొత్త ఊడ

- శ్రీధర్ చౌడారపు
9440032211

*కాలం కలిసిరాని ఆ సమయంలో*
*ఆత్మవిశ్వాసం మెల్లమెల్లగా ఆవిరయిపోయి*
*కలలు కల్లలయి కరిగిపోతుంటే*
*ఆశల కోటగోడలు నిలువునా కూలిపోతుంటే*

*అప్పులు చేయరాని తప్పులుగా మారి*
*తల కొట్టేస్తామని తర్జనితో బెదిరిస్తుంటే*
*పరువును హత్య చేస్తామని పక్కాగా చెబుతుంటే*



*ఒంటరితనాన్ని వెంటేసుకుని*
*నిరాశదుప్పటిని నిండుగా కప్పుకుని*
*ఓ చీకటిపూట ఊరి కళ్ళు కప్పేసి*
*అయినవాళ్ళను మాటలతో మాయచేసి*
*మౌనంతో కానివాళ్ళ నోళ్ళు మూయించేసి*

*ఊరి పొలిమేరనుంచి దూరంగా సాగిపోతూ*
*తననాదరించి పెంచి పోషించిన*
*గాలీ నీరూ మట్టీ చెట్టూ పుట్టా సాక్షిగా*

*బంధాలనుంచి బాధ్యతలనుంచి*
*సెలవు తీసుకుంటుంది ఓ జీవితం శాశ్వతంగా*

*తెల్లారేసరికి ఊరిచివరి మర్రిచెట్టుకు*
*మరో కొత్త ఊడ మొలుస్తుంది*
*తెల్లబోయిన ఊరు ఊరంతా కెవ్వుమంటుంది*

*రాయని మరణవాంగ్మూలాన్ని*
*మరోసారి మౌనంగా చదువుకుంటూ*
*వెక్కి వెక్కి ఏడుస్తున్న వారసత్వం*
*గోల ఏమీలేక బదిలీ అయిన*
*గోరంత ఆస్తులను చూసి*
*మాటమాత్రం చెప్పకుండా మీదపడిన*
*కొండంత అప్పులను చూసి*
*వెర్రెక్కిపోయి నిలువుగుడ్లు వేస్తుంది* ♦


---

సీట్లు తెచ్చుకోలేకపోయింది. మజ్లిస్ తన ఏడు స్థానాలు నిలబెట్టుకుంది. సంక్షేమ ఫథకాల ప్రచారం మధ్యనే పాలనా పరంగానూ రాజకీయంగానూ అనేక విమర్శలు ఎదుర్కొన్న కెసిఆర్ ఘన విజయం సాధించగలిగారు. వైసీపీ, జనసేన తెలంగాణలో పోటీ చేయలేదు. దానిపై తెలుగుదేశం అనేక ఆరోపణలు చేసింది గాని వారు అధికారికంగా ఎవరినీ బలపర్చలేదు. ఫలితాల తర్వాత మాత్రం అభినందనలు తెలిపారు. తనకు వ్యతిరేకంగా పనిచేసిన చంద్రబాబును ఓడించేందుకు తాము కూడా ఎపిలో వేలు పెడతామని కెసిఆం, కెటిఆర్ ప్రకటించారు. కాంగ్రెస్‌తో తెలుగుదేశం పొత్తుపై రాజకీయ విమర్శలు వచ్చినా ఇతర తోడు లేని చంద్రబాబు ఎపిలో ఈ ప్రయోగం పునరావృతం చేస్తారా అన్నది మరో ప్రశ్నగా వుంది. మోడీతో నాలుగేళ్లకు పైగా జతకట్టి ఇప్పుడే బయిటకు వచ్చిన చంద్రబాబు తానే ఆయనకు వ్యతిరేకంగా అందరినీ సమీకరిస్తున్నానని చెబుతున్నారు. ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం తప్ప ఎలాటి కూటమి ప్రస్తావన లేదని ఎన్నికల తర్వాతే వస్తాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితర జాతీయ నేతలు స్పష్టీకరిస్తున్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నాయకులే సర్దుకున్నారు. తెలంగాణ సారథ్యం మళ్లీ చేపట్టిన కెసిఆర్ కూడా మరో సమాంతర కూటమి కోసం యాత్రలు మొదలుపెట్టారు. మొత్తంపైన భిన్న శిబిరాలపై సమరాలపై ఈ ఫలితాలు చాలా ప్రభావం చూపించడం మాత్రం తథ్యం. మోడీని మళ్లీ ఆకర్షణీయంగా నిలబెట్టడమెలా అని ఒక వర్గం, రాహుల్ విజయాలను ప్రచారం చేసి పోటీగా ఆయనను పెంచడమెలా అని మరో వర్గం మథనం సాగిస్తున్నాయి. ఇవన్నీ తెలుగురాష్ట్రాలపై దేశంపై ఎలాటి ప్రభావం ప్రసరించేది వేచి చూడాల్సి వుంది. అయితే ఫలితాలు వచ్చీ రాకముందే తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ వారి ఫిరాయింపు, టిఆర్ఎస్‌లో లీనమైనట్టు ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరోవైపున తెలుగుదేశం వందమంది అభ్యర్థులను జనవరిలోనే ప్రకటిస్తుందని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ అధినేత జగన్, జనసేనాని పవన్ కళ్యాణ్‌లు ఇప్పటికే విస్తృతంగా పర్యటిస్తూ విమర్శల పదును పెంచుతున్నారు. అందుకే ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ కురుక్షేత్రం అత్యంత ఉత్కంఠ రేకెత్తించనుంది.

*(ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో)* ♦

# వలసపోతోన్న 'అనంత' రైతుకు...

- నవీన్ కుమార్
9951979399



మరింకేమీ పాలుపోక
మళ్లీ ఒకసారి పొలం దగ్గరికొస్తావు

ఇంకొంచెం లోతుగా చీలి నెత్తురు చిప్పిల్లేట్టున్న
నీ నేలపెదవుల్ని, ఆర్తిగా తడిమి
ఆకాశంవైపు చూస్తావు
వట్టిపోయి పిగిలిపోతోన్న మబ్బులవెనక
ఆకలిదప్పులు స్పష్టంగా రూపు కడతాయి
నీ బిడ్డలు కంటోన్న కలలు
లేత బంగారువర్ణంలో కదలాడి కనుమరుగవుతాయి

ఆ క్షణం మొదలు – అన్నీ తారుమారు
ఆకుపచ్చని మేఘంలా నీ ప్రాణనదిని పోషించిన వూరు
నిన్ను కబళించగల మృత్యుకుహరంలా కనబడుతుంది
నెత్తురులో కలగలిసిపోయిన నీ మట్టివాసన
సగంకాలిన దేహాల కమురుకంపుగా తోస్తుంది
వూరి మధ్యని మర్రిచెట్టూ
వూరవతలి మోటబావీ
రచ్చబండా రాముని గుడీ ఒక్కటేమిటి
ఆత్మతో పెనవేసుకుపోయినవన్నీ
నిన్ను బంధించగల
శత్రుసైనికుల్లా కనబడతాయి
అప్పుడిక ఏం చేస్తావు?

రక్తసిక్తమైన బతుకుదారిని చూస్తూ నిశ్శబ్దంగా రోదిస్తావు
భగీరథుడినైనా భంగపరచగల నీ ధిక్కారశక్తిని
విధిరాతకు తాకట్టు పెడతావు
పేగు తెగుతోన్న నొప్పితో నీ గుండె గుక్కపట్టి
'అమ్మా.. అమ్మా..' అంటూ అరుస్తూన్నా
కడుపు చేతబట్టుకుని
అడుగుల్ని కర్కశంగా ఏ కొచ్చిన్ వైపో
బెంగుళూరు వైపో తోస్తావు

నీ వెనక
రొమ్ములెండిపోయి బిడ్డకు పాలివ్వలేని తల్లిలా
వూరు కన్నీరొలుకుతుంది. ♦

---

# ఏకవర్ణ విచ్ఛేదనం

- డా.ఎం.హరికిషన్
9441032212



ఏదీ శాశ్వతం కాదు ఇవాళ్టి నిజంతో సహా
తామరాకు మీది నీటిబొట్టులా ప్రతిదీ అల్పాయుష్షే
నిన్నటివరకూ వేలు పట్టుకొని నడిచిన మౌనాలు
విస్ఫోటనాలై కొత్త అడుగుజాడలు చెక్కుతున్నాయి
వానపాములు సతసహస్ర ఫణులై
భూగోళాన్ని వడిసి పట్టుకొంటున్నాయి
చీకటి గుహల్లో దశాబ్దాలుగా
ఘనీభవించిన మంచు
ప్రవాహమై పోటెత్తుతోంది
ఏదీ ఆగదు , ఏదీ దాగదు
ప్రశ్నల సునామీ ఉక్కిరిబిక్కిరి చేసి
మైదానంలో నిలబెడుతుంది ప్రతిదాన్నీ
ఏకవర్ణ విచ్ఛేదనంతో
సత్యం శాఖోపశాఖలుగా పురివిప్పుకుంటోంది
ఎక్కడ మొదలైందో అక్కడివరకూ తవ్వుకొని
ప్రతిదీ కొత్తగా పురుడు పోసుకుంటోంది ♦

# సాహితీస్రవంతి కవన యాత్ర

- మార్ని జానకిరామ్ చౌదరి
9440338303



అనాదిగా మానవుడికి ప్రకృతితో అనుబంధం విడదీయరానిది. నేటి ఆధునిక యాంత్రిక జీవనం మానవుణ్ణి ప్రకృతికి దూరం చేస్తుంది. అనేక ఒత్తిళ్ళతో కూడిన దైనందిన కార్యక్రమాల నుండి విడివడి, ప్రకృతి ఒడిలో సేదదీరటానికి విహారయాత్రలు ఎంతగానో దోహదపడతాయి. అందునా పచ్చని చెట్లతో, కొండలతో, జలపాతాలతో కూడిన ఆహ్లాదకరమైన అటవీప్రాంతానికి విహారయాత్ర అంటే మరింత ఉత్సాహాన్నిస్తుంది. అదిగో, సరిగ్గా అలాంటి 'వన విహారయాత్ర' కు శ్రీకారం చుట్టింది కాకినాడ సాహితీస్రవంతి.

'నెలనెలా సాహిత్యహేల' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు డా. వుయ్యపు హనుమంతరావు, అధ్యక్ష, కార్యదర్శులు డా. జోశ్యుల కృష్ణబాబు, మార్ని జానకిరామ్ చౌదరి, బొల్లోజుబాబా ఇతర సభ్యులు కలిసి, చర్చించి జిల్లాలోని సహజసిద్ధమైన అటవీ అందాలకు, ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి చెందిన ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం, మారేడుమిల్లి సందర్శనకు విహారయాత్రను ఖరారు చేయటం జరిగింది.

డిసెంబరు 9వ తేది ఆదివారం ఉదయం 7 గంటలకు సాహితీ మిత్రులంతా కాకినాడ నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో బయలుదేరాం. కాకినాడ, పెద్దాపురం సాహితీస్రవంతి సభ్యులే కాకుండా ఇతర సాహిత్య అభిమానులతో కలిసి దాదాపు 35 మంది బృందం ఉత్సాహంగా యాత్రలో పాలుపంచుకొన్నాం. బస్సు బయలుదేరిన వెంటనే పరిచయ కార్యక్రమం అనంతరం 'సాహితీస్రవంతి'పై గరికపాటి మాష్టారు వ్రాసిన గేయాన్ని మేడిశెట్టి శ్రీరాములు మధురంగా గానం చేశారు.

అనంతరం మార్ని జానకిరామ చౌదరి 'క్విజ్' కార్యక్రమాన్ని ప్రారంభించి కొన్ని సరదా ప్రశ్నలతో పాటు సాహిత్యానికి, విజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను సంధించి, సరైన జవాబులు చెప్పినవారికి చిన్న చిన్న బహుమతులతో అభినందించారు. మధ్యమధ్యలో మధునాపంతుల సత్యనారాయణ మూర్తితోపాటు 84 ఏళ్ళ వయస్సున్న గరికపాటి మాష్టారు హాస్యస్ఫోరకమైన ఛలోక్తులతో కడుపుబ్బా నవ్విస్తూ, యువకులకు ఏమాత్రం తీసిపోకుండా హుషారుగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరచింది.

సరిగ్గా ఉదయం 9 గంటలు అయ్యేసరికి మార్గమధ్యంలో 'సింగారమ్మ చింత' అనే గ్రామానికి చేరుకున్నాం. విశాలమైన ప్రదేశంలో, ఆహ్లాదకర వాతావరణంలో వెంట తెచ్చుకున్న అల్పాహారాన్ని భుజించి, తేనీరు సేవించి, పది నిమిషాల పాటు సేదదీరాం. అక్కడ చెట్లమీద, రహదారి ప్రక్కన అనేక వానరాలు మాకు దర్శనమిచ్చాయి. యాత్రికులు వేసిన రొట్టెలు, అరటిపండ్లు వంటివి తింటూ, సందర్శకుల చేతుల్లోని ఆహార పదార్థాలను లాక్కోవటానికి ప్రయత్నిస్తూ హడావుడి చేస్తున్న ఆ కోతులకు వీడ్కోలు పలికి తిరిగి ప్రయాణం కొనసాగించాం. మార్గమధ్యంలో కొండల నడుమ నిర్మించిన భూపతిపాలెం రిజార్వాయరును తిలకించాం.

ప్రయాణానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువస్తూ డా॥ జోశ్యుల కృష్ణబాబు పైకి ఒక అర్థాన్ని స్ఫురింపజేస్తూ, అంతర్లీనంగా మరొక భావంతో కూడిన పొడుపు కథల వంటి పద్యాలను రాగయుక్తంగా వినిపించి, చక్కగా వివరించారు. రోడ్డుకి రెండువైపులా విస్తరించి ఉన్న అడవిని వీక్షిస్తూ, పల్లెల్నీ, వాగుల్నీ, వంకల్నీ దాటుకుంటూ మండల కేంద్రమైన రంపచోడవరం చేరుకున్నాం. అక్కడి నుండి సుమారు 4 కిలోమీటర్లు దూరంలోని 'రంప' అనే గ్రామానికి చేరుకొని, రాతితో నిర్మించిన పురాతన శివాలయాన్ని సందర్శించాం. ఈ ఆలయం 14వ శతాబ్దానికి చెందినదిగా పేర్కొంటారు. స్వాతంత్ర్య వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంతంలో స్థావరమేర్పరుచుకొన్నప్పుడు ఇక్కడి శివలింగానికి పూజలు నిర్వహించేవాడని స్థానికుల కథనం. ఆలయ దర్శనానంతరం ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న రంప జలపాతం వద్దకు కాలినడకన బయలుదేరి వెళ్ళాం. ఎక్కడో కొండలలో పుట్టిన ఈ జలపాతం సంవత్సరం పొడవునా నీటి ప్రవాహాలతో పర్యాటకులను ఆకర్షిస్తూ ఉంటుంది. అనేక ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులతో నిండిన ఆ ప్రాంతం ఎంతో సందడిగా, ఆహ్లాదంగా ఉంది. చుట్టూ ఎత్తైన కొండలతో, పచ్చని చెట్లతో ప్రశాంతమైన వాతావరణంలో ఈ జలపాతం నుండి ప్రవహిస్తున్న సెలయేటి శబ్దాలు ఒక రకమైన అనుభూతికి, ఆనందానికి గురిచేసాయి.

ఆ అనుభూతిని గుండెల నిండా నింపుకొని, బస్సు వద్దకు చేరి రంప నుండి సుమారు 29 కి.మీ. దూరంలో ఉన్న మారేడుమిల్లి బయలుదేరాం. ఒక గంట ప్రయాణించిన తర్వాత తూర్పు కనుమలలోని దట్టమైన అటవీ ప్రాంతంలో నెలకొన్న మారేడుమిల్లికి చేరుకున్నాం. అటవీశాఖ ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తోంది. మారేడుమిల్లి నుండి భద్రాచలం వెళ్ళే రహదారిలో ఎన్నో సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. 'వాలి–సుగ్రీవ వన మూలికా కేంద్రం', నందనవనం, జల తరంగణి, అమృతధార జలపాతాలు చూడదగిన ప్రదేశాలు. రాత్రి సమయాల్లో బస చేయడానికి 'వన విహారి' ఉడెన్ కాటేజీలు ఆకర్షణీయంగా ఉన్నాయి.

ఇక మారేడుమిల్లి సెంటరు నుండి 7 కి.మీ.లు ప్రయాణించిన తర్వాత 'జల తరంగిణి' జలపాతం వద్దకు చేరుకొన్నాం. అప్పటికి సమయం మధ్యాహ్నం 1.00 గంట కావటంతో దగ్గరలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్ల మధ్య కార్పెట్లను పరచుకొని, వెంట తెచ్చుకొన్న ఆహారపదార్థాలను మహిళామణులైన మార్ని పద్మావతి, అద్దేపల్లి సుధారాణి, గట్టి సత్య, అసీఫా, కుమారి అనల కలిసి కొసరి కొసరి వడ్డిస్తుంటే అందరం హాయిగా, ముచ్చట్లు చెప్పుకుంటూ సమిష్టిగా 'వనభోజనం' చేసాం. 'వనభోజనం' చేశాం. అనంతరం 'కవన భోజనానికి' తెరతీస్తూ డా. హనుమంతరావు గారి అధ్యక్షతన కవి సమ్మేళనం ప్రారంభించాం. ఈ సందర్భంగా 'గనారా' మాట్లాడుతూ "కవులను, సాహిత్యాభిమానులను కలుపుకొని 'సాహితీస్రవంతి కవనయాత్ర' ను నిర్వహించాలన్న కోరికను తరచూ డా॥ అద్దేపల్లి రామమోహనరావు వ్యక్తం చేసుండేవారని, కాని అనివార్య కారణాల చేత ఆయన ఉండగా అది నెరవేరలేదని, ఆయన నిష్క్రమణ తర్వాత గత 3 సంవత్సరాలుగా ఈ కవనయాత్రను నిర్వహిస్తున్నామని అన్నారు. అద్దేపల్లి స్ఫూర్తితో సామాజిక చైతన్య స్ఫోరకమైన సాహిత్య కార్యక్రమాలను సాహితీస్రవంతి ద్వారా నిర్వహించగలుగుతున్నామన్నారు.

ప్రముఖ కవి బొల్లోజు బాబా తన కవిత వినిపిస్తూ ***"తడిసిన సీతాకోక చిలుక/ కవిత్వంపై వాలి రెక్కలల్లార్చింది"*** అంటూ ఆకుపచ్చని తడిగీతం శీర్షికతో హృదయాల్ని స్పృశించారు. డా॥ వుయ్యపు హనుమంతరావు 'పని మనిషి' పై వ్రాసిన కవితలో ఆదివారాలు, పండుగ సెలవులు, బోనస్‌లు లేకుండా ఎటువంటి ఇబ్బందులెదురైనా ఓర్పుగా, నేర్పుగా పనిచేసుకుంటూ పోయే పనిమనిషి 'శ్రమైక సౌందర్యానికి ప్రతీక' అంటూ వివరించారు. సుంకర గోపాలయ్య తన కవితలో ***'ఉదయం కిటికీ తలుపు తీసాక నువ్వు మాయం'*** అంటూ చక్కటి అభివ్యక్తితో కూడిన కవితను వినిపించారు.

అద్దేపల్లి ప్రభు ***'తాడిచెట్టు మొదల్లోన కల్లుకుండే చందమామ/ పంటచేలు వెన్నుమీద ఝుల్లుమనే గాలితేమ/ చింతచెట్లు మొదల్లోన కునుకుతీసే గూడకొంగ/ చెరువులో రెల్లుపొదల్లో గంతులేసే చేపపిల్ల"*** అంటూ ఒక పాటని హృద్యంగా ఆలపించి శ్రోతల్ని పరవశింపజేసారు. డా॥ జోశుల కృష్ణబాబు 'పుస్తక పఠనం నన్ను తీర్చిదిద్దింది ఇలా' అంటూ.. ***ప్రశ్నించు తత్వమ్ము పలుకులో నేర్పించి/ కార్యకారణతను గట్టి పరచి/ మనసులో మాలిన్యమంతయున్ దొలగించి/ స్వచ్ఛత నాయందు చక్కపరచెనని–*** తాను రచించిన పద్యాన్ని అత్యంత హృద్యంగా వినిపించారు.

మార్ని జానకిరామ చౌదరి 'మా ఊరి బల్లకట్టు' శీర్షికతో తన బాల్యంలో బల్లకట్టు (దోనె)తో పెనవేసుకొన్న జ్ఞాపకాలను వివరిస్తూ... ***'ఒక్కసారొచ్చి ఒడిలో సేదదీరమంటూ/ కలవరిస్తోంది/ గుండెలో గూడు కట్టిన దిగులు/ వరదలా పొంగితే/***

కవిత

## నాలో నేను

- అడపా రామకృష్ణ
9505269091



*ఈ బాహ్య ప్రపంచంలో*
*నేను చూస్తున్నది*
*భ్రమకాదు, నిజం*
*అది నా స్వాభావిక నైజం*
*సామాజిక పోకడల్ని*
*అసమానతల ఎత్తుగడల్ని*
*నిలువరించ లేకపోవడం*
*అది నా బలహీనతలో ఓ భాగం*
*చూస్తూ చేష్టలుడిగిపోవడం*
*నా మానసిక దౌర్బల్యం*
*మరణానికి దోహదపడేది*
*ఏ ఆయుధమైనా ఒక్కటే*
*ప్రాణాలు ఫణంగా పెట్టుకోవడం*
*ప్రేమనే మధురలాలసలో*
*రెండక్షరాల్ని సమాధిచేయడం*
*చుట్టూ కీటకంలా పరిభ్రమిస్తూ*
*అనైతికంగా అతుక్కుపోయి*
*అకృత్యానికి ఒడిగట్టడం*
*పగ, ద్వేషంతో రగిలిపోవడం*
*చూస్తూనే వున్నాను - నిస్తేజంగా*
*ఒకటి మాత్రం తెలుసు నిజంగా*
*నాలోనేను అంతర్గతంగా*
*చూసుకోలేకపోవడమే*
*అది నా చేతనావస్థకు ముగింపు!*

♦

***చుట్టూ పేరుకొన్న దుఃఖపు మడుగులో/ కాగితం పడవలా తేలుతోంది/ మా ఊరి బల్లకట్టు/ కాలవాహినిలో కలిసిపోతూ"*** అంటూ ఆర్ధ్రతను వ్యక్తం చేసారు.

యువకవి వంగలపూడి శివకృష్ణ– ఒకరు వ్రాసిన కవితను వేరొకరు తస్కరించే కుహనా కవులపై సంధించిన **"అక్షర చౌర్యం"** అనే కవితాస్త్రం ఆలోచింపచేసింది. జూనియర్ ఘంటశాలగా పేరొందిన మేడిశెట్టి శ్రీరాములు వనభోజనాలపై పాడిన గేయంతో పాటు, అద్దేపల్లి వారు 'బాల్యం'పై వ్రాసిన గజల్‌ను మధురమైన గళంతో పాడి అలరించారు.

మధునాపంతుల సత్యన్నారాయణ మూర్తి తన మనవరాళ్ళను ఉటంకిస్తూ నేటి విద్యావిధానంపై చదివిన కవిత అందరినీ ఆలోచింపజేసేదిగా ఉంది. పిఠాపురం నుండి వచ్చిన కృష్ణదేవరాయలు మధురమైన గీతాలను ఫ్లూట్‌పై వినిపించి, శ్రోతల్ని తన మురళీరవంతో మంత్రముగ్ధుల్ని చేయటం ఈ కార్యక్రమానికి వన్నెతెచ్చింది. ఇంకా గరికపాటి మాష్టారు, ఇంద్రగంటి నరసింహామూర్తి, కొత్త శివ, డా॥ కోటి వంటి సాహితీమిత్రుల కవితలతో మారేడుమిల్లి అటవీప్రాంతం సాహితీ గుబాళింపులతో పరిమళించింది.

ప్రభు, ఇబ్రహీం, పెండ్యాల మల్లేశ్వరరావు, సయ్యద్‌సాలార్ సాహిత్య, సామాజిక అంశాలపై జరిపిన చర్చ ఆసక్తిదాయకంగా సాగింది. నేషనల్ హైడ్రాలజీ సంస్థలో సైంటిస్టుగా పనిచేస్తున్న తపర్తి విజయ్ నీటి సంరక్షణతోపాటు త్రాగునీటి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. డా॥ కృష్ణంరాజు, సత్యం, అప్పసాని రామకృష్ణ నేటి తెలుగు సినిమా తీరుతెన్నులపై ఆసక్తికరమైన విషయాలను తెలియజేసారు.

కవి సమ్మేళనం ముగిసిన అనంతరం దగ్గరలో ఉన్న "జల తరంగిణి" జలపాతం వద్దకు చేరుకున్నాం. సెలవురోజు కావటంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అనేకమంది సందర్శకులతో సందడిగా ఉంది. పైనుంచి జాలువారుతున్న జలపాతాన్ని సందర్శించి, నీటితుంపర్లు శరీరాన్ని స్పృశిస్తుంటే, చుట్టూ పచ్చని చెట్లతో నిండిన ప్రకృతి రమణీయతకు అవ్యక్తమైన అనుభూతికి లోనైన మేమంతా కాసేపు అక్కడ గడిపి, కొండవాలుపై పెంచుతున్న కాఫీతోటల్ని సందర్శించి తిరుగు ప్రయాణమయ్యాం.

ఒక రోజంతా ప్రకృతి ఒడిలో పరవశించిన మేమంతా అనేక మధురస్మృతుల్ని, అనుభూతుల్ని నెమరువేసుకుంటూ, ఇంతమందిని ఒకటిగా కలిపిన సాహితీస్రవంతికి కృతజ్ఞతలు చెప్పుకుని రాత్రి 9 గంటలలోపు అంతా క్షేమంగా ఇళ్ళకు చేరుకున్నాం.

♦

నివేదిక

# అనంతపురంలో కందుకూరి నూరవ వర్ధంతి




తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం నూరవ వర్ధంతిని పురస్కరించుకొని అనంతపురం జిల్లాలో ఐద్వా, ఎస్.ఎఫ్.ఐ., డి.వై.ఎఫ్.ఐ., యు.టి.ఎఫ్. ఇతర ప్రజాసంఘాల చొరవతో వివిధ చైతన్య కార్యక్రమాలు జరిగాయి. నవంబరు 18 న ఈ నాలుగు సంఘాలు జిల్లాలోని అనేక సాహిత్య సంస్థలు, ఇతర ప్రజాసంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ గౌరవాధ్యక్షులుగా, శ్రీక ృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.సి.ఎస్.శుభ అధ్యక్షులుగా, ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి ప్రధాన కార్యదర్శిగా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి కోశాధికారిగా దాదాపు 75 మంది ప్రముఖులతో కందుకూరి శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పడింది. "ప్రాతఃస్మరణీయుడు కందుకూరి" శీర్షికతో ప్రచురించిన బుక్ లెట్ ను ఆచార్య ఎం.సి.ఎస్.శుభ, రచయిత సింగమనేని నారాయణ, ఐద్వా నాయకులు నవంబరు 22 న శ్రీక ృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు. కందుకూరి సందేశ యాత్ర పేరుతో ఐద్వా, ఎస్.ఎఫ్.ఐ., డి.వై.ఎఫ్.ఐ., నాయకులు నవంబరు 26 నుండి డిసెంబరు 2 వరకు బస్సు యాత్ర జరిపి జిల్లా లోని 36 గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు వీరేశలింగం చేసిన క ృషిని వివరించి చైతన్యపరిచారు. నవంబరు 26 న అనంతపురం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అదనపు ఎస్.పి. చౌడేశ్వరి జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ప్రారంభసభలో ఆమెతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధనాచార్యులు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్, రచయిత సింగమనేని నారాయణ, విశ్రాంత ప్రిన్సిపల్ బాలభారతమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 36 గ్రామాల్లోని విద్యాలయాల్లో ప్రత్యేకించి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పర్యటించి, అక్కడే భోజనాలు చేసి, నిద్రపోయి అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొనే ప్రయత్నం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, డిసెంబరు 17 న అనంతపురం లో జరిగే సాహితీ సదస్సుకు విద్యార్థులను ఆహ్వానించారు. వివిధ ప్రాంతాలలో జిల్లా లోని రచయితలు నందవరం కేశవరెడ్డి, ఏలూరి యంగన్న, జూపల్లి ప్రేంచంద్, కెరే జగదీష్, ఇ.రాఘవేంద్ర, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొని కందుకూరి వీరేశలింగం మహిళలకు చేసిన మహత్తర సేవ గురించి మాట్లాడారు. కందుకూరి వీరేశలింగం వర్ధంతి కార్యక్రమాల వాల్ పోస్టరును జిల్లా ఎస్.పి. అశోక్ కుమార్ ఆవిష్కరించారు.

1881 వ సంవత్సరంలో ప్రథమ వితంతు పునర్వివాహం జరిగిన డిసెంబర్ 11 వ తేదీని గుర్తు చేసుకుంటూ ఈ

డిసెంబర్ 11 వ తేదీ అనంతపురం నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద దాదాపు 4 వేల మంది విద్యార్థినులతో పెద్ద బహిరంగసభ ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి అధ్యక్షతన జరిగింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జ్ ఉపకులపతి ఆచార్య శుభ, సన్నాహక కమిటీ గౌరవాధ్యక్షుడు సింగమనేని నారాయణ, రెడ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి భానుజ, బి.ఎస్.ఎన్.ఎల్. ఉద్యోగిని రమాదేవి తదితరులు పాల్గొని స్త్రీ విద్య కోసం కందుకూరి కృషిని కొనియాడారు.

డిసెంబర్ 15 సాయంత్రం అనంతపురం లోని గడియార స్తంభం సమీపంలో పాత ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం జరిగింది. డా. జూటూరు షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కవిసమ్మేళనాన్ని కంబదూరు షేక్ నబీరసూల్ ప్రారంభించగా, డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర, కొండా శిరీష సమన్వయంలో దాదాపు 20 మంది కవులు కందుకూరి జీవితం, సంఘసంస్కరణ, రచనలు నేటి అవసరం గురించి కవితా స్వరాలు వినిపించారు. ప్రముఖ కవి మల్లెల నరసింహమూర్తి కవితలను సమీక్షించారు. కవి జూపల్లి ప్రేంచంద్, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి, యాడికి సూర్యనారాయణ రెడ్డి, హరిప్రసాద్, శివారెడ్డి, దాదా ఖలందర్, అనంత ప్రస్థానం నిర్వాహకుడు అశ్వర్థరెడ్డి, యు.టి.ఎఫ్. నాయకులు జిలాన్, ఐద్వా నాయకురాలు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 17 న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పూర్తి రోజు సాహిత్య సదస్సు జరిగింది. ప్రారంభ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి ఆహ్వానం పలికారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు డా.ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సన్నాహక కమిటీ గౌరవాధ్యక్షులు సింగమనేని నారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జ్ ఉపకులపతి ఆచార్య శుభ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా కందుకూరి వీరేశలింగం గట్టిగా ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ కందుకూరి వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఉందని, ఈనాటికీ కందుకూరి ఆశయాలు పూర్తిగా సఫలీకృతం కాలేదన్నారు. అనంతరం ప్రముఖ కవి తూముచెర్ల రాజారామ్ అధ్యక్షతన జరిగిన మొదటి సెషన్ లో విశ్రాంత రీడర్ డాక్టర్ కనుపర్తి విజయ భక్ష్ మాట్లాడుతూ, కందుకూరి వీరేశలింగం సంఘసంస్కరణ కృషిని, వితంతు పునర్వివాహాలు జరిపించడంలో ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. నేటికీ ఆయన కలలు గన్న సమాజం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కందుకూరి వ్యాసాలు, ఉపన్యాసాలలో ఆధునిక దృక్పథాన్ని వివరించారు. వీరేశలింగం నాటికంటే ఈరోజే మూఢ విశ్వాసాలు ఎక్కువగా ఉన్నాయని, వీరేశలింగం ఆలోచనలు నేటికి చాలా అవసరమన్నారు. భోజనానంతరం ఉపాధ్యాయిని శ్రీమతి రాధ అధ్యక్షతన జరిగిన రెండవ సదస్సులో హాస్యసంజీవని గురించి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ప్రసంగించారు. కందుకూరి నవలల గురించి డాక్టర్ బి.రాఘవేంద్ర ప్రసంగిస్తూ, కందుకూరి రాసిన రాజశేఖర చరిత్ర తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి నవలగా పేర్కొన్నారు. డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన మూడవ సదస్సులో డాక్టర్ కే.నాగేశ్వరాచారి ప్రసంగిస్తూ కందుకూరి స్వీయచరిత్ర ఆనాటి సమాజ పరిస్థితులకు ప్రతిబింబమని అన్నారు. చివరగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో ఎంతో మంది వీరేశలింగాలు జన్మించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ విద్యాసంస్థలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. తదుపరి జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. పోటీలో విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సదస్సులో ఇంకా సాహితీవేత్తలు డాక్టర్ శాంతి నారాయణ, మల్లెల నరసింహమూర్తి, నబీరసూల్, షహనాజ్, నిర్మలారాణి, అశ్వర్థరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్స్ నిర్మలమ్మ, బలభారతమ్మ, సి.ఆర్.డి.ఎస్. ప్రతినిధి బోస్, పెద్దిరెడ్డి, తరిమెల అమరనాథ రెడ్డి, పోకూరి చంద్రశేఖర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, యు.టి.ఎఫ్. జిల్లా కార్యదర్శి రమణయ్య ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర, డి.వై.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి కసాపురం ఆంజనేయులు, సాహితీస్రవంతి నాయకులు యాడికి సూర్యనారాయణ రెడ్డి, ప్రజ్ఞా సురేష్, రవిచంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, కృష్ణవేణి, ఐద్వా నాయకులు రామాంజినమ్మ, చంద్రిక, జ్యోతి, రెడ్స్ భానుజ, విశ్రాంత సి.డి.పి.ఓ. లక్ష్మీదేవి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

**- డా.ఎం.ప్రగతి**

# స్వీకారం



## మట్టిపోగు కవిత్వం


**పిళ్ళా కుమారస్వామి**

**వెల : 100/- పేజీలు: 92**

**ప్రతులకు : 9490122229**

ఇందులో చాలా కవితలు పొలాల చుట్టూ స్వేదజలాల చుట్టూ తిరిగాయి. అదేదో కృత్రిమ పదజాలంతో తెచ్చి పెట్టుకున్న సానుభూతితో కాదు. మట్టితో మమేకమైన మనసు పాడే పాటగా మనను వెన్నాడుతాయి ఇందులోని కవితలు.

**- తెలకపల్లి రవి**



## విధి కథలు


**పెరుక రాజు**

**వెల : 80/- పేజీలు: 94**

**ప్రతులకు: 09849618364**

ఎలా వుండేది! ఎలా వుంటున్నాం. ఎలా వుండాలో అద్దమోలె చూపించి ఆలోచింపజేసే చక్కని సామర్థ్యం కథకు వుంది. అది పొట్టి పొడవు ఏ కథైనా కావచ్చు! ఏ అంశమైనా సరే! కథ రాసుడు కాలయాపన! విధితో కూడుకున్న పని. అనుభూతి, ఆలోచన, ఆరాటం, పోరాటం, ఆవేశం, స్పందన విధిగా విలువలతో రాసిన వివిధ కథల వల్ల కలకాలం కలుగుతూనే వుంటుంది.

**- పెరుక రాజు**



## నీ సాహిత్యం నీ బొటనవేలిముద్ర

సాహితీ వ్యాసాలు

**యక్కలూరి వై శ్రీరాములు**

**వెల : 116/- పేజీలు: 110**

**ప్రతులకు: 9866171648**

ఈ సాహిత్య వ్యాసాలన్నీ చదివాక కొన్ని విషయాల గురించి సమగ్ర వివరణా, విషయ పరిజ్ఞానం తెలుసుకోడమే కాకుండా అంతకంటే అద్భుతమైన 'కవిత్వం' చదివిన అనుభూతి తప్పక కలుగుతుంది. నిజమైన, సరియైన కవి ఒక పూవు గురించి కవిత వ్రాసినపుడు రసజ్ఞుడైన పాఠకుడికి దాని పరిమళమూ, దాని కోమలత్వమూ, దాని అందమూ అన్నీ అనుభూతికి వచ్చి పరవశుడౌతాడు.

**- లక్కరాజు దేవి**



## మనంగా బతకాలని... కవిత్వం

**చింతాడ తిరుమలరావు**

**వెల : 50/- పేజీలు: 56**

**ప్రతులకు: 9441262559**

తన నిరంతర అధ్యయనంలో పదునుదేలి వాక్యాన్ని రసవంతంగా తీర్చిదిద్దుకుని చిక్కని కవిత్వంతో ముందు ముందు మరిన్ని కవితా సంపుటాలు వెలువరించే శక్తి సంపాదించుకోగలడీ కవి అని ఈ పుస్తకం హామీ యిస్తుంది. తన స్పందనలను ప్రతి కవితలోనూ, తనదైన శైలిలో, తనదైన చూపుతో ఆవిష్కరించి తన దృక్పథమేదో స్పష్టం చేసుకున్నాడు మిత్రుడు తిరుమలరావు.

**- గంటేడ గౌరునాయుడు**



## వెలుతురు గబ్బిలం కవిత్వం


**బండారి రాజకుమార్**

**వెల : 60/- పేజీలు: 136**

**ప్రతులకు : 9959914956**

మానసిక సంఘర్షణ ఇతని కవిత్వంలో ఎక్కువగా కన్పించే అంశం. భావపరిణితి, భాషాభిమానం, సామాజిక స్పృహ, పల్లెల్లో రైతుల కన్నీటి వానలు, రెక్కలిరిగిన పక్షుల్లా తల్లిదండ్రులు, స్త్రీలపై రోజు రోజుకీ పెరుగుతున్న హింస, వివక్షా రూపాలు, మారని సామాజిక స్థితిగతులు, ఇంకెన్నాళ్ళు అన్న ఆవేదనల కలబోతే ఈ కవిత్వం.

**- శిలాలోలిత**



## తెలంగాణ స్వరం

**ఆత్మ బంధం**

**మాదిరాజు రంగారావు**

**వెల : 30/- పేజీలు: 54**

**ప్రతులకు: 040-23398899**

ఈ కృతి అపుడపుడూ మిత్రుల కోరికపైన ప్రత్యేక సందర్భాలలోను వ్రాసిన స్వీయ పద్య రచనల సంపుటి. పద్యం పట్ల నా అభిమానాన్ని, గౌరవాన్ని తెలియజేసేవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకై జరిగిన ఉద్యమ దశల్ని మొదటి నుండి చూచిన వాళ్ళలో నేనొకణ్ణి. ఆ ప్రభావంతో చివరకు మంచి ఫలితాన్ని చూచిన సంతోషం స్పష్టం. ఇదే విధంగా 'ఆత్మ బంధం' కాల్పనిక స్పర్శనూ, మానవీయం సామాజిక వాస్తవ స్పృహనూ కలిగినవి.

**- మాదిరాజు రంగారావు**

# స్వీకారం




## గడ్డిపూలు కవిత్వం

**మాధవి పిన్నమనేని**

**వెల : 100/- పేజీలు: 84**

**ప్రతులకు: 9849210436**

ప్రతి వ్యక్తీ విభిన్నం నిజం. మాధవీ పిన్నమనేని గారి కవిత్వం కూడా విభిన్నమన్నది అంతే నిజం. సమాజం పట్ల ఒక అక్కరను వెలిబుచ్చేలా వుంది ఆమె కవిత్వం. నలుగురిని ప్రభావితం చేసేలా వుంది ఆమె కవితావేశం. ముఖ్యంగా తత్సమయానికి రక్తాన్ని ఉద్రేకపరిచేలాకాక, దీర్ఘకాలికమైనటువంటి ప్రయోజనాన్ని సమకూర్చే విధానంలో ఆలోచనాపరమైన మార్పునకు దోహదపడేలా వుంది.

**- రామజోగయ్య శాస్త్రి**




## మనం కాసేపు మాట్లాడుకుందాం... కవితా సంపుటి

**చందలూరి నారాయణరావు**

**వెల : 100/- పేజీలు: 86**

**ప్రతులకు: 9704437247**

ఏదో పోగొట్టుకున్న భావం నుండే ఎంతో సంతృప్తిని పొంది, మెదళ్ళను కదిలించే శక్తి, మనసు మొదళ్ళను చేరే యుక్తి ఉండేలా నాలుగు దిక్కుల ప్రపంచాన్ని నాలుగు గోడల మధ్య ఆవిష్కరించిన ఈ కవితలు ఆలోచించదగ్గవి. తక్షణం ఆస్వాదించతగ్గవి.

**- ఆర్.వి. రాఘవరావు**



## స్తబ్దత నుండి సమరం వైపు..

**పొత్తూరి సుబ్బారావు కవిత్వం**

**వెల : 100/- పేజీలు: 118**

**ప్రతులకు: 9490751681**

వస్తువు ఎలాంటిదైనా సరళంగా, సాత్వికంగా అభివ్యక్తం చేయడం సుబ్బారావుగారి ప్రత్యేకత. ఈయన కవిత్వంలో అమూర్తాభావాల అస్పష్టత ఉండదు. మోడర్న్ ఆర్టులోని సంక్లిష్టత కనిపించదు. ఆవేశం, ఉద్రేకం, ఉద్వేగం, ఆక్రోశం తనలో ఉన్నా, వాటిని సాంత్వన పరచి ఆస్వాదనీయమైన ఆలోచనామృతంగా అందించడం సుబ్బారావుగారి స్వీయశిల్పం. కఱకు కత్తితో యుద్ధాన్ని జయించడం కాదు, మెత్తని కరవాలంతో మనసుల్ని వశం చేసుకోవలనేది సుబ్బారావుగారి రచనాశిల్పంలోని అంతస్సూత్రం.

**- డా॥ వై. రామకృష్ణారావు**




## కవితా కుసుమాలు కవిత్వం

**వెల్లాల ఉమామహేశ్వర శర్మ**

**వెల : అమూల్యం - పేజీలు: 70**

**ప్రతులకు: 9290590653**

ప్రస్తుతం సమాజంలో వేళ్ళూనిన అనమానతలు, అవకతవకలు, లోటుపాట్లను వేలెత్తి చూపుతూ మార్గనిర్దేశం చేయవలెననే సంకల్పంతో 'కవితా కుసుమాలు' అను శీర్షికన అరవై కవితలకు మల్లె పందిరి వేశారంటే అతిశయోక్తి కాదు. ఈ గ్రంథం నిండా అన్ని మణిమాణిక్యాలే, నీతి బోధకాలె. తప్పుదోవ పడుతున్న సమాజాన్ని తన కవితల ద్వారా మార్గనిర్దేశం చేయాలన్న తపన శ్లాఘనీయం.

**- వేదా చంద్రయ్య**




హైకూ శతం

## సిరిమువ్వలు


**పురిజాల సుధాకర్**

**వెల : 15/- పేజీలు: 16**

**ప్రతులకు: 7702956929**

2001 నుండి 2012 వరకు వివిధ పత్రికలలో అచ్చైన హైకూలను మీ ముందు ఉంచుతున్నాను. హైకూ అనేది కేవలం పదిహేడు అక్షరాల ప్రక్రియ. ఇది 'మినీ కవిత' మాత్రం కాదు. మొదటి పంక్తిలో 5 అక్షరాలు, రెండవ పంక్తిలో 7 అక్షరాలు, మరలా మూడవ పంక్తిలో 5 అక్షరాలు మాత్రం వుండాలి. ఈ పదిహేడు అక్షరాలలో కవి చెప్పదల్చుకున్నది చెప్పి తీరాలి!!

**- పురిజాల సుధాకర్**




స్వేచ్ఛా కవిత్వం - 89 & 90

## ఇది జీవితం

**ఇది అందరిదీ & సమాంతరం**

**మాదిరాజు రంగారావు**

**వెల : 30/- పేజీలు: 64**

**ప్రతులకు: 040-23398899**

విషయం వైయక్తిక స్ఫూర్తితో సామాజిక విశ్లేషణతో తాత్విక స్పృహతో నిర్వహణ శిల్పాన్ని కలిగింది. భావరూపం ప్రతీక సముచితమైన ప్రవేశాన్ని పొందాయి. స్వేచ్ఛా కవిత్వంలో తనదైన ప్రత్యేకతను కలిగిన "ఇది జీవితం" బృహత్కృతిలో భాగం. "ఇది అందరిదీ".

**- మాదిరాజు రంగారావు**

# కర్నూలు జిల్లాలో గురజాడ 103వ వర్ధంతి సభలు

- కెంగార మోహన్






తెలుగు సాహిత్యానికి దశ దిశ నిర్దేశనం చేయగల రచనలు గురజాడ చేశారని దార్శనికతగల కవి గురజాడ అప్పారావు అని ఆత్మకూర్ పట్టణ సిఐ బి.కృష్ణయ్య అన్నారు. ఆత్మకూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నవంబర్ 30న జరిగిన గురజాడ 103వ వర్ధంతిసభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డా.బి.లత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గురజాడ చరిత్రలో నిలిచిపోయే రచనలు చేశారని అవి సమాజంపై చాలా ప్రభావం చూపాయన్నారు. జిల్లా నాయకులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో గురజాడ రచనలు ప్రత్యేకమైనవని, సంప్రదాయభాషా బంధానాలనుండి తెలుగును విముక్తి కల్పించడంలో గురజాడ పాత్ర అనిర్వచనీయమన్నారు. ప్రధానవక్తగా హాజరైన సాహితీస్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగార మోహన్ మాట్లాడుతూ గురజాడను స్ఫూర్తిగా తీసుకుని సమాజాన్ని ముందుకు నడిపించుకుని వెళ్ళాల్సిన అవసరం నేటి తరం మీద ఉందన్నారు. కర్నూలు బాలశివ కళాశాల తెలుగు శాఖాధిపతి డా.భీమ్మోహన్ రావు మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలపై పోరాడి సంఘాన్ని సంస్కరించిన మహాకవి గురజాడ అన్నారు. సాహితీస్రవంతి జిల్లా సహాయ కార్యదర్శి, సాహిత్య ప్రస్థానం జిల్లా ఇంచార్జి యు.సుబ్బన్న మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో గురజాడ రచనలు వెలుగుబాటలు వేశాయన్నారు. తెలుగు సాహితీలోకంలో ధృవతారగా నిలిచాడన్నారు. సభాధ్యక్షత వహించిన డా.బి.లత మాట్లాడుతూ సమాజంలో మార్పుకు గురజాడ తన రచనల ద్వారా కృషిచేశారన్నారు.

**సాహితీస్రవంతి ఆత్మకూర్ కన్వీనర్ గా యస్.బాలాజీరావ్**

సాహితీస్రవంతి ఆత్మకూర్ కేంద్రానికి సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా యస్.బాలాజీరావ్, కో-కన్వీనర్‌గా డా.బి.లత, సభ్యులుగా దామరేకుల రవి, జవహార్ నాయక్, యూసూఫ్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను జిల్లా నాయకులు అభినందించారు. ప్రపంచీకరణ, మతోన్మాదంలకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ దిశలో సంఘం పనిచేయాలని సూచించారు.

నంద్యాల డివిజన్ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో హనీఫ్ నగర్ లోని రోటరీ పబ్లిక్ స్కూల్‌లో గురజాడ 103వ వర్ధంతి సభ నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బయ్య, శ్రీనివాసమూర్తి, మాదాల శ్రీనివాసులు, అల్ఫోన్స్, మాబుబాష, నీలకంఠమాచారి పాల్గొన్నారు.

నందవరం మండలం సోమలగూడూరు యంపియుపి పాఠశాలలో సాహితిస్రవంతి ఆధ్వర్యంలో గురజాడ 103వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు యస్ సుధాకర్ ఆధ్యక్షతన సభ నిర్వహించారు. సభకు సాహితీస్రవంతి జిల్లా నాయకులు నల్లబోతుల నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో గ్రామస్థులు పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, నారాయణ, అబ్దుల్ ఖాదర్, నరసప్పలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూర్ మండలం దైవందిన్నె యంపిపియస్ పాఠశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జిల్లా నాయకులు ఎన్.నాగమణి అధ్యక్షతన గురజాడ 103వ వర్ధంతి సభ జరిగింది. గురజాడ ఆశయ సాధనకు కృషిచేస్తామని వక్తలు ప్రతినబూనారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతారాణి, సోనా, సబిత తదితరులు పాల్గొన్నారు.

డోన్ మండలంలో యర్రగుంట్ల యంపియుపి పాఠశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గురజాడ 103వ వర్ధంతి సభ ను నిర్వహించారు. జిల్లా నాయకులు డా.సంజీవరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ♦

## విజయనగరంలో గురజాడ వర్దంతి సభ

విజయనగరంలో గురజాడ కేంద్ర గ్రంథాలయం భవనంలో చాసో సాహిత్య వేదిక వద్ద గురజాడ 103వ వర్ధంతి సందర్భంగా నవంబర్ 30న సాహితీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చాగంటి తులసి మాట్లాడుతూ గురజాడ తన రచనల్లో స్త్రీని ఆధునిక భావాలతో తీర్చిదిద్దారన్నారు. ఎయు విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గురజాడ సామాజిక అంశాలను, మానవత్వాన్ని, మనిషిని కేంద్రంగా చేస్తూ రచనలు చేశారన్నారు. హైదరాబాద్‌కు చెందిన హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ మట్లాడుతూ గురజాడ సృష్టించిన ప్రతి పాత్రలోనూ హాస్యం తొణికిస లాడుతుందని అన్నారు. హాస్యాన్ని ప్రధాన పాత్రగా చేస్తూ సజీవ పాత్రలు సృష్టించారని కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొద్దల నరసింగరావు మాట్లాడుతూ కళాభారతి వేదిక ను బాగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు పువ్వాడ ట్రస్టు చైర్మన్ సుబ్బరాజు, గురజాడ ముని మనుమడు వెంకటప్రసాద్, గురజాడ సాహితీ సామాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు, అధ్యక్షులు పివి నర్సింహరాజు, సాహితీ స్రవంతి సభ్యులు చీకటి చంద్రిక, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




**ఇనుగంటి జానకి పుస్తకాల ఆవిష్కరణ**

ప్రముఖ రచయిత ఇనుగంటి జానకీ రాసిన కన్యాశు ల్కం హిందీ నాటకాన్ని, జీవన కాంక్ష కవితా సంకలనాన్ని ఆచార్య రజిత కృష్ణ. డాక్టర్ డివిజి శంకరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఎస్ఎస్ శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా రజిత కృష్ణ మాట్లాడుతూ తెలుగులో ప్రసిద్ధిచెందిన ఓ మహాకావ్యాన్ని హిందీలో సాహిత్య ప్రపంచానికి పరిచయం చేయడం ముదావహమని అన్నారు. మరిన్ని రచనలు హిందీలోకి అనువదించాలని రచయిత్రి ఇనుగంటి జానకిని కోరారు. డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ గుజాడ రచనల్లో మహిళల ప్రాధాన్యతను తన రచనల ద్వారా చూపారని తెలిపారు. అనంతరం జీవన కాంక్ష కవితా సంపుటిపై ప్రముఖ కవి రామతీర్థ, కవయిత్రి జగద్ధాత్రి, పి.కమలకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి పాయల మురళీకృష్ణ, చాగంటి తులసి, చీకటి చంద్రికరాణి, రామకృష్ణ, గంటేడ గౌరినాయుడు, దేవరాజు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ♦

## 'ఎక్స్‌రే' ఆధ్వర్యంలో నెలనెలా వెన్నెల




*విజయవాడలో చంద్ర రాజేశ్వరరావు లైబ్రరీహాలులో ఎక్స్‌రే సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 2న జరిగిన నెలనెలా వెన్నల సభలో ప్రసంగిస్తున్న సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్. చిత్రంలో బోడి ఆంజనేయ కుమార్, ఎక్స్‌రే అధ్యక్షులు కొల్లూరి, రవి కిరణ్ తదితరులు*

సమాజం పట్ల అవగాహన, సమస్యలపై స్పందించే గుణం కవికి అవసరమని, అధ్యయనం చేయడం ద్వారానే ఉత్తమ కవిత్వం రాయగలుగుతారని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ అన్నారు. విజయవాడలో చంద్ర రాజేశ్వరరావు లైబ్రరీ హాలులు డిసెంబరు 2న ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన నెలనెలా వెన్నెల కవి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్‌రే సంస్థ అధ్యక్షులు కొల్లూరి మాట్లాడుతూ సమాజ దర్పణంగా కవిత్వం ఉండాలని అన్నారు. కార్యదర్శి బి. ఆంజనేయరాజు మాట్లాడుతూ మరిన్ని సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం 'పల్లె మనసు' అంశంపై కవి సమ్మేళనం జరిగింది. సింగంపల్లి అశోక్ కుమార్, కొండపల్లి మాధవరావు, కారంచేటి విజయకుమార్, బి.ఆర్.సి. మూర్తి తదితరులు పాల్గొన్నారు. ♦

## 'కవిత్వ భాష' ఆవిష్కరణ




కాకినాడ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కాకినాడలోని రోటరీక్లబ్ సమావేశ మందిరంలో డిసెంబర్ 23న బొల్లోజు బాబా వ్యాస సంపుటి 'కవిత్వ భాష' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సభాధ్యక్షులు జోశ్యుల కృష్ణబాబు మాట్లాడుతూ మంచి సాహిత్య వాతావరణం నుండి వచ్చిన బాబా ఆకుపచ్చని తడిగీతం, వెలుతురు తెర, స్వేచ్ఛా విహంగాలు వంటి కవితా సంకలనాలు, ఫ్రెంచి పాలనలో యానాం వంటి చారిత్రక పరిశోధన గ్రంధాన్ని ఇంతకుముందే వ్రాసారని, ఇప్పుడు 'కవిత్వ భాష' అనే ఈ గ్రంథం ద్వారా 'మామూలు భాషలో సమాచారం మాత్రమే ఉంటుంది, కవిత్వ భాషలో అనుభూతి, ఉద్వేగం, ఊహాశాలిత, ప్రజ్ఞ అనే లక్షణాలు" ఉండాలంటూ క్రొత్త తూకం రాళ్ళతో కవిత్వాన్ని కొలుస్తూ 19 వ్యాసాలతో ఈ గ్రంథాన్ని రాశారని అన్నారు. ఆత్మీయ అతిథి వాడ్రేవు వీరలక్ష్మీదేవి ఈ పుస్తకం చదివి ఏది కవిత్వమో? ఏది కవిత్వం కాదో కవిత్వం రాయాలనుకునేవాళ్ళు తేల్చుకొంటారని చెప్పారు. పుస్తకానికి ముఖచిత్రాన్ని తీర్చిదిద్దిన ముమ్ముడి చిన్నారి కవిత్వం రాయబోయే తరానికి ఈ కవిత్వ భాష పుస్తకం ఉపకరిస్తుందని అన్నారు.

కవిత్వ భాష పుస్తకాన్ని పరిచయం చేసిన పుప్పాల శ్రీరామ్ కవిత్వం రాయటానికి ఈ పుస్తకం చదవాల్సిన పనిలేదేమో గాని, మంచి కవిత్వం రాయటానికి మాత్రం చదివి తీరాలని అన్నారు. సంకర గోపాలయ్య మాట్లాడుతూ మెటాఫర్‌కి, మెటానమీకి ఉన్న భేదాన్ని బాబా చక్కగా వివరించారని అన్నారు. డా॥ రెంటాల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బాబా వ్యాసాల్ని ఎంతో విలువైన వ్యాసాలుగా పేర్కొంటూనే 'అండర్‌స్టేట్‌మెంట్' వంటి అంశాలతో విభేదించారు. బొల్లోజు బాబా తన స్పందనలో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సభలో సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, భగ్వాన్, మంజులాబాయి, సాయి సాత్యనారాయణ, సీతారామరాజు, సాలార్, మన్మధ రావు, ఎమ్.ఎస్. నారాయణ, రావు కృష్ణారావు, కె. శివ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ◆



*సాహితీస్రవంతి అమరావతి నగర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో డిసెంబరు 23న జరిగిన 'ఒక భార్గవి' పుస్తక పరిచయ సభలో ప్రసంగిస్తున్న పుస్తక రచయిత్రి డాక్టర్ భార్గవి. చిత్రంలో డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు, బాలాంత్రపు ప్రసూన, సత్యాజీ ఉన్నారు.*




*ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన 'ఇంటింటి భాగోతం' స్త్రీవాద హాస్యనాటకం పుస్తకాన్ని గుంటూరులో జరిగిన అరసం 18వ రాష్ట్ర మహాసభల్లో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో నల్లూరి వెంకటేశ్వర్లు, పుస్తక రచయిత వల్లూరి శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ, గంగోత్రి సాయి తదితరులు*

## 'శ్వేత గులాబితోట' ఆవిష్కరణ



నెల్లూరు జిల్లా సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నెల్లూరు పట్టణంలోని వర్ధమాన సమాజమందిరంలో డిసెంబర్ 10న డా॥ ఈదూరి సుధాకర్ రాసిన 'శ్వేత గులాబీతోట' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఆవిష్కరించారు. చెలంచెర్ల భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభలో యండమూరి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని చాటి చెపుతున్న ఈదూరి సుధాకర్ కవిత్వంలో ఆవేశం, ఆవేదన నిండి ఉన్నాయనీ, ముప్ఫై సంవత్సరాలుగా కవిత్వ సృజన చేస్తున్న డా॥ ఈదూరు సుధాకర్ ఆలస్యంగా తన కవితా సంకలనం వెలువరించినా మంచి కవితలను పాఠకులకు అందించారన్నారు. టి.వి. సీరియళ్ళ ప్రభావంతో ప్రస్తుతం సాహిత్యానికి పాఠకులు కరువయ్యారని, అయినప్పటికీ మంచి పుస్తకానికి ఆదరణ లభిస్తూనే ఉన్నదని ఆయన తెలిపారు. నవలా సాహిత్యంలో గోపీచంద్, కొడవటిగంటి చేసిన రచనలు సరికొత్త విలువలను సమాజానికి నేర్పించాయని, ఆడపిల్లలను నవలా పఠనంవైపు మళ్ళించిన ఘనత యద్దనపూడి సులోచనారాణి గారికే దక్కుతుందని అన్నారు. పుస్తక రచయిత డా॥ ఈదూరి సుధాకర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్లనే పుస్తకం వెలువరించడం ఆలస్యమైందని, నెల్లూరు జిల్లా జైలులో ఉన్న ఖైదీలకు వైద్యసేవలు అందించిన కాలంలో వారితో సన్నిహితంగా మెలుగుతూ వారి నుంచి గ్రహించిన అంశాలను కవితా వస్తువుగా చేసుకుని 'శ్వేత గులాబితోట' సంపుటి వెలువరిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. గోపినాథ్, కార్యదర్శి ఈతకోట సుబ్బారావు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాతూరి అన్నపూర్ణ, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, పెన్నా రచయితల సంఘం కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ♦

## వేంపలె షరీఫ్‌కు చాసో పురస్కారం



గుంటూరు జిల్లా వేంపల్లెకు చెందిన షేక్ మహమ్మద్ షరీఫ్‌కు 2018 సంవత్సరానికి గాను చాసో పురస్కారానికి ఎంపికచేసినట్లు చాసో స్ఫూర్తి సాహితీట్రస్టు అధ్యక్షులు, ప్రముఖ కథా రచయిత చాగంటి తులసి విజయనగరంలో జరిగిన ఒక ప్రెస్‌మీట్‌లో తెలిపారు. ప్రముఖ కథా రచయిత చాగంటి సోమయాజులు (చాసో) 104వ జయంతి పురస్కరించుకుని జనవరి 17న విజయనగరంలోని చాసో సాహితీవేదిక వద్ద ఈ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం పొందిన వేంపల్లె షరీఫ్ 'జుమ్మా', 'టోపి జబ్బార్' కథా సంపుటాలు వెలువరించారని, సమకాలీన తెలుగు కథా సాహిత్యంలో మంచి కథకుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో చీకటి దివాకర్, జి.ఎస్. చలం పాల్గొన్నారు. ♦

## శిఖామణి, ఇబ్రహీం నిర్గుణ్‌లకు 2018-విమలాశాంతి సాహిత్య పురస్కారాలు

విమలాశాంతి సాహిత్య పురస్కారం 2018 గాను 'చూపుడు వేలు పాడే పాట' కవితా సంపుటికి గాను శిఖామణికి, 'ఇప్పుడేదీ రహస్యం కాదు' కవితా సంపుటికి గాను 'ఇబ్రహీం నిర్గుణ్' కి ప్రకటించినట్లు శాంతినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 'శాంతి రజనీకాంత్ స్మారక కవితా పురస్కారాలు' పేరుతో వీటిని 2019 జనవరిలో జరిగే పురస్కార ప్రదానోత్సవ సభలో అందివ్వనున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.7500ల నగదు, పురస్కార జ్ఞాపిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పురస్కార ఎంపికకు ప్రముఖ రచయితలు అమ్మంగి వేణుగోపాల్, కొప్పురి వెంకటరమణమూర్తి, తూముచెర్ల రాజారాం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు తెలిపారు. ఈ పురస్కారానికి యువ కవులతో పాటు ప్రముఖ కవులు తమ సంపుటాలను పంపారని, వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ♦

## ‘మట్టిపోగు’ కవితా సంపుటి ఆవిష్కరణ



అనంతపురం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో అనంతపురంలో డిసెంబర్ 2న పిళ్ళే కుమారస్వామి కవితా సంపుటి ‘మట్టిపోగు’ ఆవిష్కరణసభ జరిగింది. ఈ సభకు తారళ జోత్స్న అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ జీవితపు పోగులను కలిపి ‘మట్టిపోగు’గా పిల్లాకుమారస్వామి ఆవిష్కరించారన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన రాధా స్కూలు అధినేత జయచంద్ర మాట్లాడుతూ మట్టికి మట్టిమనిషికి మధ్య ఒక వంతెనలాగా ఈ మట్టిపోగు నిలుస్తుందన్నారు. పుస్తక సమీక్షకులుగా హాజరైన ప్రముఖకవి మల్లెల నరసింహామూర్తి మాట్లాడుతూ పిల్లాకుమారస్వామి స్త్రీలపక్షాన, దళితుల పక్షాన, రైతుల పక్షాన నిలబడిన కవనీ అన్నారు. రైతులతో దేశపటంపై ఆకుపచ్చ సంతకం చేయించాలనడం వంటి మంచి కవితా వాక్యాలు ఈ సంపుటిలో ఉన్నాయన్నారు. పుస్తకం మనిషిలో జ్ఞాన దీపం వెలిగిస్తుందన్నారు. ముఖ్యఅతిథి కేంద్రసాహిత్య అకాడమీ కౌన్సిల్ సభ్యులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సామాజిక పరివర్తనకు సాధనమన్నారు. రచయితకు నిర్థిష్ట భావజాలం వుందన్నారు. పిల్లాకుమారస్వామి సమానదృష్టి ఉండటంవల్ల, మార్క్సిస్టు సాహిత్యం పట్ల అవగాహన ఉండటం వల్ల మట్టిపోగు కావ్యంలో దళితులు, స్త్రీలు, రైతులు, కార్మికులు అందరూ చోటుచేసుకున్నారన్నారు. మట్టిని విస్మరించిన నేలపైనే ఉండి ప్రజాజీవితాన్ని ఆవిష్కరంచడం అవసరమన్నారు. రచయిత పిల్లా కుమారస్వామి మాట్లాడుతూ అనేక సామాజిక ఉద్యమాల ప్రభావంతో తాను కవిత్వం రాశానన్నారు. ఈ కవిత్వం ప్రజలకే చెందుతుందన్నారు. సాహిత్యం సమాజాన్ని చైతన్యం చేస్తుందని తెలిసిన తరువాత కవిత్వాన్ని సామాజిక సందర్భాల కనుగుణంగా వ్యక్తీకరించానన్నారు. రైతులు ఢిల్లీ పురవీధులలో పోరాటంచేస్తున్న సందర్భంలో ‘మట్టిపోగు’ ఆవిష్కరించరించడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఈ సభను సాహితీస్రవంతి అనంతపురం ప్రధానకార్యదర్శి దాముగుట్ల హిమాయతుల్లా సమన్వయం చేసినారు. నిర్మలారాణి, గోవిందరాజచారి, శాంతినారాయణ, సత్యానిర్ధారణ్, బాలికొరడ ఆంజనేయలు, నాగేశ్వరాచారి, ఎ.ఎ.నాగేంద్ర, సూర్యనారాయణ రెడ్డి, రియాజుద్దీన్, క్రిష్ణవేణి, హరినాధరెడ్డి, వెంకటరత్నం, లక్ష్మీగౌరమ్మఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు. ♦

## శశిశ్రీ స్మారక సాహిత్య పురస్కారం 2019

శశిశ్రీ స్మారక సాహిత్య పురస్కారం 2018 కోసం ఆధునిక సాహిత్య అనువాద గ్రంథాలను ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కార కమిటీ తరపున కేతు విశ్వనాథ రెడ్డి, షేక్ హుస్సేన్ సత్యాగ్ని, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఈ అంశాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. సంవత్సరానికి ఒకో అంశాన్ని ప్రకటిస్తున్నామని తెలిపారు. 2016 జనవరి నుండి 2018 డిశంబర్ 31 మధ్య కాలంలో ప్రచురితమైన అనువాద గ్రంథాల్ని ఈ పురస్కారం కోసం పంపించవలసిందిగా కోరారు. గ్రంథం కనీసం 100 పేజీలు ఉండాలని, 4 కాపీలను షేక్ మస్తాన్‌వలి, జర్నలిస్టు, 38–712, పి.ఎస్. నగర్, సెంట్రల్ ప్రిజన్ పోస్టు, కడప – 2 చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9494111310 ద్వారా సంప్రదించవచ్చును. ♦

## ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2018

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు–2018 కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ చైర్మన్ డా. ఉమ్మడిశెట్టి రాధేయ ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు పరిశీలన కోసం 2018 సంవత్సరంలో ప్రచురణ పొందిన కవితా సంపుటాలను మాత్రమే పంపాలి. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటకి అయిదు వేలు రూపాయలు నగదు, షీల్డ్ కవికి అందజేయనున్నట్లు తెలిపారు. జనవరి 31వ తేదీ లోగా నాలుగు ప్రతులు ఈ దిగువ చిరునామాకు పంపవలసిందిగా కోరారు. డా. ఉమ్మడిశెట్టి రాధేయ, ఛైర్మన్, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, 13–1–606–1 షిర్డీ నగర్, రెవిన్యూ కాలనీ, అనంతపురం–515001. ఇతర వివరాలకు 9985171411 ద్వారా సంప్రదించవచ్చును. ♦

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**